

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్

epaper.vaartha.com WWW.VAARTHA.COM

: fb.com/vaartha Digital

19-5-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 108 పేజీలు: 10+4 వెల: 6.50

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam



ఓవర్‌లోడ్ వాహనాలపై అధిక టోల్ ఫీజు 3

బెంగాల్‌లోను మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం 5


## భారత్, నార్వే మధ్య 100 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్యం

7

నార్వే ప్రధాని జోనాస్‌గర్ స్టోరేతో ప్రధానిమోడీ భేటీ




సోమవారం ఓస్లోలో ప్రధాని మోడీకి 'గ్రాండ్‌క్రాస్ ఆఫ్ రాయల్ నార్వేజియన్ ఆర్డర్'ను ప్రదానం చేస్తున్న నార్వేరాజు హెరాల్డ్ వి

ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణం చేయించిన గవర్నర్ అర్లేకర్

20 మంది మంత్రులలో రమేశ్ చెన్నితల, కె.మురళీధరన్

హాజరైన మల్లికార్జున్‌ఖర్గే, రాహుల్, ప్రియాంకగాంధీ, పినరైవిజయన్ ప్రభృతులు



## కేరళం పీఠంపై సతీశన్

5



మరో వారం ఇంతే...

ఏడు జిల్లాలకు రెడ్ అలర్ట్

## ఎండ మంటలు

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎండల తీవ్రత చుక్కలు చూపిస్తోంది. మొన్నటి వరకు ఆరెంజ్ అలర్ట్‌తో సరిపెట్టిన వాతావరణశాఖ ఇప్పుడు పరిస్థితి తీవ్రతను బట్టి కొన్ని ప్రాంతాలకు "రెడ్ అలర్ట్" జారీ చేసింది. బయట కాలు పెడితే నిప్పుల కొలిమిలా మండుతున్న ఎండలు ప్రజానీకాన్ని బెంబెళెత్తిస్తున్నాయి. ఉదయం 10 గంటల నుండే భానుడు సెగలు కక్కుతుండడంతో వడదెబ్బ బారిన పడి ప్రాణాలు విడుస్తున్న ఘటనలు నిత్యం చోటు చేసుకుంటున్నాయి. ఏకంగా 45 డిగ్రీల నుంచి 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో జనాలు బయటకి రావాలంటేనే భయపడుతున్నారు.ఎండ తీవ్రత, వడగాల్పులనేపథ్యంలోభారత వాతావరణశాఖ >>2

## ప్రధాని మోడీకి నార్వే అత్యున్నత పురస్కారం

'గ్రాండ్‌క్రాస్ ఆఫ్ రాయల్ నార్వేజియన్ ఆర్డర్'ను ప్రదానం చేసిన నార్వేరాజు హెరాల్డ్ వి

మోడీకి ఇది 32వ అంతర్జాతీయ గౌరవం

**ఓస్లో, మే 18:** ప్రధాని మోడీ తన విదేశీ పర్యటనలో మరో అరుదైన అంతర్జాతీయ గౌరవ పురస్కారం అందుకున్నారు. నార్వే పర్యటనలో ఉన్న ప్రధానికి ఆదేశ అత్యున్నత పురస్కారం లభించింది. 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ రాయల్ నార్వేజియన్ ఆర్డర్' పురస్కారం అందుకున్నారు. ఓస్లోలో నార్వే రాజు హెరాల్డ్ వి నుంచి ప్రధాని ఈ పురస్కారం అందుకున్నారు. ప్రపంచదేశాల నుంచి మోడీ 32వ ప్రధాన పురస్కారాన్ని అందుకున్నారు. ఇది 140 కోట్ల మంది భారతీయులకు గర్వకారణమని మోడీ పేర్కొన్నారు. ప్రధాని మోడీ ఐదు దేశాల పర్యటనల భాగంగా సోమవారం మోడీ నార్వేకు చేరుకున్నారు. ఓస్లోలో ఘనస్వాగతం లభించింది. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై చర్చ జరిగింది. అనంతరం నార్వేకు చెందిన అత్యున్నత పురస్కారమైన గ్రాండ్ క్రాస్ ఆఫ్ ది రాయల్ నార్వేజియన్ ఆర్డర్ ఆఫ్ మెరిట్‌ను మోడీకి ప్రదానం చేశారు. విదేశాల నుంచి >>2

# ప్రజా భద్రతే టార్గెట్

ప్రపంచస్థాయి సాంకేతికతతో విపత్తు రక్షణ వ్యవస్థ బలోపేతం

ప్రమాదాల సమయంలో 'గోల్డెన్ అవర్' కీలకం

ముందస్తు సన్నద్ధత, శాఖల మధ్య సమన్వయం ఎంతో అవసరం

మాక్‌డ్రిల్, సమీక్షలో మంత్రి పొంగులేటి



సోమవారం హైదరాబాద్‌లో భారీ విపత్తు నిర్వహణ మాక్ డ్రిల్ పరిశీలించిన మంత్రి పొంగులేటి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే18:** ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడడం, వీలైనంత వరకూ ఆస్తులకు నష్టం కలగకుండా చూడడమే లక్ష్యంగా ప్రభుత్వ పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు ప్రపంచస్థాయి సాంకేతికతతో విపత్తు రక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న విపత్తు నిర్వహణ మాక్ ఎక్సర్‌సైజ్‌లలో భాగంగా, హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్ హెచ్ఎండీఏ గ్రౌండ్స్ వద్ద సోమవారం నిర్వహించిన మాక్ డ్రిల్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. అనంతరం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వివిధ శాఖల ఉన్నతాధికారులతో విపత్తు నిర్వహణపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... వివిధ రాష్ట్రాలలో అమలు చేస్తున్న అత్యుత్తమ విధానాలకు అనుగుణంగా తెలంగాణలో విపత్తు నిర్వహణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని మంత్రి వెల్లడించారు. ప్రకృతి విపత్తులు, అగ్నిప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కొవడానికి ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని, అత్యాధునిక పరికరాలను పరిశీలించి, వాటి వివరాలతో కూడిన సమగ్ర నివేదికను, ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సహకారంతో నిర్వహిస్తున్న ఈ మాక్ డ్రిల్ ద్వారా లభించే అనుభవాలతో అధికారులు >>2



## ఇతర రాష్ట్రాలు తెలంగాణ డిస్కం బాటలోకి

విద్యుత్ సంస్కరణల్లో రాష్ట్రం ఆదర్శం

పంపిణిలో ఆర్థిక క్రమశిక్షణకు దోహదం

జూన్2 నుంచి పుర్తి స్థాయి కార్యకలాపాలు

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త:** ఉచిత, సబ్సిడీ విద్యుత్ నిమిత్తం పలు రాష్ట్రాలు తెలంగాణను స్ఫూర్తిగా తీసుకుంటున్నాయి. తెలంగాణ సర్కార్ ఉచిత, సబ్సిడీ విద్యుత్ నిమిత్తం ఏర్పాటు చేసిన ప్రత్యేక విద్యుత్ పంపిణీ వ్యవస్థలను ఏర్పాటు చేసేందుకు రాష్ట్రాలు చర్యలు చేపట్టాయి. ప్రత్యేక పంపిణీ సంస్థ (డిస్కామ్) ఏర్పాటు చేయడం, ఎత్తిపోతల ప్రాజెక్టులు చేపట్టడం, విద్యుత్ రంగాన్ని క్రమబద్ధీకరించడం వంటి తెలంగాణ ప్రభుత్వ చర్యలను బీజేపీ, ఎన్డీఏ పాలిత రాష్ట్రాలు అనుసరిస్తున్నాయి. తెలంగాణలోని కొత్తగా ఏర్పాటు చేసిన ఉచిత పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్‌ను స్ఫూర్తిగా తీసుకుని, ఆంధ్రప్రదేశ్, హర్యానా మహారాష్ట్ర రాష్ట్రాలు తాజాగా ఉచిత, సబ్సిడీ విద్యుత్ పంపిణీ కంపెనీలను ప్రకటించాయి. విద్యుత్ సరఫరాను నిర్ధారించడం, భారీ సబ్సిడీలను వేరు చేయడం ద్వారా ఆర్థిక భారం మోస్తున్న విద్యుత్ పంపిణీ సంస్థలను పునర్నిర్మించడం, బకాయిల బాధ్యతలను స్వీకరించి నిర్వహణకు సిద్ధంగా ఉన్న తెలంగాణ మూడో ప్రత్యేక డిస్కం బ్లూప్రింట్‌ను పరిగణలోకి తీసుకుని ఆయా రాష్ట్రాలు చర్యలు చేపట్టాయి. సబ్సిడీల భారంతో డిస్కామ్‌లు దీర్ఘకాలంగా కుదేలవుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనతో ఏర్పడిన కొత్త ప్రత్యేక డిస్కామ్, ఉచిత, సబ్సిడీ విద్యుత్ సరఫరాను క్రమబద్ధీకరించడానికి, సుస్థిర ఇంధనానికి మార్గం సుగమం చేయడానికి, సబ్సిడీల లక్ష్య నిర్దేశాన్ని మెరుగుపరచడానికి, పంపిణీ కార్యకలాపాలలో ఆర్థిక క్రమశిక్షణను పెంపొందించడానికి దోహదపడుతుందని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ ఉచిత ప్రత్యేక డిస్కాం ఇప్పటికే కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నుంచి ఆమోదం పొందింది. అలాగే తెలంగాణ >>2



ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్‌లో సోమవారం డిజిపి ఆనంద్, సలహాదారు శివధర్ రెడ్డి, గ్రే హౌండ్స్ చీఫ్ అనిల్ కుమార్, మల్కాజిగిరి సిపి సుమతిలను సత్కరిస్తున్న కేంద్రమంత్రి అమిత్ షా

తెలంగాణ నక్సల్స్ రహితం

## పోలీసు కృషి అద్వితీయం

పలువురు పోలీసు అధికారులను ఘనంగా సన్మానించిన కేంద్రహోంమంత్రి అమిత్ షా

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త:** తెలంగాణను నక్సల్స్ రహిత రాష్ట్రంగా మార్చడంలో విశేషంగా కృషి చేసిన పోలీసు అధికారులను కేంద్ర హోం మంత్రి అమిత్ షా సోమవారం నాడు సత్కరించారు. ఛత్తీస్‌ఘడ్‌లోని ఒకప్పటి నక్సల్స్ ప్రభావిత ప్రాంతమైన జగదల్‌పూర్‌లో జరిగిన కార్యక్రమంలో డిజిపి సి.వి ఆనంద్, మాజీ డిజిపి, ప్రస్తుత ప్రభుత్వ సలహాదారు శివధర్ రెడ్డి, గ్రే హౌండ్స్ చీఫ్ అనిల్ కుమార్, నాటి ఎస్ఐబి ఐజి, ప్రస్తుత మల్కాజిగిరి పోలీసు కమిషనర్ సుమతితో పాటు ఎస్ఐబి అధికారులను అమిత్ షా ప్రత్యేకంగా సన్మానించారు. తెలంగాణ పోలీసులతో పాటు ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, ఒడిషా రాష్ట్రాలకు చెందిన పోలీసు అధికారులకు కూడా ఈ సన్మానం జరిగింది. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ ఒకప్పుడు దేశంలోని అనేక ప్రాంతాలలో నక్సలైట్ల కార్యకలాపాలు ఎక్కువగా వుండేవని, దీనివల్ల సామాన్య జనంతో పాటు అన్ని వర్గాల వారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారని తెలిపారు. నక్సలైట్ల కార్యకలాపాలను పూర్తిగా అణచివేసేందుకు కేంద్రం చేబట్టిన ఆపరేషన్ కగార్ వల్ల మావోయిస్టులు వేల సంఖ్యలో ఆయుధాలతో లొంగిపోయారని ఆయన తెలిపారు. మావోయిస్టులను జనజీవన స్రవంతిలో కలిసేందుకు విశేషంగా కృషి చేసిన పోలీసు అధికారుల్లో తెలంగాణకు చెందిన >>2

ఘోర ప్రమాదం

## పెళ్లి బృందం వ్యాన్‌ను ఢీకొన్న కంటైనర్

12 మంది దుర్మరణం

**ముంబై, మే 18:** మహారాష్ట్రలోని పాల్‌ఘర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ముంబై-అహ్మదాబాద్ జాతీయ రహదారిపై జరిగిన ఈ ప్రమాదంలో 12 మంది మృతి చెందగా, మరో 25 మందికిపైగా గాయపడ్డారు. సమాచారం అందగానే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెళ్లి బృందంతో వెళ్తున్న ట్రక్కును వేగంగా వచ్చిన కంటైనర్ ఢీకొట్టింది. కంటైనర్ ఢీకొన్న తీవ్రతకు వాహనం పూర్తిగా దెబ్బతిన్నది. ఘటనాస్థలిలోనే పదిమందికిపైగా మృతి చెందారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారిని సమీప ఆస్పత్రులకు తరలించి >>2



## బుల్లెట్‌ట్రైన్ ఫస్ట్‌లుక్ విడుదల

ముంబయి- అహ్మదాబాద్ మధ్య నడవనున్న రైలు

**ముంబయి, మే 18:** దేశంలోని ముంబయి అహ్మదాబాద్‌లమధ్య నడిచే బుల్లెట్‌రైలు ప్రాజెక్టుకు సంబంధించిన తొలి ఫోటోను విడుదలచేసారు. రెండునగరాలమధ్య పరుగులు తీసే హైస్పీడ్ రైలుకు సంబంధించిన ఫోటో ఢిల్లీలోని రైల్వే మంత్రిత్వశాఖ గేటు నంబర్ 4 వద్ద సోమవారం ప్రదర్శించారు. ఈచిత్రం >>2





## ఆ చెట్లను కొట్టొద్దు

హైదరాబాద్ కెబిఆర్ పార్క్ పరిధిలోని చెట్ల నరికివేతపై స్టే

'ఎకో సెన్సిటివ్ జోన్'లోని చెట్లను కొట్టివేయరాదని సుప్రీం ఆదేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే18:** హైదరాబాద్ నగరంలోని కేబీఆర్ పార్కు వద్ద ఫ్లైఓవర్ నిర్మాణంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ కేసులో తదుపరి విచారణ వరకు చెట్లను కొట్టేయవద్దని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. పార్కు పరిధిలో పర్యావరణపరంగా సున్నిత ప్రాంతంలో 25 నుంచి 30 మీటర్ల పరిధిలో ఉన్న చెట్లను కొట్టివేయవద్దని ఆదేశించింది. ఈ పనుల కోసం పార్కు పరిధిలో సుమారు 1,300 చెట్లు నరికేస్తున్నారని పిటిషనర్ల తరపు న్యాయవాది వివేక్‌రెడ్డి కోర్టులో వాదనలు వినిపించారు. చెట్లు తొలగించడానికి ప్రణాళిక ఏమైనా ఉందా? చెట్లు తొలగించకుండా నిర్మాణం చేయవచ్చా? అని ధర్మాసనం ప్రశ్నించింది. అలాంటి ప్రణాళిక ఏమీ లేదని పిటిషనర్ల తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. పర్యావరణ సున్నిత ప్రాంతంలో చెట్లు నరకొద్దని అభివృద్ధి బోర్డు చెప్పిందని పేర్కొన్నారు. వాదనల అనంతరం ప్రతివాదులుగా రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ప్రతివాదులుగా పిసిసిఎఫ్,మరో ఇద్దరు వ్యక్తులను పిటీషనర్ చేర్చారు. తెలంగాణ ప్రభుత్వం తరఫున స్టాండింగ్ కౌన్సిల్‌కు నోటీసు అందించాలని పిటీషనర్ న్యాయవాదిని జస్టిస్ బివి నాగరత్నం, జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ధర్మాసనం ఆదేశించింది. కేసు తదుపరి విచారణను జూలై 27కు వాయిదా వేసింది.

# బిగుస్తున్న ఉచ్చు



భగీరథ్ కేసులో మరో సెక్షన్ జోడింపు

అతని స్నేహితులను కూడా ప్రశ్నించిన సిట్

జైల్లో కుటుంబ సభ్యుల ములాఖత్

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త:** మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో అరెస్టయిన బండి భగీరథ్ ఉదంతంలో సోమవారం కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఇందులో మొదటిది భగీరథ్‌పై నమోదైన ఫోక్సో కేసులో మరో కఠిన సెక్షన్‌ను పోలీసులు జోడించగా రెండవది ఈ కేసుకు సంబంధించి మరిన్ని ఆధారాల కోసం భగీరథ్ స్నేహితులను సిట్ అధికారులు విచారించారు. మరోవైపు చర్లపల్లి జైల్లో రిమాండు ఖైదీగా వున్న భగీరథ్‌ను అతని తల్లితో పాటు కుటుంబ సభ్యులు ములాఖత్‌లో భాగంగా ఉదయం కలిశారు. మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో అరెస్టయిన బండి భగీరథ్‌పై పోలీసుల విచారణ వేగం పుంజుకుంది. ఈ నెల ఎనిమిదవ తేదీన మైనర్ బాలిక, ఆమె తల్లి పిర్యాదు మేరకు పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్‌లో భగీరథ్‌పై బిఎన్ఎస్ 74, 75 సెక్షన్లతో పాటు ఫోక్సో సెక్షన్ కింద కేసు నమోదు చేయడం తెలిసిందే. మొదట మైనర్ బాలికపై అసభ్య ప్రవర్తన కింద కేసు నమోదు చేయగా మరుసటి రోజు మరింత సమాచారం సేకరించి అత్యాచారం కింద మరో సెక్షన్‌ను జోడించారు. దీని తరువాతే భగీరథ్‌పై నమోదైన కేసు నాన్ బెయిలబుల్‌గా మారింది. అనంతరం అతన్ని విచారణకు పిలవగా గడువు కోరడం, హైకోర్టులో మధ్యంతర బెయిల్ >>2

భగీరథ్‌కేసు మల్కాజిగిరి పోక్సో కోర్టుకు బదలీ 2



తిరువనంతపురంలో సిఎం సతీశన్ ప్రమాణ స్వీకారానికి హాజరైన సిఎం రేవంత్, డి.సిఎం భట్టి, కర్ణాటక డి.సిఎం శివకుమార్

# బిగుస్తున్న ఉచ్చు

>> పిటిషన్ దాఖలు చేయడం, అక్కడ ఈ పిటిషన్ డిస్మిస్ అవడం విదితమే. అనంతరం లుకవుట్ నోటీసులు జారీ చేసి గంటల వ్యవధిలోనే శనివారం రాత్రి భగీరథ్‌ను అరెస్టు చేయడం జరిగాయి. దీని తరువాత అతను చర్లపల్లి జైల్లో నిర్బంధంలో వున్నాడు. ఈ కేసులో మరిన్ని ఆధారాల కోసం ఓవైపు సిట్ అధికారులు భగీరథ్ స్నేహితులను సోమవారం పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్‌కు పిలిపించి విచారించారు. మైనర్ బాలికపై గత ఏడాది డిసెంబర్ 31వ తేదీన మొయినాబాద్ ఫాం హౌస్‌లో జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో ఏం జరిగిందనే దానిపై వారి నుంచి వాంగ్మూలం తీసుకున్నారు. పార్టీ జరిగిన తరువాత మరుసటి రోజున అంటే జనవరి ఒకటవ తేదీన ఉదయం తాను మద్యం మత్తులో ఒంటిపై ఎలాంటి దుస్తులు లేకుండా వున్నట్లు బాధిత బాలిక చెప్పడం నిజమేనా...? అని సిట్ అధికారులు భగీరథ్ స్నేహితులను ప్రశ్నించినట్లు తెలిసింది. ఆ పార్టీలో ఎంత మంది పాల్గొన్నారు...? వీరి లో భగీరథ్‌కు బాగా సన్నిహితంగా వున్న వారు ఎవరు...? పార్టీ జరిగిన రాత్రి భగీరథ్ ఏ పరిస్థితుల్లో వున్నాడు...? మద్యం సేవించి వున్నాడా...? మద్యంతో పాటు ఏమైనా డ్రగ్స్ వాడాడా...? అని సిట్ అధికారులు అతని స్నేహితులను విచారించారు. భగీరథ్ మానసిక పరిస్థితి మామూలుగా ఎలా వుంటుంది...? పార్టీ జరిగిన రోజున ఎలా వున్నాడు...? అని సిట్ అధికారులు స్నేహితులను అడిగినట్లు సమాచారం. దీంతో పాటు భగీరథ్ రోజువారి కార్యకలాపాలు ఏమిటీ...? దినచర్య ఎలా వుంటుంది...? రోజు ఎవరిని కలుస్తాడు...? ఏమైనా వ్యాపారాలు వున్నాయా...? లేదా ఖాళీగానే వుంటాడా...? రాత్రి వేళల్లో ఎక్కడికి వెళతాడు...? ఎవరిని కలుస్తాడు...? ఏమైనా పార్టీలకు హాజరవుతాడా...? ఈ పార్టీలు ఎక్కడ జరుగుతాయి...? ఇందులో ఏమైనా డ్రగ్స్ వాడుతారా...? భగీరథ్‌కు పబ్‌లకు వెళ్లే అలవాటు వుందా...? వుంటే ఏ పబ్ లకు వెళతాడు...? ఎవరితో కలిసి వెళతాడు...? అని సిట్ అధికారులు భగీరథ్ స్నేహితులను గుచ్చి గుచ్చి అడిగినట్లు తెలిసింది. భగీరథ్ బాధిత మైనర్ బాలికతో ఎంత కాలంగా స్నేహంగా వున్నాడు...? వీరిద్దరు ఎంత కాలంగా కలిసి తిరిగారు...? ఎన్ని సార్లు ఆ బాలికకు భగీరథ్ బలవంతంగా మద్యం తాగించాడు...? ఎన్నిసార్లు లైంగిక దాడికి పాల్పడి వుంటాడు...? అని సిట్ అధికారులు అతని స్నేహితులను విచారిం చినట్లు తెలిసింది. దీని తరువాత వారు ఇచ్చిన సమాచారం మేరకు బాధిత బాలికపై భగీరథ్ అనేకమార్లు లైంగిక దాడికి పాల్పడినట్లు నిర్ధారణ కు వచ్చి అతనిపై నమోదైన ఫోక్సో కేసులో బిఎన్‌ఎస్‌లోని 64 (2) (ఎం) సెక్షన్‌ను అదనంగా జోడించారు. మద్యం మత్తులో మైనర్ బాలికపై పైచాశికంగా లైంగిక దాడికి పాల్పడినందుకు నిందితుడిపై నమోదైన ఫోక్సో కేసులో ఈ సెక్షన్‌ను అదనంగా జోడిస్తారని సిట్ అధికారులు తెలి పారు.

**జైల్లో కుటుంబ సభ్యుల ములాఖత్**

ఇదిలావుండగా చర్లపల్లి జైల్లో రిమాండు ఖైదీగా వున్న భగీరథ్‌ను అతని తల్లితో పాటు కొందరు కుటుంబ సభ్యులు సోమవారం ములాఖత్ లో భాగంగా కలిశారు. వీరు గంట పాటు జైల్లో వున్నారని సమాచారం. ఈ సందర్భంగా తన కుమారుడిని చూసిన భగీరథ్ తల్లి విలపించినట్లు సమాచారం.

# ఎండ మంటలు

>> (ఐఎండి) రాష్ట్రంలోని ఏడు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, మంచిర్యాల, కుమ్రంభీం, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల ప్రజలు రాబోయే నాలుగు రోజులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. మే 19 నుంచి 24 వరకు ఈ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటే ప్రమాదం ఉందని ఐఎండి స్పష్టం చేసింది. తీవ్రమైన వడగాల్పుల దృష్ట్యా ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండ తీవ్రత అత్యధికంగా ఉంటుందని, ఆ సమయంలో అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని వాతావరణశాఖ హెచ్చరించింది. ప్రజలు బయటలకు వెళ్లేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకొని ఎండల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఓ వైపు భానుడి భగభగలతో ఉక్కిరిబిక్కిరవుతున్న తెలంగాణ ప్రజలకు వాతావరణశాఖ చల్లటి కబురు అందించింది. ఉపరితల చక్రవాత ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రంలో మంగళవారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

# నీట్ కేసులో మరో నిందితుడు రఘునాథ్ అరెస్టు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే18:** దేశవ్యాప్త ప్రకంపనల నీట్ యుజి లీక్ వ్యవహారంలో సిబిఐ మరొకరిని అరెస్ట్ చేసింది. మహారాష్ట్రలోని లాతూర్‌లో రేణుకై కెమిస్ట్రీ క్లాసెస్(ఆర్‌సిసి) కోచింగ్ సెంటర్ వ్యవస్థాపకులు శివరాజ్ రఘునాథ్‌ను అరెస్టు చేసింది. ఆయనను తొమ్మిది రోజుల సిబిఐ కస్టడీకి ప్రత్యేక న్యాయస్తానం అనుమతించింది. ఇప్పుడు జరుగుతున్న విచారణల క్రమంలో ఈ కోచింగ్ సెంటర్ పాత్ర కీలకం అని తేలింది. దీనితో నిర్వాహకుడిని ఆదివారం రాత్రి అరెస్టు చేసినట్లు సిబిఐ వర్గాలు సోమవారం తెలిపాయి. మహారాష్ట్రలోని లాతూర్‌లోని ఆయన నివాసంలో జరిపిన సోదాలలో స్వాధీనపర్చుకున్న సెల్‌ఫోన్‌లో నీట్ ప్రశ్నాపత్రం ప్రతి కూడా కనుగొన్నారు. నీట్ పేపర్స్ విక్రయాల గొలుసుకట్టు వ్యవస్థీకృత గ్యాంగ్‌లో రఘునాథ్ చురుకైన వ్యక్తిగా ఉన్నట్లు నిర్ధారించారు. పరీక్షకు పది రోజులముందు ఈ వ్యక్తి ఇతర కుట్రదారుల నుంచి ప్రశ్నాపత్రాలను సంపాదించాడు. జవాబులు కూడా సేకరించుకుని అక్రమానికి పాల్పడ్డట్లు ప్రాథమికంగా గుర్తించారు. దీనితో ఆయనను అరెస్టు చేసినట్లు సిబిఐ వర్గాలు తెలిపాయి. బేరాలు కుదుర్చుకున్న వారికి ప్రశ్నాపత్రాలను రాతప్రతుల రూపంలో సమకూర్చారని వెల్లడైంది.

పరీక్షలు రాయగానే ఈ కాగితాలను సంబధితులు నలిచి చెత్తబుట్టల్లో వేశారని గుర్తించారు. ఈ వ్యవహారంలో ఇప్పటివరకూ పలువురిని అరెస్టు చేసిన సిబిఐ లెక్చరర్లు పివి కులకర్ణి, మనీషా అరెస్టుతో కేసు విచారణను వేగవంతం చేసింది. వీరికి వాంఘ్మరే అనే వ్యక్తి ప్రధానంగా సహకరించాడని వెల్లడైంది. ఇప్పుడు సిబిఐ కస్టడీకి వెళ్లే రఘునాథ్‌ను సిబిఐ విచారిస్తుంది. ఈ వ్యక్తి ఆర్‌సిసి కోచింగ్ సెంటర్‌ను చాలాకాలంగా నిర్వహిస్తున్నారు. ఇప్పుడు అరెస్టు అవుతున్న పలువురితో రఘునాథ్ ఫోన్‌లో మాట్లాడుతున్నప్పటి వీడియోలు కూడా సిబిఐ సేకరించింది. ఇప్పుడు సిబిఐ అరెస్టు చేసిన వారిలో కీలకమైన ముగ్గురు నలుగురు కూడా మహారాష్ట్రకు చెందిన వారే కావడంతో అక్కడి పోలీసు వర్గాలు , నిఘా సంస్థలు ముంబై , పుణే ఇతర చోట్ల కోచింగ్ సెంటర్లపై దృష్టి పెట్టాయి.

# భగీరథ్‌కేసు మల్కాజిగిరి పోక్సో కోర్టుకు బదలీ

## కోర్టుకు రిమాండు రిపోర్టు?

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త:** బండి భగీరథ్‌పై నమోదైన ఫోక్సో కేసు మేడ్చల్ కోర్టు నుంచి మల్కాజిగిరి ప్రిన్సిపల్ ఫోక్సో కోర్టుకు బది అయ్యింది. పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్‌లో భగీరథ్‌పై కేసు నమోదు కాగా తొమ్మిది రోజుల తరువాత అతన్ని పోలీసులు అరెస్టు చేయడం తెలిసిందే. ప్రస్తుతం అతను చర్లపల్లి జైల్లో రిమాండు ఖైదీగా వున్నాడు. ఈ కేసుకు సంబంధించిన విచారణ ఇప్పటి వరకు మేడ్చల్ పరిధిలో వుండగా కేసు తీవ్రతను దృష్టిలో వుంచుకుని దీనిని మల్కాజిగిరి ప్రిన్సిపల్ ఫోస్కో కోర్టుకు బదిలీ చేశారు.

మరోవైపు భగీరథ్ అరెస్టు, తదనం తరం జరిగిన పరిణామాలు, ఈ కేసులో అతని పాత్రకు సంబంధించి సిట్ అధికారులు కోర్టుకు రిమాండు రిపోర్టు ఇచ్చినట్లు తెలిసింది. దీనికి సంబంధించిన వివరాలను పోలీసులు వెల్లడించేందుకు నిరాకరిస్తున్నారు. ఈ కేసులో భగీరథ్‌ను కస్టడీకి కోరేందుకు నిర్ణయించిన సిట్ అధికారు లు దీనిపై మంగళవారం నిర్ణయం తీసుకునే వీలుంది.

# బుల్లెట్‌ట్రైన్ ఫస్ట్‌లుక్ విడుదల

>> ఇపుడు ఆన్‌లైన్‌లో చక్కర్లు కొడుతోంది. పక్షి ఆకారంనుంచి ప్రేరణతో ఈ బుల్లెట్‌రైలును తీర్చిదిద్దారు. గంటకు సుమారు 300 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లేలా ఈ బుల్లెట్‌రైలును డిజైన్‌చేసారు. అందుబాటులోకి వస్తే రెండునగరాలమధ్య ప్రయాణసమయం తగ్గుతుంది. రెండునగరాలమధ్య ప్రయాణానికి ఏడు గంటలకుపైగా పడుతుండగా బుల్లెట్‌రైలులో కేవలం రెండు గంటల్లోనే గమ్యస్థానానికి చేరుకోవచ్చు. ప్రతిపాదించిన నమూనాప్రకారం ఈ రైలుకు 8 కోచ్‌లుంటాయి. ముంబయి అహ్మదాబాద్ కారిడార్‌లో సబర్మతి, అహ్మదాబాద్ ఆనంద్, వడోదర, భరూచ్, సూరత్, బిలిమోరా, వాపి, బోయిసర్, విరార్‌థాణె, ముంబయి ఇలా మొత్తం 12 స్టేషన్లు ఉంటాయి. తొలిదశలో సూరత్ బిలిమోరామధ్య తొలి 100 కిలోమీటర్ల విభాగాన్ని వచ్చే ఏడాది ఆగస్టు 15న స్వతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రారంభిచేందుకు రైల్వే కసరత్తు చేస్తోంది.

## వారం - వర్జ్యం

19-05-2026, అధికజ్యేష్ఠ మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, రోహిణి కార్తె
తదియ మ.2.22
మృగశిర ఉ.8.43
వర్జ్యం : సా.4.14-5.40
దు.ఉ.8.10-ఉ.9.02, 2)రా.11.43-రా.12.35
శుభసమయం: ఉ.9.30-10.30
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** అదృష్టాన్ని కన్నా, కృషిని నమ్ముకుంటారు. అధికంగా కృషిస్తారు. ఫలితాలను కూడా తగిన విధంగా పొందుతారు.

**వృషభం:** అంతర్లీనమైన వేదాంత ధోరణిని కనబరుస్తారు. వివాదస్పద అంశాలకు అయినంత దూరంగా ఉండండి.

**మిథునం:** ఉద్యోగంలో అధికశ్రమ. అబద్ధాలు చెప్పి పని తప్పించుకునే వారి వలన ఇబ్బందులు సంభవిస్తాయి.

**కర్కాటకం:** మీ నైపుణ్యాన్ని అంది వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొనడానికి శారీరకంగా మానసికంగా శ్రమిస్తారు.

**సింహం:** ప్రయాణాలు ఎప్పుడు చేయాలో నిర్ణయించుకుంటారు. ఈ ప్రయాణాలు ముఖ్యమైనవి ప్రభుత్వపరమైన ఉత్తర్వులు అనుకూలంగా వస్తాయి.

**కన్య :** వెన్ను నొప్పి, కీళ్ళ నొప్పి ఇబ్బంది కలిగించవచ్చు. గడియారంతో పాటు పరిగెడుతారు. ఆరోగ్యం జాగ్రత్త.

**తుల :** మంచి అవకాశాలు వచ్చినా సంతృప్తి పడని వాళ్ళతో మీకు ఇబ్బందులు వస్తాయి. శుభకార్యాలు చర్చలు ఫలిస్తాయి.

**వృశ్చికం:** స్వంత వాళ్ళుగా భావించిన వ్యక్తులు రహస్యాలు మీ దగ్గర దాచడం మీ కోపానికి, అసంతృప్తికి కారణం అవుతుంది.

**ధనుస్సు:** భూమి సంబంధమైన విషయాలు కొనుగోలు అమ్మకాలకు సంబంధించిన వ్యవహారాలు లాభిస్తాయి. వస్త్రలాభం.

**మకరం:** గతంలో ఆగిపోయిన అమ్మకం వల్ల లాభం పొందుతారు. ఆశించిన వాటిపై అంతగా లాభాలురావు. బంధువుల కలయిక.

**కుంభం:** యాదృచ్ఛికంగా చేసిన కార్యక్రమాల వల్ల ప్రయోజనాలు ఎక్కువగా ఉంటాయి. కపటం లేని మనుషులు సాయంగా ఉంటారు.

**మీనం :** నూతన బాధ్యతలు సంతోషంగా కలిగిస్తాయి. బాధ్యతల వెనుక ఉన్న సమస్యలు ఒక్కొక్కటిగా మీ ముందుకు వస్తాయి.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ప్రజా భద్రతే టార్గెట్

>> విపత్తుల సమయంలో మరింత బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా సేవలు అందించాలని సూచించారు. వరదలు, అగ్నిప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు వేగవంతమైన స్పందన, వివిధ శాఖల మధ్య సమన్వయం, ముందస్తు సన్నద్ధత ఎంతో కీలకమని ఆయన అన్నారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు మొదటి గంట ఎంతో కీలకమైనదని, దానిని గోల్డెన్ అవర్‌గా పరిగణించాలని పేర్కొన్నారు.

ఆ సమయంలో సిబ్బంది అంతా పూర్తి సమన్వయంతో పనిచేస్తూ, అందుబాటులో ఉన్న అత్యాధునిక ఎక్విప్‌మెంట్‌ను సరిగ్గా వినియోగించి ప్రజలకు తక్షణ సేవలు అందించాలన్నారు. అగ్నిప్రమాదాలు, వరదల సమయంలో అన్ని వ్యవస్థలు సకాలంలో స్పందించి ఆస్తి, ప్రాణ నష్టాలను కనిష్ట స్థాయికి తగ్గించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రమాదం జరిగిందనే కాల్ రాగానే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా సరైన సమయంలో, సరైన ప్రాంతానికి చేరుకుని బాధిత ప్రజలకు సకాలంలో వైద్య, రక్షణ సేవలు అందించడం అధికారుల బాధ్యత అని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. వరదలు, అగ్నిప్రమాదాలు, ఆకస్మిక ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలను సురక్షి త ప్రాంతాలకు తరలించడం, వేగంగా సహాయక చర్యలు చేపట్టడం, అత్యవసర సేవలను సమన్వయం చేయడం కోసం ఇటువంటి మాక్ డ్రిల్‌లు ఎంతో ఉపయోగపడతాయని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గత చరిత్రను గుర్తుచేశారు. 1908లో సంభవించిన హైదరాబాద్ మహావరదలను, ఇటీవలి కాలంలో వచ్చిన గోదావరి-కృష్ణా నదుల వరదలను ప్రస్తావిస్తూ... విపత్తుల విషయంలో అప్రమత్తత లేకపోతే ఎంతటి ఘోర నష్టం జరుగుతుందో చరిత్ర చెబుతోందన్నారు.

ప్రజల ప్రాణాలను కాపాడేందుకు సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక పరికరాలు, శిక్షణ పొందిన రెస్క్యూ బృందాలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా సిద్ధంగా ఉండాలని సూచించారు. అడవుల్లో సంభవించే అగ్నిప్రమాదాలు పచ్చదనాన్ని నాశనం చేస్తుంటే, పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న అగ్నిప్రమాదాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా విపత్తుల సమయంలో చేపట్టిన రక్షణ చర్యలను అధ్యయనం చేస్తూ తెలంగాణలో అత్యుత్తమ విపత్తు నిర్వహణ వ్యవస్థను రూపొందిస్తున్నామని స్పష్టం చేశారు. కనువిందు చేసిన రెస్క్యూ ఆపరేషన్లు మాక్ డ్రిల్‌లో భాగంగా గాలితో నింపే లైఫ్ బోట్లు, నీటిలో చిక్కుకున్న వారిని రక్షి ంచే అత్యాధునిక సాంకేతిక పద్ధతులు, అత్యవసర తరలింపు చర్యలు, సమన్వయంతో కూడిన రెస్క్యూ ఆపరేషన్‌లను ప్రత్యేక బృందాలు ప్రత్యక్షంగా ప్రదర్శించి చూపించాయి. అనంతరం మంత్రి నెక్లెస్ రోడ్ బోటింగ్ క్లబ్‌ను సందర్శించి అక్కడి రెస్క్యూ కార్యకలాపాలను స్వయంగా పరిశీలించారు. తెలంగాణ రాష్ట్రంలో ఇంత విస్తృత స్థాయిలో మాక్ ఎక్సర్‌సైజ్‌లు నిర్వహించడం అభినందనీయమని పేర్కొంటూ ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, విపత్తు నిర్వహణ శాఖ ,జిల్లా అధికారులను మంత్రి అభినందించారు. రాష్ట్రంలో జరుగుతున్న ఈ ప్రదర్శనలు కేవలం ముందస్తు సన్నద్ధతలో భాగంగా నిర్వహిస్తున్న మాక్ డ్రిల్‌లేనని, ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు. మీడియా, సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రజలకు ఎల్లప్పుడూ బాధ్యతాయుతమైన, నిజమైన సమాచారమే చేరాలని, పుకార్లను నమ్మవద్దని ఆయన కోరారు.

ఈ భారీ మాక్ డ్రిల్ కార్యక్రమంలో విపత్తు నిర్వహణ శాఖ కార్యదర్శి దాసరి హరిచందన, తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్ సింగ్ మాన్, హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్, ఎన్‌డీఎంఏ లీడ్ కన్సల్టెంట్ మేజర్ జనరల్ (రిటైర్డ్) సుధీర్ బెల్ పాల్గొన్నారు. వీరితో పాటు పోలీస్, ఫైర్, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, జీహెచ్‌ఎంసీ, హైడ్రా, పరిశ్రమలు, రవాణా, పశుసంవర్ధక, వెటర్నరీ తదితర శాఖల అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని మాక్ డ్రిల్‌ను విజయవంతం చేశారు.

# ఇతర రాష్ట్రాలు తెలంగాణ డిస్కం బాటలోకి

>> విద్యుత్ నియంత్రణ కమిషన్ నుంచి పంపిణీ లైసెన్సు కోసం దరఖాస్తు చేసుకుంది. దీనికి సంబంధించి ఈ నెల 28న ప్రజాభిప్రాయ సేకరణ జరగనుంది. తదుపరి రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం జూన్ 2 నుంచి పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించనుంది. ఇది సమర్థవంతమైన ఉచిత, సబ్సిడీ విద్యుత్ నిర్వహణకు ప్రాధాన్యతనిస్తూ, టీజీఎస్‌పీడీసీఎల్ మరియు టీజీఎన్‌పీడీసీఎల్ నుంచి ఉన్న బకాయిలు, రుణాలతో సహా రూ.35,982 కోట్ల బాధ్యతలను ఇప్పటికే స్వీకరించింది. విద్యుత్ సబ్సిడీలను ఒక ప్రత్యేక డిస్కామ్‌కు వేరు చేయడం వల్ల పారిశ్రామిక, గృహ వినియోగదారులపై క్రాస్‌సబ్సిడీ భారం నివారించబడుతుందని విద్యుత్ శాఖ అధికారవర్గాలు వెల్లడించాయి. యుటిలిటీ ఆర్థిక పరిస్థితి స్థిరంగా ఉండటం, మొత్తం గ్రిడ్ మనుగడకు ఎటువంటి ఆటంకం కలిగించకుండా సామర్థ్య మెరుగుదలలకు వీలు కల్పిస్తుందని అంటున్నాయి. హర్యానా తన రాష్ట్ర వార్షిక 2026-27 బడ్జెట్‌లో, మొత్తం 5,084 వ్యవసాయ ఫీడర్‌లను నిర్వహించడానికి మరియు 7.17 లక్షల మంది రైతు వినియోగదారులకు సేవలు అందించడానికి హర్యానా ఉచిత డిస్కామ్‌ను ప్రతిపాదించింది. దీని ద్వారా వేగవంతమైన ట్యూబ్‌వెల్ కనెక్షన్‌లు, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి, నిరంతరాయ సరఫరా సాధ్యమవుతాయి. ఉత్తర హర్యానా బిజ్లీ విత్రాన్ నిగమ్, దక్షిణ హర్యానా బిజ్లీ విత్రాన్ నిగమ్‌లతో పాటు ఇది మూడవ డిస్కామ్ అవుతుంది. సంస్థ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం అప్పుల ఊబిలో కూరుకుపోయిన మహారాష్ట్ర స్టేట్ ఎలక్ట్రిసిటీ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ నుండి ఉచిత విద్యుత్ సరఫరాను మార్చి 2027 నాటికి వేరు చేస్తోంది.

ఈ క్రమంలో సుమారు రూ.96 వేల కోట్ల రైతు బకాయిలను కూడా బదిలీ చేస్తోంది. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో 26 లక్షలకు పైగావ్యవసాయ కనెక్షన్లను నిర్వహించడానికి, ఉచిత విద్యుత్ సరఫరాను క్రమబద్ధీకరించడానికి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ ఉచిత విద్యుత్ సరఫరా లిమిటెడ్‌ను ఏర్పాటు చేస్తోంది. కార్యాచరణ సామర్థ్యాన్ని పెంచడానికి, పారదర్శక సబ్సిడీ నిర్వహణను నిర్ధారించడానికి, మరియు విద్యుత్ పంపిణీ సంస్థల ఆర్థిక స్థిరత్వాన్ని బలోపేతం చేయడానికి రాష్ట్రాలు తెలంగాణ నమూనాను ఎక్కువగా అనుసరిస్తున్నందున, ఈ పరిణామాలు ఒక స్పష్టమైన సంస్కరణాత్మక విధాన ధోరణిని సూచిస్తున్నాయి. తెలంగాణ మూగో కిల్ల డిస్కామ్ మాదిరిగానే, ఈ నాలుగు రాష్ట్రాలు కూడా సబ్సిడీతో కూడిన వ్యవసాయ లోడ్‌లను వాణిజ్య మరియు గృహ వినియోగదారుల నుండి వేరు చేసి, క్రాస్ సబ్సిడీలను తగ్గించి, గ్రామీణ విద్యుత్ సామర్థ్యాన్ని పెంచాలని కోరుకుంటున్నాయి.



సోమవారం ఓస్లోలో ప్రధాని మోడీకి స్వాగతం పలుకుతున్న కళాకారులు

# మోడీకి నార్వే అత్యున్నత పురస్కారం

>> ప్రధాని మోడీ అందుకున్న 32వ ప్రధాన అంతర్జాతీయ పురస్కారం ఇది. గ్రాండ్ క్రాస్ అనేది రాయల్ ఆర్డర్ ఆఫ్ మెరిట్‌లో అత్యున్నత శ్రేణి పురస్కారమని, అసాధారణమైన సేవలు అందించిన వ్యక్తులకు మాత్రమే దీనిని ప్రదానం చేస్తారని నార్వే ప్రభుత్వం పేర్కొంది. గౌరవాన్ని అందుకున్న అనంతరం మోడీ సోషల్ మీడియాలో తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. రాయల్ నార్వేజియన్ ఆర్డర్ ఆఫ్ మెరిట్ గ్రాండ్ క్రాస్‌ను అందుకోవడం నాకు గౌరవంగా ఉంది. ఈ గౌరవాన్ని భారతదేశ ప్రజలకు, బలమైన భారత్‌నార్వే స్నేహానికి అంకితం చేస్తున్నాను. ఇది ప్రపంచ పురోగతికి మన ఉమ్మడి నిబద్ధతను ప్రదర్శిస్తుంది, అని పేర్కొన్నారు.

# పోలీసు కృషి అద్వితీయం

>> వారు కూడా వున్నారని అమిత్ షా తెలిపారు. తెలంగాణ పో లీసు శాఖలోని ఎస్ఐబి, గ్రే హౌండ్స్ విభాగాలు నక్సలైట్ల ఏరివేతలో చేసిన కృషి అమోఘమని కొనియాడారు. గిరిజనులు పూజించే దంతేశ్వరి అమ్మవారి ఆశీస్సులతో ఛత్తీస్‌ఘడ్‌లోని బస్తర్ సహా అన్నిచోట్ల నేడు నక్సలైట్ల సమస్య లేకుండా పోవడం సంతోషంగా వుందని అమిత్ షా తెలిపారు.

ఛత్తీస్‌ఘడ్‌తో పాటు పొరుగు రాష్ట్రాలు నేడు నక్సలైట్ల నుంచి విముక్తి పొందిందని ఆయన తెలిపారు. నక్సలైట్ల ఏరివేతలో అన్ని రా ష్ట్రాలకు చెందిన పోలీసులు ప్రాణ త్యాగం చేశారని, వారి బలిదానం వల్ల మావోయిస్టుల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని అమిత్ షా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఛత్తీస్‌ఘడ్ పోలీసు ఉన్నతాధికారులతో పాటు కేంద్ర హోం శాఖ ఉన్నతాధికారులు పలువురు పాల్గొన్నారు.

# పెళ్లి బృందం వ్యాన్‌ను ఢీకొన్న కంటైనర్

>> చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి విషమంగా ఉందని... మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. ముంబై-అహ్మదాబాద్ జాతీయ రహదారిపై ఈ ఘటన జరగడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పోలీసులు సహాయక చర్యలు చేపట్టి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ విషాద ఘటనతో పెళ్లి ఇంట్లో తీవ్రవిషాదం నెలకొంది.

# 'కొత్తస్కీమ్.. ప్రతి కుటుంబానికి రూ.5లక్షల బీమా'

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే18:** రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా ప్రయోజనం కల్పించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకం (ఐకెజెబిపి) అనే సార్వత్రిక జీవిత బీమా పథకాన్ని ప్రారంభించనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు, ఈ పథకం విజయవంతంగా అమలుకు చేయడానికి అవసరమైన విధివిధానాలను ఖరారు చేయడానికి సంబంధిత అధికారులు, భాగస్వామ్య సంస్థలతో చర్చిచేందుకు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలతో కూడిన కేబినెట్ ఉపసంఘం మంగళవారం సాయంత్రం 5 గంటలకు సచివాలయంలో అత్యవసరంగా సమావేశం కానుంది.

# సరిపడా ఇంధన నిల్వలు

## సోషల్ మీడియా ప్రచారాన్ని నమ్మొద్దు

### ప్రజలకు ఆయిల్ కంపెనీల విజ్ఞప్తి

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ కొరత ఉందంటూ సాగుతున్న ప్రచారాన్ని ప్రభుత్వరంగ చమురు కంపెనీలు స్పష్టతనిచ్చాయి. రాష్ట్రంలో డిమాండ్‌కు సరిపడా ఇంధన నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ఎక్కడా ఎలాంటి కొరత లేదని ఓఎంసీల రాష్ట్ర కో ఆర్డినేటర్ సోమవారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. ఇంధన సరఫరాను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, రవాణా సేవలను మరింత వేగవంతం చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ఇంధన వినియోగం గతంతో పోలిస్తే గణనీయంగా పెరిగినట్లు ఆయిల్ కంపెనీలు తెలిపాయి. ఈ నెల మొదటి 15 రోజుల్లోనే రికార్డు స్థాయి వృద్ధి నమోదైంది. పెట్రోల్ సరఫరాలో 14.2 శాతం వృద్ధి, డీజిల్ సరఫరాలో 15.7 శాతం వృద్ధిని ఓఎంసీలు నమోదు చేశాయి. డిమాండ్ ఎంత ఉన్నా సరఫరాకు ఎలాంటి ఇబ్బంది లేదని కంపెనీలు భరోసా ఇచ్చాయి. ఇక వేసవిలో నమోదవుతున్న అధిక ఉష్ణోగ్రతల కారణంగా గృహావసర ఎల్పిజి సిలిండర్ల బుకింగ్స్ కొంత తగ్గుముఖం పట్టినట్లు ఓఎంసీలు తెలిపాయి. సాధారణంగా ఇలాంటి రోజుల్లో వినియోగదారులు ఆందోళనతో ముందస్తు బుకింగ్స్ చేయడానికి ఆసక్తి చూపించరని, ప్రస్తుత ట్రెండ్ ఈ సీజన్‌కు సాధారణమేనని తెలిపాయి. ఈ నెల 17 వరకు మొత్తం 20.06 లక్షల గృహావసర ఎల్పీజీ సిలిండర్లను విజయవంతంగా డెలివరీ చేసినట్లు సంస్థ వెల్లడించింది. వినియోగదారులు గ్యాస్ బుకింగ్స్ కోసం ఇబ్బంది పడకుండా ఎస్ఎంఎస్, మిస్డ్ కాల్, ఐవీఆర్‌ఎస్, ఆన్‌లైన్ వేదికల ద్వారా సులభంగా బుక్ చేసుకోవాలని కంపెనీలు సూచించాయి.

ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో ఇంధన కొరతపై వచ్చే వదంతులను నమ్మి సామాన్య ప్రజలు ఆందోళన చెందవద్దని ఓఎంసీలు విజ్ఞప్తి చేశాయి. కేవలం అధికారిక, విశ్వసనీయ సంస్థలు అందించే సమాచారాన్ని మాత్రమే నమ్మాలని ప్రజలను కోరాయి.

# తొర్రూర్‌లో చదరపు గజం భూమి రూ.45.500

## రాజీవ్ స్వగృహ ఓపెన్ ప్లాట్ల విక్రయం-రూ.83కోట్ల ఆదాయం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే18:** రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న ఓపెన్ ప్లాట్ల కొనుగోలుకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తున్నది. ఎటువంటి వివాదాలు లేని, అన్ని వసతులతో అభివృద్ధి చెంది మంచి డిమాండ్ తో ఫ్యూచర్ సిటీకి, అవుటర్ రింగ్ రోడ్ కు సమీపంలో రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాలలోని తొర్రూర్ (66 ప్లాట్లు), కుర్మల్ గుడ (11), బహదూర్ పల్లి (8) ప్రాంతాల్లో రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ కు చెందిన 85 ఓపెన్ ప్లాట్ల విక్రయానికి సోమవారం బహిరంగ వేలం నిర్వహించారు. పెద్ద అంబర్ పేట లోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్లో నిర్వహించిన బహిరంగ వేలంలో పాల్గొన్నబిడ్డర్లు చదరపు గజానికి నిర్దేశించిన దానికంటే అధిక మొత్తంతో ఈ ప్లాట్లను కొనుగోలు చేయడం విశేషం. ఈ ప్లాట్ల విక్రయం ద్వారా సుమారు రూ.83 కోట్ల మేర ఆదాయం వచ్చిందని రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ వి.పి గౌతం తెలిపారు. తొర్రూల్ లే అవుట్ లో ప్లాట్ ను కొనుగోలు చేయడానికి బిడ్డర్లు పోటీలు పడుతూ గరిష్టంగా చదరపు గజం స్థలాన్ని రూ.45,500 (నలభైఐదు వేల అయిదు వందలు)కు వేలం పాటలో కొనుగోలు చేశారని ఎండి శ్రీ వి.పి.గౌతం తెలిపారు. ఓఆర్ఆర్, ఆదిభట్ల ఐటి క్యారిడార్ కు సమీపంలో ఉన్న తొర్రూర్ లో 200 700 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న 66 ప్లాట్లకు చదరపు గజానికి కనీస ధర 25 వేల రూపాయలుగా నిర్ధారించగా, సగటున రూ. 32,500 (ముప్పయి రెండు వేల అయిదు వందలు) ధర పలికిందన్నారు. తమకు నచ్చిన భూముల కోసం పోటీ పడుతూ బిడ్డర్లు ఒక దశలో ప్లాట్ ను దక్కించుకోడానికి దాదాపు ఇరవైసార్లు రేట్లు పెంచారంటే ఇక్కడి భూములకున్న డిమాండ్ అర్ధంచేసుకోవచ్చు. అదే విధంగా ఎయిర్ పోర్టు, ఆర్సీఐకి దగ్గర్లో ఉన్న కుర్మల్‌గుడలో 200 నుంచి 400 చదరపు గజాల విస్తీర్ణంలోని ప్లాట్లకు చదరపు గజం కనీస ధర 20 వేల రూపాయలుగా నిర్ణయించగా, గరిష్టంగా రూ.27,500 ధర పలికింది. అవుటర్ రింగ్ రోడ్ ను ఆనుకుని ఉన్న బహదూర్ పల్లి ప్రాంతంలో 200 నుంచి 1000 చదరపు గజాల విస్తీర్ణంలోని ప్లాట్లకు కూడా మంచి ధర పలికింది. ఇక్కడ చదరపు గజం కనీస ధర రూ.27 వేలుగా నిర్ణయించగా, వేలం పాటలో గరిష్టంగా రూ.40,500 ధర పలికింది. వేలం పాటలో సగటున ఈ భూములకు గజం రూ.33,800కు కొనుగోలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పూర్తి పారదర్శకంగా నిర్వహించిన ఈ బహిరంగ వేలం విక్రయాల్లో పలు ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 150 మంది బిడ్డర్లు పాల్గొన్నారు.

# ఓవర్‌లోడ్ వాహనాలపై అధిక టోల్ ఫీజు

### ప్రమాదాలు, రోడ్ల ధ్వంసం అడ్డుకట్టకు కేంద్రం కీలక నిర్ణయం

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త:** కేంద్రప్రభుత్వం ఓవర్‌లోడ్ వాహనాలతో నిత్యం జరుగుతున్న ప్రమాదాలను అడ్డుకోవడంతోపాటు రోడ్ల ధ్వంసం నిలువరించేందుకు జాతీయ రహదారులపై ఓవర్‌లోడ్‌తో వెళ్లే వాహనాలపై కఠినంగా వ్యవహరించడం మొదలుపెట్టింది. జాతీయ రహదారులపై ఓవర్‌లోడుతో వెళ్లే వాహనాల నిబంధనల అమలును పటిష్ఠం చేయడానికి జరిమానాలను కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ సవరించింది. ఈ కొత్త నిబంధనలు గత ఏప్రిల్ 15 నుంచి అమల్లోకి వచ్చాయి. జాతీయ రహదారులపై అధిక లోడ్తో ప్రయాణిస్తున్న వాహనాలతో ప్రమాదాలు అధికమవడం, రోడ్లు ధ్వంసం అవుతుండటంతో కేంద్ర ప్రభుత్వం ఈ కఠిన నిబంధనలు అమలు చేస్తోంది. ఈ కొత్త నిబంధన నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా నిర్వహించే టోల్ ప్లాజాల వద్ద మాత్రమే వర్తించనున్నాయి. నిర్దేశించిన లోడు పరిమితులను పాటించడాన్ని ప్రోత్సహించడం, రహదారికి మౌలిక సదుపాయాలను పరిరక్షిస్తూ రోడ్డు భద్రత పెంచడం ఈ నిబంధనల లక్ష్యమని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇక టోల్‌ను వాహనాలకు లోడు శాతం బట్టి రుసుము విధించనున్నారు. 10 శాతం వరకు ఓవర్ లోడుతో వెళ్లే వాహనాలకు ఎటువంటి రుసుము చెల్లించనవసం లేదు. 10 నుంచి 40 శాతం వరకు ఓవర్ లోడుతో వెళ్లే వాహనాలకు ప్రాథమిక రుసుముకు రెట్టింపు ఫీజు విధించనున్నారు. 40 శాతం పైగా ఓవర్ లోడ్తో వెళ్లే వాహనాలకు ప్రాథమిక రుసుముకు నాలుగు రెట్లు అధికంగా ఫీజు వసూలు చెయ్యనున్నారు. నిబంధనలను ఉల్లంఘించిన వాహనాల వివరాలను జాతీయ వాహన రిజిస్టర్ పోర్టల్ లో నమోదు చేస్తారు. టోల్ ప్లాజాల వద్ద ఏర్పాటు చేసిన సర్టిఫైడ్ తూకం యంత్రాలను ఉపయోగించి వాహనాల వద్ద ఓవర్ లోడింగ్ నిర్ధారిస్తారని కేంద్ర రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ఆదేశాలలో పేర్కొంది. ఫీజు వసూలు చేసే టోల్ ప్లాజాల వద్ద తూకం వేసే సదుపాయాలు అందుబాటులో లేనట్లయితే ఓవర్ లోడ్ ఫీజు చెల్లించనవసరం లేదు. ఫీజు కేవలం ఫాస్టాగ్ ద్వారా మాత్రమే వసూలు చేస్తారు. లోడు వాహనాలు వెళ్లేటప్పుడు టోల్ ప్లాజాల వద్దే తూకం యంత్రాలను ఉపయోగించాలని జాతీయ రహదారుల్లోని అన్ని టోల్ ప్లాజాలకు ఆదేశాలు కూడా వెళ్లాయి.



## ప్యాసింజర్ రైలు కోచ్‌లో అగ్నిప్రమాదం

**పాట్నా, మే 18:** రాష్ట్రంలోని ససారాం రైల్వే స్టేషన్‌లో నిలిచి ఉన్న ఒక ప్యాసింజర్ రైలులో ఫైర్ ఎక్సిడెంట్ జరిగింది. ఒక కోచ్‌లో మంటలు చెలరేగాయి. ఆ బోగి మంటల్లో పూర్తిగా కాలిపోయింది. బీహార్‌లోని ససారం రైల్వే స్టేషన్‌లో సోమవారం ఉదయం 6 గంటల సమయంలో ససారాం పాట్నా ఫాస్ట్ ప్యాసింజర్ రైలు ససారం రైల్వే స్టేషన్‌లోని ఆరో నంబర్ ప్లాట్‌ఫారమ్‌పై నిలిచి ఉన్నది. ఉన్నట్టుండి ఒక కోచ్‌లో మంటలు చెలరేగాయి. దీంతో ప్లాట్‌ఫారమ్‌పై ఉన్న ప్రయాణికులు భయాందోళన చెందారు. రైల్వే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది కలిసి మంటలను ఆర్పివేశారు. అప్పటికే ఆ కోచ్ మంటల్లో పూర్తిగా కాలిపోయింది. దీంతో కాలిన బోగిని రైలు నుంచి వేరు చేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే రైలు కోచ్‌లో అగ్నిప్రమాదం జరిగినట్లు అనుమానిస్తున్నారు.

## 27 నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్

### 31 వరకు స్లాట్ బుకింగ్

### 29 నుంచి జూన్ 1 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త:** పాలిటెక్నిక్ కాలేజీల్లో డిప్లొమా కోర్సు ల్లో చేరేందుకు నిర్వహించిన పాలీసెట్-2026 కౌన్సెలింగ్‌ను ఈ నెల 27 నుంచి ప్రారంభించనున్నారు. ఈ నెల 27 నుంచి 31 వరకు విద్యార్థులు ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుందని సాంకేతిక విద్య శాఖ కమిషనర్ శ్రీదేవసేన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29 నుంచి జూన్ 1 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించనుండగా, ఈ నెల 29 నుంచి జూన్ 3 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. జూన్ 6న సీట్ల కేటాయింపు చేస్తారు. సీట్లు పొందిన విద్యార్థులు జూన్ 6 నుంచి 9 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. జూన్ 8, 9 తేదిల్లో కాలేజీల్లో రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. జూన్ 9 నుంచి అకడమిక్ సెషన్‌ను ప్రారంభించనున్నారు. జూన్ 15న ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్‌లో భాగంగా స్లాట్ బుకింగ్‌కి అవకాశం కల్పించారు. జూన్ 16, 17 తేదిల్లో వెబ్ ఆప్షన్లకు అవకాశమిచ్చారు. జూన్ 20న సీట్ల కేటాయింపు చేస్తారు. జూన్ 20 నుంచి 22 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. జూన్ 22, 23 తేదిల్లో కాలేజీల్లో రిపోర్ట్ చేయాలి. జూన్ 24న విద్యార్థులు కాలేజీల్లో అప్‌డేట్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. జులై 1న స్పాట్ అడ్మిషన్లకు సంబంధించిన మార్గదర్శకాలను జారీ చేయనున్నారు.. జులై 8 నాటికి స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేయాలని సోమవారం జారీ చేసిన కౌన్సెలింగ్ షెడ్యూల్‌లో శ్రీదేవసేన పేర్కొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న గీసులాల్ జైన్

## రేపు దేశవ్యాప్తంగా 12 లక్షల మెడికల్ షాప్‌లు బంద్

**హైదరాబాద్ (సైఫాబాద్), మే 18, ప్రభాతవార్త:** ఆన్‌లైన్‌లో అక్రమ మందుల అమ్మకాలను నిలిపివేయాలని, కార్పోరేట్ సంస్థల అధిక డిస్కౌంట్లను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20 దేశ వ్యాప్తంగా 12 లక్షలు, రాష్ట్రంలో 35 వేలు 'మెడికల్ షాప్‌ల బంద్' నిర్వహిస్తున్నామని ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్, డ్రగ్గిస్ట్ తెలిపింది. ఈ మేరకు సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్గనైజేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గీసులాల్ జైన్, ప్రధాన కార్యదర్శి సంజయ్‌కుమార్‌మోదీ, కోశాధికారి సి. హెచ్. ఆనంద్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ కోవిడ్ సమయంలో అత్యవసర నిబంధనలకు సంబంధించిన జిఎస్‌ఆర్ 220 (ఇ)ని తక్షణమే ఉపసంహరించుకోవాలని, ఇ-ఫార్మసీ నిబంధనలకు సంబంధించిన జిఎస్‌ఆర్ 217ను కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు ఇస్తే ఏదైనా ప్రమాదాలు జరిగితే ఎవరూ బాధ్యతుల వహిస్తారని వారు ప్రశ్నించారు. బంద్ సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లును చేస్తున్నామని చెప్పారు. ఈ బంద్‌లో ప్రతి ఒక్క కెమిస్ట్ సోదరులు, సోదరీలు పాల్గొని మెడికల్ షాప్‌లు బంద్ చేసి విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

## జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లోని శాశ్వత సంఘాలకు ఒడి సౌకర్యం

### 9 సంఘాలకు ఒడి సౌకర్యం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త :** రాష్ట్ర స్థాయిలో తెలంగాణ సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో శాశ్వత సభ్యత్వం కలిగిన సభ్య సంఘాల ప్రధాన కార్యవర్గ సభ్యులకు అదర్ డ్యూటీ(ఒడీ) సౌకర్యం మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 9 సంఘాలకు 2026లో ఓడీ సౌకార్యం కల్పిస్తూ జనరల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ సోమవారం జీవో ఆర్‌టీ నంబర్ 685ను జారీ చేసింది. ప్రభుత్వం క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం గుర్తింపు ప్రక్రియ పూర్తయ్యే వరకు, తెలంగాణ సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ (రాష్ట్ర స్థాయి) శాశ్వత సభ్యులలోని 9 సంఘాల ప్రధాన కార్యవర్గ సభ్యులకు 2026 క్యాలెండర్ సంవత్సరానికి ఓడీ సౌకర్యాన్ని మంజూరు చేస్తున్నట్టు ప్రకటించింది. అందులో తెలంగాణ నాన్‌గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ (టిఎన్‌జిఓ సెంట్రల్ యూనియన్), తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టిజివో సెంట్రల్ అసోసియేషన్), ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పిఆర్‌టీయు టిఎస్), రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం, తెలంగాణ రాష్ట్రం (ఎస్‌టియు టిఎస్), తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సేవా సంఘం (ట్రెసా), తెలంగాణ క్లాస్ 4 ఉద్యోగుల కేంద్ర సంఘం, తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య (టీఎస్ యూటీఎఫ్), తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయుల సమాఖ్య (టిఆర్‌టిఎఫ్) సంఘాలకు చెందిన అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శికి ఓడీ సౌకర్యం కల్పించగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయ సంఘం (టీజీఎస్‌ఏ) సంఘానికి కేవలం అధ్యక్షుడికి మాత్రమే ఓడీ సౌకర్యం కల్పిస్తున్నట్టు జీఏడీ జారీ చేసిన ఉత్తర్వులో స్పష్టం చేసింది.

# ఎస్ఐబిని సందర్శించిన డిజిపి ఆనంద్

### మావోయిస్టుల నిర్మూలనలో కీలక భూమిక వహించిందని కితాబు



ఎస్ఐబి పనితీరుపై నిర్వహించిన సమీక్షలో డిజిపి ఆనంద్

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మావోయిస్టులను ఏరి వేయడంలో కీలక భూమిక వహించిన స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబి)ను డిజిపి సివి ఆనంద్ సోమవారం సందర్శించారు. బేగంపేట్‌లో గల ఈ విభాగంలో డిజిపి గంటపాటు గడిపారు. ఈ సందర్భంగా ఎస్ఐబి పనితీరును సమీక్షించారు. గడచిన రెండేళ్ల కాలంలో 820 అజ్ఞాత మావోయిస్టుల లొంగుబాటు వెనుక ఎస్ఐబి చేసిన కృషిని డిజిపి కొనియాడారు. లొంగిపోయిన వారిలో రాష్ట్ర కమిటీ, కేంద్ర కమిటీ సభ్యులతో పాటు కీలక నేతలు అనేక మంది వుండడం గర్వించదగ్గ విషయమని ఆయన తెలిపారు. ఈ సందర్భం గా 334 ఆయుధాలను లొంగిపోయిన నక్సలైట్లు పోలీసులకు అప్పగించారని, ఇంత పెద్ద సంఖ్యలో ఆయుధాలను మావోయిస్టులు ఇవ్వడం కూడా సాధారణ విషయం కాదని డిజిపి తెలిపారు. నాలుగు దశాబ్దాలుగా పోలీసులను సవాల్ చేసి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన మావోయిస్టుల సమస్య ఇప్పుడు అంతరించిందని, అయితే మారిన పరిస్థితుల్లో తెలంగాణలో భవిష్యత్ భద్రతా ఎలా ఉండాలనే దానిపై ఎస్ఐబి దృష్టి పెట్టాలని, ప్రస్తుతం భద్రతపరంగా ఎదురవుతున్న సవాళ్లను అధిగమించాలని డిజిపి కోరారు. ఈ సమావేశంలో నిఘా విభాగం అదనపు డిజి విజయ్ కుమార్, ఎస్ఐబి ఐజి కార్తికేయ, ఎస్‌పి శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## 28 నుంచి 31 వరకు పిజిఇసెట్ పరీక్షలు

### 19 కోర్సుల్లో ప్రవేశాలకు 26,005 మంది దరఖాస్తు

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త:** ఇంజనీరింగ్ పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ప్రవేశాల కోసం నిర్వహించే పీజీ ఈ సెట్-2026 పరీక్షలు ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 31 వరకు పరీక్షలు కొన సాగుతాయని పీజీ ఈ సెట్-2026 కన్వీనర్ ప్రొఫెసర్ డాక్టర్ కె వెంకటేశ్వరరావు సోమవారం ప్రకటనలో తెలిపారు. రెండు సెషన్‌లలో పరీక్షలను నిర్వహించనున్నారు. మొదటి సెషన్‌ను ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సెషన్‌ను మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించనున్నారు. మొత్తం 19 పీజీ ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం 26,005 మంది దరఖాస్తు చేసుకున్నట్టు తెలిపారు.

## పోక్సో కేసులో లారీ డ్రైవర్‌కు 20 యేళ్ల జైలు శిక్ష

**హైదరాబాద్ (సరూర్‌నగర్), మే 18, ప్రభాతవార్త:** పోక్సో కేసులో నింది తుడైన ఓ లారీ డ్రైవర్‌కు కోర్టు 20 సంవత్సరాల జైలు శిక్ష విధించింది. మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2021లో జరిగిన పోక్సో కేసులో లెనిన్ నగర్‌లో నివాసముంటున్న లారీ డ్రైవర్ సంపంగి శివ నిందితుడు. అయి తే కోర్టులో కేసు పూర్వాపరాలు విచారించిన అనంతరం జడ్జి పద్మావతి తీర్పును ప్రకటించారు. ఈ నేపథ్యంలో నేరం రుజువైన శివకు 20 సంవత్సరాల జైలు శిక్షతోపాటు రూ.8 వేల జరిమానా విధించారు. అదే విధంగా బాధితురాలికి రూ.లక్ష పరిహారం చెల్లించాలని ఆదేశిస్తూ తీర్పు వెలువరించారు.



సంపంగి శివ (ఫైల్)

# ఎప్ సెట్-2026 లో బిసి గురుకుల విద్యార్థుల హవా

### అగ్రికల్చర్, ఫార్మసీలో 516 ర్యాంక్ సాధించిన హార్షిణి

### 5వేలలోపు ర్యాంక్‌లు తెచ్చుకున్న 43 మందిని అభినందించిన మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త:** తెలంగాణ ఎప్ సెట్- 2026 ఫలి తాల్లో బీసీ గురుకుల విద్యార్థులు తమ సత్తా చాటారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో హార్షిణి 516వ ర్యాంక్‌ను సాధించింది. 5 వేల లోపు ర్యాంకులను 43 మంది విద్యార్థులు సాధించారు. ఎప్ సెట్‌లో ర్యాం కులు సాధించిన విద్యార్థులను బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాల మాయదేవి, గురుకుల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు అభినందించారు. మహాత్మా జ్యోతిబా ఫులే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాసంస్థల సొసైటీ అగ్రికల్చర్, ఫార్మసీ, ఇంజనీరింగ్ విభాగంలో ఉన్నత విద్యా కోర్సుల కోసం నిర్వహించిన ఎప్ సెట్‌లో 3781 మంది విద్యార్థులు క్వాలిఫై అయ్యారు. వారిలో 5వేల లోపు ర్యాంక్‌లను 43 మంది విద్యార్థులు, 10వేల లోపు ర్యాంక్‌లను 178 మంది విద్యార్థులు సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో హార్షిణి స్టేట్ 516వ ర్యాంక్‌ను సాధించింది. కల్పిత 1315వ ర్యాంక్, కె. శ్రవణ్ కుమార్ 1377వ ర్యాంక్, టి. నవ్య 1692వ ర్యాంక్‌లను సాధించగా, ఇంజనీరింగ్ విభాగంలో బి. అనిరుధ్ 3513వ ర్యాంక్, జి. వినోద్ కుమార్ 3568వ ర్యాంక్, ఎస్. రుషిక్ వర్మ 4433 ర్యాంక్‌ను సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో మొత్తం 1626 మంది గురుకుల విద్యార్థులు క్వాలిఫై కాగా వారిలో 5 వేల లోపు ర్యాంక్ సాధించిన వారు 43 మంది విద్యార్థులు, 10వేల లోపు ర్యాంక్ సాధించిన వారు 122 మంది విద్యార్థులు ఉన్నారు. 20000లోపు ర్యాంక్ 247 మంది, 40000 లోపు ర్యాంక్ 703 మంది విద్యార్థులు సాధించారు. ఇంజనీరింగ్ విభాగంలో 2155 మంది విద్యార్థులు క్వాలిఫై కాగా వారిలో 5000 లోపు ర్యాంక్ ముగ్గురు, 10000 లోపు ర్యాంక్ 56 మంది, 20000 లోపు ర్యాంక్ 167 మంది, 40000 లోపు ర్యాంక్ 412 మంది విద్యార్థులు సాధించారు. ఉన్నత విద్యా కోర్సుల్లో చేరేందుకు అర్హత సాధించిన విద్యార్థులను, బోధన సిబ్బందిని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు. ఎప్ సెట్ ఫలితాలు బీసీ గురుకుల విద్యాసంస్థల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, ప్రత్యేక శిక్షణ, క్రమశిక్షణకు నిదర్శనంగా నిలుస్తున్నాయని వారు కొనియాడారు. ప్రభుత్వం గురుకుల విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రత్యేక దృష్టి సారించిందని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతులు మెరుగు పరిచామని, ప్రత్యేక ఆన్ లైన్ కోచింగ్ ద్వారా విద్యార్థులకు అవసరమైన పోటీ పరీక్షల శిక్షణ అందిస్తున్నామని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. గతంలో రాష్ట్ర వ్యాప్తంగా రెండు సిఓఇ (కాలేజీ ఆఫ్ ఎక్సలెన్స్) మాత్రమే ఉండగా గత ఏడాది కొత్తగా పది సిఓఇలు లు, ఈ ఏడాది మరో పది సిఓఇలు ఏర్పాటు చేశామన్నారు. వచ్చే ఏడాది మరింత ఎక్కువ సంఖ్యలో బీసీ గురుకుల విద్యార్థులు ఉన్నత విద్యా కోర్సులకు శిక్షణ తీసుకుని అత్యుత్తమమైన ఫలితాలు సాధిస్తారని ఆయన ఆకాంక్షించారు.

## హైకోర్టు న్యాయమూర్తిపై అనుచిత పోస్టులు.. నిందితుడి అరెస్టు

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త:** బండి భగీరథ్ కేసులో హైకోర్టు న్యాయమూర్తిపై సోషల్ మీడియా వేదికగా అనుచిత పోస్టులు ఉంచిన నిందితుడిని సైబర్‌క్రైం పోలీసులు అరెస్టు చేశారు. పేట్‌బషీరాబాద్ పోలీసుస్టేషన్‌లో నమోదైన పోక్సో కేసుకు సంబంధించి గత శుక్రవారం అర్ధరాత్రి వరకు భగీరథ్ మధ్యంతర బెయిల్‌పై హైకోర్టులో వాదనలు సాగడం తెలిసిందే. ఓవైపు హైకోర్టులో భగీరథ్ మధ్యంతర బెయిల్‌పై వాదనలు సాగుతుండగా సోషల్ మీడియా వేదికగా మహిళాజడ్జిపై అనుచిత పోస్టులు రావడం కలకలం రేపాయి. దీనిపై హైకోర్టు రిజిస్ట్రార్ చేసిన ఫిర్యాదు మేరకు చార్మినార్ పోలీసులు కేసు నమోదుచేసి, సైబర్‌క్రైం పోలీసుస్టేషన్‌కు బదలీ చేశారు. దీనిపై విచారణ చేబట్టిన సైబర్‌క్రైం పోలీసులు పోస్టులను పరిశీలించి. దీనిని పోస్టు చేసిన వ్యక్తి కోసం ఆరా తీశారు. మొదట సర్వీస్ ప్రొవైడర్ నుంచి సమాచారం సేకరించి దీని ఆధారంగా నిందితుడిని దామోదర్‌గా గుర్తించారు. హైదరాబాద్‌కు చెందిన ఇతన్ని సోమవారం మధ్యాహ్నం అరెస్టు చేశారు. నిందితుడిని విచారిస్తున్నారు. ఇతని గత చరిత్రపై ఆరా తీస్తున్నారు. హైకోర్టు జడ్జిపై అనుచిత పోస్టులు ఉంచడం తీవ్రమైన నేరంగా పరిగణించి, ఇతని వెనుకవున్న వారి కోసం ఆరా తీస్తున్నారు.

# ఆస్తి కోసం అక్కను హత్య చేసిన తమ్ముడు

### తుమ్మల పెన్‌పహాడ్‌లో దారుణ ఘటన

### సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ నరసింహా



హతురాలు అంజమ్మ

**సూర్యాపేట, మే 18, ప్రభాతవార్త:** ఆత్మకూరు(ఎస్) మండల పరిధిలోని తుమ్మలపెన్‌పహాడ్ గ్రామంలో భూ వివాదం ఓ మహిళ ప్రాణాలను బలి తీసుకుంది. సొంత అక్కను ఆస్తి కోసం తమ్ముడు హత్య చేసిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. గ్రామానికి చెందిన సురుగి అంజమ్మ భర్త మృతి చెందడంతో పాటు సంతానం లేకపోవడంతో తన చెల్లెలి వద్ద నివసిస్తోంది. తనను చూసుకుంటున్న చెల్లెలికి తన పేరున్న రెండు ఎకరాల భూమిని ఇస్తానని అంజమ్మ చెప్ప డంతో కుటుంబంలో వివాదాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో అక్క, తమ్ముడు సురుగి సైదులు మధ్య భూ తగాదాలు ముదిరినట్లు సమాచారం. సోమవారం ఉదయం అంజమ్మ కరువు పనులకు వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన, సైదులు, పదునైన కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. తీవ్ర గాయాల పాలైన అంజమ్మ అక్కడికక్కడే రక్తపు మడుగులో మృతి చెందింది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు.

జిల్లా ఎస్పీ నరసింహా స్వయంగా ఘటన స్థలాన్ని పరిశీలించి పోలీస్ అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. క్లూస్ టీం, డాగ్స్ స్క్వాడ్ ఆధారాలు సేకరించాయి. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భూ సంబంధిత వివాదాలు ఉంటే చట్ట పరంగా, పెద్దమనుషుల సమక్షంలో పరిష్కరించుకోవాలని సూచించారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని దాడులు, హత్యలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. గతంలో గరిడేపల్లి మండలంలోని పొనుగోడు గ్రామంలో భూ తగాదాలకు సంబంధించిన హత్య కేసులో నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష పడిన విషయాన్ని గుర్తు చేశారు. నిందితుడు సైదులుపై ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో హత్య కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కేసును వేగంగా దర్యాప్తు చేసి నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా పోలీస్ శాఖ కృషి చేస్తుందని ఎస్పీ పేర్కొన్నారు. ఈ పరిశీలనలో సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్, క్లూస్ టీం ఇన్‌స్పెక్టర్ నవీన్, ఎస్సైలు మహేష్, ఐలయ్య, గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ క్యాంటీన్లలో నాణ్యత పెరగాలి

### సమీక్ష నిర్వహించిన తమిళ సిఎం విజయ్




**చెన్నై, మే 18:** తమిళనాడులో దివంగత ముఖ్యమంత్రి జయలలిత హయాంలో ఏర్పాటయిన అమ్మక్యాంటీన్‌లలో నాణ్యతను పెంచాలని సీఎం విజయ్ ఆదేశాలిచ్చారు. క్యాంటీన్లలోమౌలిక సదుపాయాలు, ఆహారపదార్థాల నాణ్యతను మరింత మెరుగుపరచాలనిసూచించారు. అమ్మక్యాంటీన్లలో ఆహార ఉత్పత్తుల నాణ్యత, రుచి ఆశించిన స్థాయిలో లేవని తనదృష్టికి వచ్చిందని ఆయన పేర్కొంటూ సోమవారం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిఆదేశాలిచ్చారు. కొత్త వంటపాత్రలు, సామగ్రి అందించాలని, తమిళనాడుప్రజలకు రుచికరమైన భోజనం అందేలా చర్యలుచేపట్టాలని కోరారు. గ్రేటర్‌చెన్నై మున్సిపల్‌కార్పొరేషన్ నిర్వహణలో 383 క్యాంటీన్లు ఉంటే స్థానిక సంస్థలపరిధిలో మరో 237 అమ్మ క్యాంటీన్లు పనిచేస్తున్నాయి. వీటిలో రూపాయికే ఇడ్లీ, మూడురూపాయలకే పొంగలి, ఐదు రూపాయలకే బోజనం వంటివి అందిస్తున్నారు. తక్కువరేట్లతో నిరుపేదల ఆకలిని తీర్చడమే అమ్మక్యాంటీన్ల లక్ష్యంగా అప్పట్లో జయలలిత ప్రారంభించారు.

# అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యాధునిక కార్గో టెర్మినల్ ప్రారంభం

**రంగారెడ్డి అర్బన్, మే 18, ప్రభాతవార్త :** జీఎంఆర్ హైదరాబాద్ ఇంట ర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (జీహెచ్ఐఏఎల్) హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యాధునిక కార్గో టెర్మినల్ 2ను సోమవారం ప్రారంభించినట్లు ప్రకటించింది. ప్రపంచ స్థాయి ఎయిర్ కార్గో, లాజిస్టిక్స్ కేంద్రంగా విమా నాశ్రయ అభివృద్ధిలో ఇది ఒక కీలక మైలురాయిగా నిలిచింది. దేశీయ, అంతరాజ్తీయ కార్గో రవాణా పెరుగుతున్న అవస రాలను దృష్టిలో ఉంచుకుని, ఎయిర్‌లైన్స్, ఫ్రైట్ ఫార్వార్డర్స్, లాజిస్టిక్స్ ఆపరేటర్లు, నియంత్రణ సంస్థలకు అత్యాధునిక మౌలిక సదుపాయాలను అందించేందుకు ఈ టెర్మినల్‌ను రూపొందించారు. ఈ సందర్భంగా జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ సిఇఒ కదిర్ కదిరవన్ మాట్లాడుతూ.. కార్గో టెర్మినల్2 ప్రారంభం జీహెచ్ఐఏఎల్‌కు మాత్రమే కాకుండా, హైదరాబాద్‌ను ఆసియాలో ప్రముఖ ఎయిర్ కార్గో మరియు లాజిస్టిక్స్ గేట్‌వేగా తీర్చిదిద్దే దిశలో ఒక కీలక ఘట్టమని ఇది కేవలం మౌలిక సదుపాయాల విస్తరణ మాత్రమే కాదు, భవిష్యత్‌పై మా దృఢ సంకల్పానికి నిదర్శనమని అన్నారు. హైదరాబాద్‌ను గ్లోబల్ లాజిస్టిక్స్ మ్యాప్‌పై మరింత బలంగా నిలబెట్టడంలో ఈ టెర్మినల్ కీలక పాత్ర పోషిస్తుంది,' అని తెలిపారు. జీఎంఆర్ ఏరో కార్గో అండ్ లాజిస్టిక్స్ సీఈఓ సంజీవ్ ఎడ్వర్డ్ మాట్లాడుతూ, హైదరాబాద్‌లో కొత్త కార్గో టెర్మినల్ ప్రారంభం భారతదేశ ఎయిర్ లాజిస్టిక్స్ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా ఒక ముఖ్య మైన ముందడుగు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను అందిస్తూ, పరిశ్రమలకు వారి వ్యాపార అభివృద్ధికి తోడ్పడే సేవలను అందించడంలో జీఎంఆర్ ఏరో-కార్గో అండ్ లాజిస్టిక్స్ తన నిబద్ధతను మరోసారి చాటుకుంది,' అని అన్నారు. ఈ టెర్మినల్‌లో బహుస్థాయి అగ్ని గుర్తింపు, అలారం వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఇది ప్రమా దాలను ముం దుగానే గుర్తించి, కార్గో, మౌలిక సదుపాయాలు, సిబ్బంది భద్రతకు అత్యున్నత ప్రమాణాలను నిర్ధారిస్తుంది. భద్రతకు ప్రాధాన్యతనిచ్చే మౌలిక సదుపాయాల నిర్వహణలో జీహెచ్ఐఏఎల్ నిబద్ధతను ఇది మరింత బలోపేతం చేస్తోందన్నారు.

## డిమాండ్‌కు అనుగుణంగా థర్మల్ విద్యుత్ ఉత్పత్తి

### రాష్ట్రాలను ఆదేశించిన విద్యుత్ మంత్రిత్వ శాఖ

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త :** ప్రస్తుత వేసవి కాలంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతున్న అందుకు అనుగుణంగా ఉత్పత్తిపై దృష్టిసారించాలని కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ రాష్ట్రాలకు సూచించింది. ప్రస్తుతం పెరుగుతున్న డిమాండ్ దృష్ట్యా థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు పూర్తి సామర్థ్యంలో పని చేయాలని అన్ని యూనిట్లను ఆదేశించింది. కరెంట్ కొరత లేకుండా ఈ ఏడాది అక్టోబరు 15 వరకూ విద్యుత్ ఉత్పత్తిని పూర్తిగా చేయాలని స్పష్టం చేసింది.

ప్రస్తుత వేసవిలో ఏప్రిల్ నుండి జూన్ వరకూ 270 గిగావాట్ల విద్యుత్‌కు పీక్ డిమాండ్ ఏర్పడే వీలుందని అంచనా వేసింది. గత ఏడాది సెప్టెంబరులో పీక్ డిమాండ్ 253 గిగావాట్లుగా రికార్డయింది. ప్రస్తుత వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మించి నమోదు కావడతో ఆ మేరకు కరెంట్ వినియోగంలో భారీగా పెరుగుదల చోటు చేసుకుంటోందని తెలిపింది.



తన్వీక(ఫైల్)

## అక్రమ బంధానికి అడ్డు రావచ్చని కూతురిని కడతేర్చిన కసాయి తల్లి

### నీటి సంపులో పడేసి మూతపెట్టిన నిందితురాలు

**హైదరాబాద్ (అల్వాల్), మే 18, ప్రభాతవార్త:** అక్రమ సంబంధానికి అడ్డు వస్తుందనే అనుమానంతో కూతురిని కడ తేర్చిన కసాయి తల్లి ఉదంత మిది. సంప్‌లో పడి కూతురు చనిపోయిందని నమ్మించేందుకు ప్రయ త్నించింది. నిందితురాలి సోదరి ఇచ్చిన సమాచారం ద్వారా పోలీసులు తమదైన పద్దతిలో విచారణ చేయగా మొత్తం బయటపడింది. ఘటనకు సంబంధించి విశ్వసనీయంగా అందిన సమాచారం ఈ విధంగా ఉంది. అల్వాల్, వజ్రా ఎన్‌క్లేవ్ వద్ద రేఖ, కూతురు తన్వీక(6) తండ్రి, సోదరుడితో కలిసి నివాసం ఉంటోంది. బాధితురాల అంబేద్కర్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ఒకటవ తరగతి చదువుతోంది. రేఖ భర్తకు విడాకులు ఇచ్చి కొంతకాలంగా వేరే వ్యక్తితో కలిసి ఉంటోంది. ఈ నెల 16న సాయంత్రం 8.30 గంటలు వరకు తల్లితో కలిసి తన్వీక ఉంది. మనువరాలికి రేఖ తండ్రి 5 రూపాయలు ఇవ్వగా దుకాణానికి వెళ్ళి వస్తానని చెప్పింది. ఎంత సేపటికి తిరిగి ఇంటికి రాక పోవడంతో నిందితురాలు సోదరి శ్వేతకు రాత్రి 10.30 గంటలకు ఫోన్ చేసి విషయాన్ని తెలిపింది. కుటుంబ సభ్యులు, స్థానికులు తన్వీక కోసం వెతికినా ఫలితం లేకుండా పోయింది. అల్వాల్ పోలీసులకు శ్వేత జరిగిన విషయాన్ని వివరిస్తూనే సోదరి రేఖపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేసింది. పోలీసులు తమదైన విధానంలో విచారణ చేయగా అక్రమ బంధానికి కూతురు అడ్డంకిగా ఉండవచ్చనే కారణంతో అడ్డు తొల గించుకోవడానికి నిర్ణయించుకున్నట్లు తెలిపింది. కూతురిని ఎలా చంపాలనే ఆలోచనలో భాగంగా 16న ఆమెతో ఆడుకుంటున్నట్లు నటిస్తూనే దుకాణానికి వెళుతున్న సమయంలో నీటి సంప్‌లో పడేసి మూత వేసినట్లు ఒప్పుకుంది. ప్రమాదవశాత్తు సంప్‌లో పడి తన్వీక చని పోయినట్లు చిత్రీకరించి నమ్మించే ప్రయత్నం చేసింది. నేరాన్ని అంగీకరించడంతో పోలీసులు ఆమెపై కేసు చేశారు.


వార్త

సమస్యలను చేపట్టేవారి శక్తి సామర్థ్యాలపై వాటి పరిష్కారం ఆధారపడి ఉంటుంది.

-వివేకానంద

## కొలువు దీరిన 'కేరళం'

ఎట్టకేలకు కేరళ శాసనసభ కొలువు దీరింది. దాదాపు పది రోజుల పాటు అత్యధిక సీట్లు గెలుపొందిన కాంగ్రెస్ పక్షనేత ఎంపికలో ఎప్పటిలానే కాంగ్రెస్ అధిష్టానం మీనమేషాలు లెక్కిస్తూ తాత్సారం చేసింది. ముఖ్య మంత్రి సీటు కోసం పోటీ పడ్తున్న ముగ్గురు నేతలతో, ఎన్నికైన ఎమ్మెల్యేలతో సంప్రదింపులు జరిపి చివరాఖరుకు వి.డి సతీశన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వి.డి. సతీశన్, కె.సి వేణుగోపాల్ రమేష్ చెన్నితాల ముగ్గురూ ముగ్గురే. కార్యకర్తల్లోనూ శ్రేణుల్లోని గుర్తింపు ఉన్నవారే. వారి ముగ్గురు పేర్లను సుదీర్ఘ చర్చల ద్వారా ఖరారు చేశారు. దాదాపు పదేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ కేరళం రాష్ట్రంలో కాంగ్రెస్ పీఠమెక్కబోతున్న తరుణంలో అక్కడ కార్యకర్తలను, ఎన్నికైన ఎమ్మెల్యేలను తీవ్రగందరగోళాన్ని కలుగ చేసి మరీ కాంగ్రెస్ శాసనసభాపక్షనేతను ఎన్నుకొని గద్దెనెక్కించింది. కేరళం రాష్ట్రమంటేనే దేవభూమిగా చెప్తుంటారు. అక్కడ చదువుకునే వారంతా ఉన్నత విద్యనభ్యసించే విద్యావేత్తలే. ఆకారణం చేతఎన్నికలు జరిగినప్పుడల్లా ఓటర్లు తమముందున్న సమస్యలు, పాలనవంటి అంశాలపై విశ్లేషణలు సాగుతూనేఉంటాయి. అలాంటి చర్చ నేపథ్యంలోనే కేరళంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్, సిపిఎం నేతృత్వంలోనే ఎల్‌డిఎఫ్‌లు ప్రతి ఐదేళ్లకు ప్రభుత్వాలు మారతాయి. సోమవారం ఉదయం 10 గంటలకు తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో 20 మంది మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. ఎప్పటిలానే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తోందంటే ఎంతోమంది నేతలు కీలక పదవి కోసంముందుకు రావడం ఎన్నికైన ఎమ్మెల్యేల నుండి నాయకత్వం ఎంపికలో అసమ్మతి రాగాలు వినిపించడం కార్యకర్తల్లో గందరగోళం ...ఇవన్నీషరామామూలే. అదే కాంగ్రెస్‌సంస్కృతి. ఇలాంటి వన్నీ ముందుముందు రోజుల్లో సజావుగా పరిపాలించడానికి హెచ్చరికలుగా మిగులుతాయి. ఇప్పుడూ అదే జరిగింది. కేరళంను పాలిస్తున్న వామపక్షాలను ప్రజలు ఈసారి ఆశీర్వదించలేదు. ప్రతి ఐదేళ్లకుఒకరి తర్వాత ఒకరుగా అధికారం చేపట్టే ఎల్‌డిఎఫ్, యుడిఎఫ్‌ల ఆనవాయితీ. గతఎన్నికల్లో ఓటర్లు మార్పు చేస్తూ తీర్పు చెప్పారు. ఆ కారణం చేతనే గతసారి వరుసగా రెండోసారి లెఫ్ట్‌డెమొక్రటిక్ ఫ్రంట్ ప్రభుత్వ పాలనను కొనసాగించింది. మూడోసారి వామపక్ష పాలనను వ్యతిరేకించి కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్‌కు అవకాశమిచ్చింది. ఎల్‌డిఎఫ్‌కు 'హ్యాట్రిక్' కొట్టే అవకాశం ఇవ్వలేదు. ఈసారి ముఖ్యమంత్రి పీఠమెక్కాలని తహతహలాడిన ముగ్గురులో సతీశన్‌కు స్థానికంగా పలుకుబడి ఉంది. మంచినేతగా గుర్తింపు ఉంది. గత ఎల్‌డిఎఫ్ హయాంలో సతీశన్ శాసనసభలో ప్రతిపక్ష నేతగా ఉన్నారు. పార్టీ శ్రేణుల్లో కాంగ్రెస్ పార్టీ పట్ల అభిమానం ఆదరణ పొందే విషయంలో పూర్తిస్థాయి నేతృత్వం వహించారు. దాని ఫలితమే కాంగ్రెస్ పట్టానికి ఆస్కారమిచ్చింది. ఆవిధంగా సతీశన్‌కు పార్టీలో నాయకత్వపటిమ ఉన్న నేతగా ఎంతో క్రేజ్‌ఉంది. 1990లో రమేష్ చెన్నితాల తన తొలి రాజకీయ అడుగే యువజన కాంగ్రెస్ అధ్యక్షునిగా పనిచేశారు. పార్టీ శ్రేణుల్లో జోష్ నింపేరన్న పేరు ప్రఖ్యాతులున్నాయి. మూడోవ్యక్తి ఎఐసిసి నేతకెసి వేణుగోపాల్‌కు అధిష్టానం వద్ద, అగ్రనేతల వద్ద పలుకుబడి ఉంది. అయినా సతీశన్ విషయంలో లొంగి రాక తప్పలేదు. వేణుగోపాల్ జాతీయ రాజకీయాల్లో కాంగ్రెస్‌ను ఏకతాటి మీద నడిపించగల శక్తిఉన్న నేత. వార్ధక్యం రీత్యా రమేష్ చెన్నితాల వెనుకబడ్డారు. సిఎంగా సతీశన్ ఎంపిక వెనుక యుడిఎఫ్ ప్రధాన భాగస్వామి ఐయుఎంఎల్ ఒత్తిడి ఉన్నట్లు చెబుతారు. ఏమయితేనేం కాంగ్రెస్ పార్టీ మళ్లీ తన పునర్వైభవాన్ని సంపాదించుకుని పీఠమెక్కింది. సతీశన్ తన రాజకీయ ప్రత్యర్థి పోటీదారుకు అత్యంత కీలకమైన హోంశాఖను ఇవ్వడంవిశేషం. సాధారణంగా హోంమంత్రిత్వశాఖను ముఖ్యమంత్రి తన వద్దనే ఉంచుకుంటారు. లేదా అత్యంత వీరవిధేయులకే దానిని అప్పగించడాన్ని అనుసరిస్తారు. పదేళ్ల తరువాత కేరళం ప్రజలకు సుపరిపాలన అందించడానికే కాంగ్రెస్‌నేతలంతా కంకణబద్ధులై ఉన్నట్లు కేరళప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రకటించింది. మిత్రపక్షలైన ఐయుఎంఎల్, కేరళ కాంగ్రెస్, కేరళ కాంగ్రెస్ (జాకబ్), ఆర్‌ఎస్‌పి నేతలు ప్రభుత్వంలో చేరారు. సతీశన్ కేరళ రాష్ట్రం పేరు 'కేరళం'గా మార్చాక పదవీ స్వీకారంచేసిన తొలిముఖ్యమంత్రి. రాష్ట్రంభౌగోళిక స్వరూపం, అసెంబ్లీ అంతాఒకటే అయినా పేరు మార్చుకుంది. అదొక్కటే తేడా. మామూలుగానైతే కేరళ 13వ శాసనసభకు ఆయన అధికార పగ్గాలు చేపట్టారన్నమాట. కేరళంలో కాంగ్రెస్ అస్తిత్వం కాపాడుకోవడమే ప్రధానోద్దేశంగా ఆదిలోనే సాహసానికి అధిష్టానం పూనుకుందని తొలి అడుగులోనే అర్థమవుతుంది. ఎఐసిసి నేత, ఎంపి కెసి వేణుగోపాల్‌ను రాష్ట్రానికి పంపితే రాజకీయ వ్యూహకర్త కోసం మళ్లీ 'టార్చిలైట్' పెట్టి వెతుక్కోవాల్సిందే. గతంలో అహ్మద్‌పటేల్ స్థానాన్ని ఈయనే భర్తీ చేశారు. రమేష్ చెన్నితాల వృద్ధనాయకుడు. ఈ రీత్యా యువతలో మంచి పేరున్న సతీశన్ ఒక్కరే కేరళ రాష్ట్రాన్ని కుదిపేసిన గోల్డ్ స్మగ్లింగ్ కేసు లైఫ్ మిషన్‌స్కామ్, ఎఐకెమెరాల కొనుగోలులో అవకతవకలపై వామపక్షాలపై ఎక్కుపెట్టిన ఆరోపణలే ప్రజల్లో వామపక్ష ప్రభుత్వంపై ఏవగింపు కలిగేందుకు ఉపయోగపడింది. నిన్నమొన్నటివరకు కేరళలో వామపక్ష పాలనలో అవినీతి పేరుకుపోయిందన్న ఆరోపణల నేపథ్యంలో ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ గెలుపు కోసం సతీశన్ అవిరామ పోరాటం సాగించారన్న కీర్తిగడించారు. అయితే వామపక్షాల పాలనలో ప్రాభవం కోల్పోయిన 'కేరళం'ను ముఖ్యమంత్రిగాతన చాణక్యంతో మరో స్థాయికి తీసుకెళ్లగలరని ఆశిద్దాం.



మిక్కిలి ధనంగానీ, గొప్ప విద్య కానీ, గొప్ప అధికారం కానీ పొందినప్పటికీ గర్వం లేక ఏ వ్యక్తి ప్రవర్తిస్తాడో అతడే పండితుడు.

ప్లినీ



మిమ్మల్ని ప్రతి దానికీ పొగిడేవాడు మీకో రహస్య శత్రువని గమనించాలి.

అరిస్టాటిల్

## ప్రజావాక్కు



### అతివేగం అనర్థదాయకం

పెరుగుతున్న వాహనాల సంఖ్య, మితిమీరిన వేగం కారణంగా నేడు రోడ్డుప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. ఎందరో ప్రాణాలు కోల్పోవడమే కాకుండా, అనేక కుటుంబాలు వీధిన పడుతున్నాయి. రోడ్లను ప్రమాదరహితంగా మార్చడం అనేది కేవలం ప్రభుత్వం బాధ్యత మాత్రమే కాదు, ప్రతి పౌరుడి కర్తవ్యం. రహదారి భద్రత విషయంలోనిర్లక్ష్యం వహించడం వల్లకలిగే పరిణామాలు అత్యంత భయంకరంగా ఉంటున్నాయి. ప్రమాదాల నివారణకు రహదారుల రూపకల్పనలో శాస్త్రీయ పద్ధతులు పాటించాలి. మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు, రాత్రి వేళల్లో తగినంత వెలుతురు ఉండేలా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి. గుంతలమయమైన రోడ్లను వెంటనే మరమ్మతు చేయడం ద్వారా చాలా ప్రమాదాలను నివారించవచ్చు. అలాగే, అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం వంటి ఉల్లంఘనలపై కఠినమైన జరిమానాలు, చట్టపరమైన చర్యలుతీసుకోవాలి. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారిపట్ల మినహాయింపు ఉండకూడదు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### తల్లిదండ్రులను గౌరవిద్దాం

నేటి రోజుల్లో యువత, పెద్ద చిన్న అనే తేడా లేకుండా స్మార్ట్ ఫోన్లకు అతుక్కుపోయి స్నేహితుల మోజులో పడి తల్లిదండ్రులు చెప్పింది వినకుండా కనీస గౌరవం ఇవ్వకుండా ఆమడ దూరం పెడుతున్న సంఘటనలు ఎన్నో చూస్తున్నాం. సమయం దొరికినప్పుడు వాళ్ళతో గడుపుతూ నిత్యం వారికి ఆసరాగా నిలుస్తూ వల్ల భవిష్యత్ ఆరోగ్య, జీవితంపట్ల శ్రద్ధ తీసుకుంటే చాలు తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేవు. ఆసరాగా ఉందాం.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### కలిసివుంటే కలదు సుఖం

ఒకప్పుడు ఎక్కడ చూసినా ఉమ్మడి కుటుంబాలు కళకళాడుతుండేవి. అన్ని వయస్సులవారి ఆప్యాయతలు బాల్యం నుంచి అందుతూ ఎదుగుదల హాయిగా సాగేది. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటూ, ఐకమత్యమే గొప్పబలం అని చాటిచెప్పేవారు. ఇళ్లతోపాటు మనస్సు కూడావిశాలంగాఉండేది. ముఖ్యంగా భార్యాభర్తల బంధం గట్టి పునాదిఅంటే అతిశయోక్తికాదు. రిలేషన్స్‌లో ఉక్కులా ఉండే ఆత్మవిశ్వాసం మెండుగా ఉంటుంది. కాలక్రమేణా సమష్టి కుటుంబాలు చాలా వరకు తగ్గిపోయాయి.

-ఆర్.వెంకటేష్ చరన్, బెంగళూరు

### ఆచరణ ముఖ్యం

మధ్యతరగతి వారు పెట్టుబడులు బంగారంపై పెట్టవద్దని ప్రధాని మోడీజీ అనడం, పిల్లల్ని కనండి మీకు డబ్బులు ఇస్తాను అని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దూరదృష్టితో చెప్పినా సామాన్యుడు చెవికి చేరదు. వాళ్లని ఎడ్యుకేట్ చేయకుండా చెప్పడం, మానసికంగా ప్రిపేర్ చేయకుండా చెప్పడం వల్ల ప్రయోజనం ఉండదు. ఏది రైట్? ఏది రాంగ్? చెప్పవలసిన బాధ్యత ఎల్లవేళలా ప్రభుత్వ ఉపాధ్యాయుల పైన ఉన్నది. కానీ నేటి తరం ఉపాధ్యాయులు వాళ్ల పిల్లలను వాళ్ల కన్నా తక్కువ స్థాయి ఉన్న వాళ్ళ వద్ద చదివిస్తూ మీ పిల్లలను మా వద్దకు పంపండి అని అడగడంలా అనిపిస్తూ ఉంది. ఆచరించని వారికి చెప్పే అర్హత ఉండదు. ప్రధాని మోడీజీ ఆగర్భ శ్రీమంతుడు పుట్టుకతోనే గోల్డెన్ స్పూన్‌తో పుట్టిన పండిట్ జవహర్లాల్ నెహ్రూజీ కంటే ఎక్కువ రిచ్నెస్ అనుభవిస్తూ ఉన్నారు. నారా చంద్రబాబునాయుడు ఆయన పిల్లల్ని కనవద్దని చెబుతున్నారు. నిజానికి సమస్య గ్రామాలలో యువతీ యువకులు ఉండడం లేదు, గ్రామాలలోనే పిల్లల పుట్టించడానికి పుట్టడానికి అవకాశాలు ఎక్కువ.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### మితిమీరుతున్న హిజ్రాల ఆగడాలు

హిజ్రాలఆగడాలురోజురోజుకు శ్రుతిమించిపోతున్నాయి. రోడ్డుపై వీరిని చూడగానే బెంబేలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఉదయం నుంచి రాత్రి వరకు డబ్బు కోసం వీరి వేధింపులు ఆగడం లేదు. ప్రజలను నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. శుభకార్యాల వద్దకు వచ్చి అడిగినంత డబ్బు ఇవ్వకపోతే అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు. అసభ్యకర ప్రవర్తన, భూతులు మాట్లాడుతూ వారిని కించపరుస్తూ రచ్చరచ్చ చేస్తున్నారు. వీరిబారి నుండిఎలా తప్పించుకోవాలో తెలియక ప్రజలు అవస్థలు పడుతున్నారు. హిజ్రాలందరూ ఆరోగ్యంగానే ఉన్నారు. కష్టపడి పనిచేసుకోవడానికి ఎన్నో మార్గాలున్నాయి. ఇలా ప్రజలను వేధించడం ఎందుకు?

- కాయల నాగేంద్ర, హైదరాబాద్

### ప్రజల సమస్యలపై దృష్టి సారించాలి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పగటి కలలు మాని రాష్ట్ర అభివృద్ధి పై దృష్టి సారించాలి. మళ్ళీ ముఖ్యమంత్రి కావడం ప్రజల నిర్ణయం పై ఆధారపడి ఉంటుంది. ముందు నిరుద్యోగుల, రైతులు, కార్మికులు, విద్యార్థుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తే బాగుంటుంది. ప్రజల సమస్యలను పరిష్కరిస్తేనే రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనిస్తుంది.

-బూర్గుపల్లి కృష్ణ యాదవ్, హైదరాబాద్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# అడకత్తెరలో ప్రపంచ భవిష్యత్తు!

**గల్ఫ్ దేశాలు తమ చమురు నిల్వలను ఏవిధంగా కాపాడుకోవాలో తెలియని ఏమరుపాటుతో ఇతర దేశాల మీద ఆధారపడటం వల్ల ఇంతటి దారుణ పరిస్థితులు పశ్చిమాసియా దేశాలకే కాదు ప్రపంచ దేశాలన్నిటికీ అలుముకున్నాయి. బాలెన్స్ ఆఫ్ పవర్ చిన్నాభిన్నమై స్వతంత్ర నిర్ణయాలతో భవిష్యత్తు కాపాడే ప్రపంచ నాయకులు కరువు కావటంతో పాటు అస్తవ్యస్త పరిస్థితులలో ఫంక్షన్ చేస్తున్న యు.ఎన్ చివరకు కారణాలుగా మిగిలాయి. బలమైన యు.ఎన్ ఏర్పాటు చేయగలుగుతే కొంతలో భద్రత ఏర్పడుతుందో, మూడవ ప్రపంచ యుద్ధంతో భవిష్యత్తు ఏ రూపుదిద్దుకుంటుందో ఊహాలకు అందటం లేదు.**



రావులపాటి సీతారాంరావు

పల్లెటూళ్లల్లో తగాదాలు వస్తే కొందరు పెద్ద మనుషులు రచ్చబండ వద్ద కూర్చొని తగాదాలను జాగ్రత్తగా పరిష్కరించటం ఇంతకు మునుపు జరుగుతుండేది. ఈ ఆధునిక యుగంలో అటువంటి కట్టుబాట్లతో కూడిన సమాజం కనుమరుగవటం వల్ల ఇప్పుడు పల్లెలు టౌన్‌లుగా మారుతున్నవేళ అలాంటి పద్ధతులూ పరిష్కారాలు అవుట్‌డేటెడ్‌అయ్యాయి. అంటే కాలం చెల్లిన పద్ధతులుగా మారాయి. అధికార పక్షానికి విపక్షాలకూ అభిప్రాయభేదాలు ఈ ప్రజాస్వామ్యంలో ఉండక తప్పదు. అందరూ హర్షించే విషయమే. విభిన్న దృక్పథాలు వెలుగులోకి వస్తేనే ప్రజలకు న్యాయం జరుగుతుందని ప్రజాస్వామ్యవాదులు నమ్మేవారు. అంతకు తగ్గట్లు రాజకీయ నాయకులలో కొందరు రాజనీతిజ్ఞులుగా వ్యవహరించేవారు కనుక ఇరుపక్షాలూ, తరతమ భేదం లేకుండా వారి మాటవిని అసెంబ్లీని పార్లమెంటును కానీ, చేపల మార్కెట్‌గా మార్చకపోయేవారు. అధికారంలో ఉన్న వారూ లేనివారూ ప్రజలకు మేలు చేయాలనే ప్రాథమిక అవగాహనతో పనిచేసే వారు కాబట్టి గత కాలంలో విభేదాలున్నా వీధి పోరాటాలుగా మారకపోయేవి. పట్టు విడుపులు ఆ రోజుల్లో రాజకీయ నాయకులు ప్రదర్శించేవారు. ఇప్పుడు అలాంటి పద్ధతులకూ కాలం చెల్లింది. అధికారపక్షంలో ఉన్న వారికి ప్రతిపక్షాలలోని మనుషులు మనుషులే కానట్లుగా వారిని కించపరచ్చే ధోరణి అలవాటుగా మారింది. ప్రతిపక్షాలూ మీరు తమలపాకుతో తడితే మేము తలుపు చెక్కలతో కొట్టాం అనే ధోరణిలో వ్యవహరిస్తున్నారు. ఇప్పుడు రాజ'కీ'యులు ఉన్నారు కానీ రాజకీయ నీతిజ్ఞులు కరువయ్యారు. 'యధారాజా తథాప్రజా' అన్నట్లు రాజకీయ కార్యకర్తలు మారుతున్నారు. ప్రజలు మాత్రం రాజకీయాల వింత ధోరణులకు అలవాటుపడుతూ వారి వారి స్వలాభం చూసుకుంటున్నా ఎన్నికలప్పుడు ప్రలోభాలకు తావిచ్చినా అసలు సమయంలో డబ్బాలో ఓటు వేసే విషయంలో మాత్రం ఎవరిని గెలిపించాలో వారినే గెలిపిస్తున్నారు. గెలిచినవారు ఓడినవారు యుగధర్మాన్ని అనుసరించి ప్రవర్తిస్తుండటంతో ఓటర్లు మళ్లీ ఎన్నికల కోసం ఎదురుచూడడం వినా వేరు మార్గాలు లేక వారి జీవితాలు వారు గడుపుతున్నారు. భారతదేశంలో ప్రజాస్వామ్య పాలన వెలుగులు విరజిమ్ముతూ నడవటం లేదు కానీ, ప్రజాస్వామ్యం కాపాడుకోవడానికి కావల్సినంత వెలుగు ఇంకా ఉండి మార్గం కనపడుతుండడంతో ముందుకాలంలో మంచి జరగొచ్చేమో అన్న ఆశావాదంతో కాలం వెళ్లబుచ్చుతున్నారు. అందుకే భారత్‌లోని ప్రజాస్వామ్య పాలన చెదరకుండా ఉందని ఇతర దేశస్థులు నమ్ముతున్నారు. ప్రస్తుతం పాలకుల మీద కాదు ప్రజల మీద ఉంది బాధ్యత. పాలకులు ఆ ప్రధానమైన బాధ్యత దాదాపు విస్మరించిన పరిస్థితులున్నాయి కాబట్టి. అసలు విషయానికి వస్తే దేశాలు రాజ్యాం గాలను తమ శ్రేయస్సు కోసం నిర్మించుకున్నట్లే ప్రపంచ యుద్ధాల తర్వాత యుద్ధాల వాతావరణాన్ని అవసరమైతే తప్పు చేస్తున్న దేశాలను అదుపులో ఉంచటమే కాకుండా పరిష్కార దిశగా విభేదాలను సమిసిపోయేట్లు చేయడానికి మొదట్లో 'లీగ్ ఆఫ్ నేషన్స్' తర్వాత'యునైటెడ్



నేషన్స్ ఆర్గనైజేషన్'ను ప్రపంచ దేశాలు తమ శ్రేయస్సు కోసం నిర్మించుకున్నారు. యుద్ధాలు నివారించడానికి నిజానికి కార్యచరణలో బాలెన్స్ ఆఫ్ పవర్‌ను సమతూకంగా ఉంచుతూ అమెరికా నేతృత్వంలో రష్యా నాయకత్వంలో దాదాపు ప్రపంచంలోని ఎక్కువగా దేశాలు విడిపోయినట్లుగా జతకట్టి చీటికీమాటికి కాలుదువ్వుతున్న పరిస్థితులలో అలీన దేశాలు (నాన్ అలైన్‌డ్ కంట్రీస్) భారతదేశ నాయకత్వంలో (బయటకు ప్రకటించకపోయినా) ఒక జట్టుగా ఏర్పడి రెండు వర్గాల ప్రోద్బలంతో కొన్ని దేశాలు యుద్ధాలకు దిగుతున్నప్పుడు యుఎన్‌ఓల సహకారంతో నివారణకు విజయవంతంగా పూనుకొనేవి. అంతకుమునుపే 1815-1839లో చేసుకున్న స్పెషల్ ట్రీటీస్ స్విట్జర్లాండ్‌కు ఎక్కువ రక్షణ, బెల్జియంకు తక్కువ రక్షణ కల్పించారు. హేగ్ కన్వెన్షన్-3 (1907) ప్రకారం యుద్ధం ప్రకటించడానికి ముందు ఒక అల్టిమేటం లాంటిది ఇవ్వాలని నిర్ణయించింది. యు.ఎన్.ఓ మీద ఎన్నో ఆశలు ప్రపంచ శాంతి కోసం పెట్టుకున్నా ఆశలు దాదాపు అడియాసలుగా మారాయి. అనేక నిబంధనలతో నిర్వీర్యతను పుణికిపుచ్చుకున్న ప్రపంచ సంస్థగా మారిందని విమర్శకులు తీవ్రంగా యుఎన్‌ఓ పనితనాన్ని దుయ్యబట్టుతున్నారు. యు.ఎన్ నిబంధనలు పరస్పర విరుద్ధంగా ఉండటం ప్రత్యక్షంగా చూస్తున్నాం. యుఎన్ ఆర్టికల్ 2(4) ప్రకారం యూజ్ ఆఫ్ ఫోర్స్ చేస్తామని బెదరించటం ఫోర్స్ ఉపయోగించటం సార్వభౌమాధికారాన్ని రాజకీయంగా రాజ్యం స్వాతంత్ర్యం కాపాడుకోవడానికి, తమ భూభాగాలను కాపాడకోటానికి చెల్లదు. అయితే ఆర్టికల్ 51 ఇందుకు విరుద్ధంగా సెల్ఫ్ డిఫెన్స్‌కోసం ఆర్మ్‌డ్ ఎటాక్ చెల్లుతుంది. స్పష్టత లేని ఈ అంశాలు యు.ఎన్ పెద్దలను ఎప్పుడూ ఇబ్బంది పెడుతూనే ఉంటాయి. అలాగే సమిష్టి రక్షణ ఒప్పందాలు (నాటో లాంటి వాలుకి) యు.ఎన్ ఆర్టికల్ 53, క్లాజు 5 ప్రకారం తమలోని ఏదేశమైనా ఎటాక్ కాబడ్డప్పుడు ఆదేశ రక్షణలో తాము కూడా యుద్ధంలో పాల్గొనవచ్చు. అందుకనే నిన్నగాక మొన్న అమెరికన్ అధ్యక్షుడు ట్రంప్ నాటో దేశాల సభ్యులు తనతో చేతులు కలపనందుకు బహిరంగంగా దుయ్యబట్టాడు. ఇలాంటి లొసుగులతో యు.ఎన్ అస్తిత్వం కనపడకుండా పోయింది. అందుకనే తమతో కలిసివచ్చే దేశాలతో, కొన్ని గల్ఫ్ దేశాలతోసహా ఇంటర్‌నేషనల్ కౌన్సిల్‌ను అమెరికా నాయకత్వం ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నట్లు కన్పడుతున్నది. అంతకుమునుపు యుద్ధాలు జరగడం, ఒడంబడికలు చేసుకోవటం వరకే ఈ జనరేషన్ వారికి తెలుసుకానీ యు.ఎన్.ఓ ఏ పరిస్థితులలో యుద్ధ వాతావరణాన్ని నివారించగలదు? అసలు అమెరికా, రష్యా, చైనాలు, సెక్యూ రిటీ కౌన్సిల్‌లో తమకు ఉన్న వీటో పవర్‌ను వినియోగించు కొని అయినవారికి ఆకుల్లో కాని వారికి కంచాల్లో సామెత మాదిరి అధికార దుర్వినియోగం ఏ విధంగా చేస్తున్నాయో ప్రపంచ దేశాలకు అవగతమవుతున్నది. కానీ స్వతంత్రంగా బిగ్ పవర్స్ ముందు నోరు ఎత్తలేని పరిస్థితిలో ఉన్నారు. రష్యా విడిపోయిన తర్వాత అమెరికాకు హద్దూ అదుపు లేకుండాపోయింది. యు.ఎన్.ఓ నిష్ప్రయోజకత్వం ఇందుకు తోడైంది. పశ్చిమాసియా యుద్ధంలో నిజనిజాలు మరుగున పడ్డాయి. ట్రంప్ సామ్రాజ్యవాద ధోరణితో ఇజ్రాయిల్ తెలివిగా ట్రంప్‌ను ముందుంచి తమ ప్రయోజనం పొందుతుంది. గల్ఫ్‌దేశాలు తమ చమురు నిల్వలను ఏవిధంగా కాపాడుకోవాలో తెలియని ఏమరుపాటుతో ఇతర దేశాల మీద ఆధారపడటంవల్ల ఇంతటి దారుణపరిస్థితులు పశ్చిమాసియా దేశాలకే కాదు ప్రపంచ దేశాలన్నిటికీ అలుముకున్నాయి. బాలెన్స్ ఆఫ్ పవర్ చిన్నాభిన్నమై స్వతంత్ర నిర్ణయాలతో భవిష్యత్తు కాపాడే ప్రపంచ నాయకులు కరువు కావటంతో పాటు అస్తవ్యస్త పరిస్థితులలో ఫంక్షన్ చేస్తున్న యు.యన్ చివరకు కారణాలుగా మిగిలాయి. బలమైన యు.యన్ ఏర్పాటు చేయగలుగుతే కొంతలో భద్రత ఏర్పడుతుందో, మూడవ ప్రపంచ యుద్ధంతో భవిష్యత్తు ఏ రూపు దిద్దుకుంటుందో ఊహాలకు అందటం లేదు. •

# ఉపాధ్యాయులపై బోధనేతర పనుల భారం

బాశెట్టి ప్రమోద్ రాం

ప్రస్తుతం విద్యా వ్యవస్థలో ఉపాధ్యాయులపై పెరుగుతున్న బోధనేతర పనుల భారం తీవ్ర చర్చనీయాంశంగా మారుతోంది. ఒకవైపు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన బాధ్యత, మరోవైపు ప్రభుత్వ పరిపాలనా కార్యక్రమాల అమలు బాధ్యతలు ఈ రెండింటి మధ్య ఉపాధ్యాయులు నలిగిపోతున్నారనే భావన విద్యావర్గాల్లో వ్యక్తమవుతోంది. ముఖ్యంగా వేసవి సెలవుల సమయంలో ఉపాధ్యాయులను వివిధ ప్రభుత్వ కార్యక్రమాలకు వినియోగించడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. నిర్దేశిత ఉద్యోగ నియమావళి ప్రకారం ఉపాధ్యాయులకు వేసవి సెలవులు(వెకేషన్ డిపార్ట్మెంట్)గా కేటాయించబడ్డాయి. ఇతర శాఖల ఉద్యోగులతో పోలిస్తే ఉపాధ్యాయులకు తక్కువ ఆర్జిత సెలవులు ఉండటానికి ప్రధాన కారణం వారికి లభించే వేసవి సెలవులే. అదే కారణంతో ప్రభుత్వం వారికి అదనపు సెలవులను నిర్దేశించలేదు. అయితే ఆ సెలవుల కాలంలోనే జనగణన, బడి బాట, సర్వేలు, నమోదు కార్యక్రమాలు, ప్రచార కార్యక్రమాలు వంటి అనేక పనుల్లో ఉపాధ్యాయులను వినియోగించడం వల్ల సెలవుల ఉద్దేశమే నశిస్తున్నదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఉపాధ్యాయుడు ఒక విద్యా నిర్మాణ శిల్పి. విద్యార్థులలో జ్ఞానం, క్రమశిక్షణ, విలువలు నాటే బాధ్యత అతనిది. అలాంటి ఉపాధ్యాయుడిని ఇంటింటికి తిరిగి విద్యార్థులను సమీకరించాల్సిన పరిస్థితికి తీసుకురావడం వృత్తి గౌరవానికే భంగం కలిగిస్తోందని పలువురు భావిస్తున్నారు. విద్యార్థుల నమోదు, ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాల కోసం ప్రత్యేక వింగ్‌లు లేదా కమ్యూనిటీ మొబిలైజేషన్ వ్యవస్థలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. సమాజంలో అవగాహన కల్పించడం ప్రభుత్వ యంత్రాంగం, స్థానిక సంస్థలు, ప్రత్యేక సిబ్బంది బాధ్యత కావాలి గానీ, బోధన బాధ్యతలు నిర్వహించే ఉపాధ్యాయులపై మొత్తం భారం మోపడం సరైన విధానం కాదనే అభిప్రాయం బలపడుతోంది. ఇటీవల పాఠశాలల బలోపేతం పేరుతో లక్ష్యాలను నిర్దేశించి, విద్యార్థుల సంఖ్య పెంచాలని ఒత్తిడి తీసుకురావడం కూడా ఉపాధ్యాయులపై మానసిక భారాన్ని పెంచుతోంది. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం అనేది కేవలం ఉపాధ్యాయుల బాధ్యత మాత్రమే కాదు. మౌలిక వసతులు, నాణ్యమైన బోధన, తల్లిదండ్రుల విశ్వాసం, సామాజిక భాగస్వామ్యం ఇవన్నీ కలిసి వచ్చినప్పుడే ప్రభుత్వ విద్యావ్యవస్థ బలోపేతం అవుతుంది. మరోవైపు, జనగణన వంటి కీలక విధుల్లో పాల్గొంటున్న ఉపాధ్యాయుల పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతోంది. విధుల్లో నిమగ్నమైనవారితో పాటు, సంబంధం లేని ఉపాధ్యాయులను కూడా బడి బాట వంటి కార్యక్రమాలకు హాజరు కావాలని ఆదేశించడం సముచి తమా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఒక ఉపాధ్యాయుడు బోధనకు సిద్ధమవ్వడానికి పాఠ్య ప్రణాళికలు రూపొందించాలి, విద్యార్థుల స్థాయిని అంచనా వేయాలి, బోధన పద్ధతులను మెరుగుపరుచుకోవాలి. అలాంటి సమయంలో బోధనేతర పనులభారం పెరగడం విద్యానాణ్యత పై కూడా ప్రభావం చూపే ప్రమాదం ఉంది. ఉపాధ్యాయ వృత్తి అనేది కేవలం ఉద్యోగం కాదు అది సమాజ నిర్మాణానికి మూలాధారం. అలాంటి వృత్తికి గౌరవం కల్పించాలంటే ఉపాధ్యాయులను ప్రధానంగా బోధన కార్యకలాపాలకే పరిమితం చేసే విధానాలు తీసుకురావాలి. ప్రభుత్వ పరిపాలనా కార్యక్రమాల్లో అవసరమైతే పరిమిత స్థాయిలో సహకారం తీసుకోవచ్చు గానీ, నిరంతరం బోధ నేతర పనుల్లో నిమగ్నం చేయడం సరికాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ అంశంపై ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు, విద్యావేత్తలు, పాలకులు సమగ్రంగా ఆలోచించాల్సిన అవసరం ఉంది. విద్యావ్యవస్థ బలోపేతం కావాలంటే ముందుగా ఉపాధ్యాయుడి పాత్ర, గౌరవం, బాధ్యతలను స్పష్టంగా నిర్వచించి, అతనిని బోధనకే కేంద్రీకరించే దిశగా చర్యలు చేపట్టాల్సిన సమయం ఆసన్నమైంది. •

# రూపాయి విలువ పడిపోతే ఆర్థిక సంక్షోభం తప్పదా?

డాక్టర్ రామకృష్ణ బండారు

దాదాపు ఏడాది క్రితం ప్రపంచంలో నాల్గవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించిన భారత్‌కు ఆ సంతోషం ఎక్కువకాలం నిలువలేదు. ఈ సంవత్సరం మొదటి త్రైమాసికంలో వచ్చిన ఆర్థిక ప్రతికూల ఫలితాల ప్రభావం వలన భారత్ తన నాల్గవ స్థానాన్ని కోల్పోయింది. ఏప్రిల్ 2026 నాటి 'అంతర్జాతీయ ద్రవ్య నిధి' నివేదికల ప్రకారం, భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచ ఆర్థిక ర్యాంకింగ్లో నాల్గవ స్థానం నుండి 6వ స్థానానికి పడిపోయింది. కరోనా కాలంలో ఏర్పడిన గడ్డు పరిస్థితులను సైతం ఎదుర్కొని దృఢంగా నిలబడిన భారత్‌కు ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న అనిశ్చితి వలన ఆర్థిక అస్థిరత ఏర్పడే ప్రమాదం ఉన్నది. ప్రధాని సైతం దేశ ప్రజలకు మునుముందు ఏర్పడే ఆర్థిక సంక్షోభం పై హెచ్చరికలు చేసారు అంటే పరిస్థితులు అర్థం చేసుకోవచ్చు. ఆర్థికనిపుణులు సైతం భారత్‌కు భవిష్యత్‌లో ఎదురు కాబోయే ప్రమాదాన్ని ఊహించి భయాందోళనలకు గురిఅవుతున్నారు. అంతర్జాతీయ రేటింగ్ సంస్థలు సైతం ఈ ఏడాదికి భారత్ వృద్ధి అంచనాలు తగ్గిస్తున్నాయి. ఇటీవల అంతర్జాతీయ రేటింగ్ సంస్థ 'మూడీస్' భారత్ జిడిపి వృద్ధి రేటును 6.8శాతం నుంచి 6శాతానికి తగ్గించింది. భారత్‌కు ఎందుకు ఇలాంటి పరిస్థితి ఎదురవుతుంది? కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఏమిటీ? అనేవి సామాన్య ప్రజానీకానికి అర్థం కానీ ప్రశ్నలు. మన దేశ ప్రస్తుత పరిస్థితికి కారణం అంతర్జాతీయ మార్కెట్‌లో రూపాయి విలువ గరిష్ట స్థాయికి పడిపోవడమే. ఈ ఒక్క ఏడాదిలో ఇప్పటివరకు సుమారు 6శాతం వరకు రూపాయి విలువ తగ్గింది. ఈ వారంలో రూపాయి విలువ గరిష్టంగా 96 కు చేరుకుంది. 2021 మే 13న ఒక డాలర్ కు సుమారు 73.44 రూపాయలు ఉండగా ఐదేళ్ల తరువాత అంటే ప్రస్తుతం 96 రూపాయలకు చేరుకుంది. గత ఐదేళ్ళలో సుమారు 22.23 రూపాయల మేర రూపాయి విలువ క్షీణించింది. ఇది సుమారు 30.2 శాతంకు సమానం. డాలర్‌తో పోల్చితే రూపాయి విలువ ప్రతీ సంవత్సరం తగ్గుతూ వస్తుంది. డాలర్‌తో పోల్చితే 2021 లో రూపాయి విలువ సగటున 73.44 ఉండగా, 2022 లో 77.40, 2023లో 82.20, 2024లో 83.30, 2025 లో 83.50 2026లో 96 చేరుకుంది. అంటే, మును పెన్నడూ లేనంతగా 2026లో రూపాయి విలువ అత్యంత తక్కువకు పడిపోయింది. అయితే రూపాయి విలువ ఎందుకు అంతగా పడిపోతుంది. అనే ప్రశ్న రావొచ్చు. దానికి కారణం, ఇరాన్ అమెరికా మధ్య జరుగుతన్న యుద్ధం. ఈ యుద్ధం కారణంగా, ముడి చమురు ధరలు విపరీతంగా పెరుగుతూన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా, జరిగే ఇంధనం రవాణాలో సుమారు 20శాతం కేవలం 'హార్మోజ్ జలసంధి'నుండే జరుగుతుంది. ఈ మార్గం ఇరాన్ ఆధీనంలో ఉండటం వలన యుద్ధం కారణంగా ఈ మార్గాన్ని ఇరాన్ మూసివేసింది. దీనితో సప్లై చైన్‌కు ఆటంకంకలిగింది. ఫలితంగా డిమాండ్‌కు తగ్గ సప్లై లేకపోవడం వలనప్రపంచ వ్యాప్తంగా చమురు ధరలు పెరిగాయి. కేవలం ముడి చమురు మాత్రమే కాదు, ట్రంప్ పదవి చేపట్టిన నాటి నుండి బంగారం ధర కూడా అంతర్జాతీయ మార్కెట్‌లో



విపరీతంగా పెరిగింది. ట్రంప్ 'టారిఫ్'ల వలన భవిష్యత్‌లో ఆర్థిక అస్థిరత ఏర్పడుతుంది అనే భయంతో ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడి దారులు, దేశాల రిజర్వ్ బ్యాంకులు బంగారాన్ని ఎక్కువగా కొనుగోలు చేసాయి. ఫలితంగా బంగారం డిమాండ్ పెరిగి అంతర్జాతీయం మార్కెట్‌లో దాని ధరలు మునుపెన్నడూ లేని విధంగా పెరిగాయి. మరి ముడి చమురు, బంగారం ధరలు పెరిగితే మన రూపాయి ఎందుకు పతనమవుతుంది? దానికి కారణం మన దేశానికీ కావలిసిన మొత్తం ముడి చమురు అవసరంలో సుమారు 87 శాతం వరకు ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకుంటుంది. ఇక బంగారం విషయంలో కూడా మన దేశం ఎక్కువగా దిగుమతి మీద ఆధారపడి ఉన్నది. 2024-25 లో 58 బిలియన్ డాలర్ విలువ గలిగిన 757.09 టన్నుల బంగారం దిగుమతి చేసుకోగా, 2025-26 లో 78.98 బిలియన్ డాలర్ల విలువగలిగిన 721.03 టన్నుల బంగారం దిగుమతి చేసుకున్నాము. బంగారం, ముడి చమురు దిగుమతి చేసుకున్నందుకు దిగుమతి దారునికి మన దేశం డాలర్ రూపంలో చెల్లించాలి. డాలర్‌లో చెల్లించాలి అంటే, మన రూపాయిని చెల్లించి డాలర్‌ను అంతర్జాతీయ మార్కెట్‌లో కొనుగోలు చేయాలి. అంటే, డాలర్‌కు డిమాండ్ పెరుగుతుంది. ఎప్పుడైతే, డాలర్ సప్లయ్‌స్థిరంగా ఉంది, దాని డిమాండ్ పెరుగుతుందో అప్పుడు డాలర్ ధర మార్కెట్ లో పెరుగుతుంది. అంటే, ఇంధనం ఒక బారెల్‌కు 106డాలర్ ఉన్నప్పుడు మార్కెట్‌లో ఒక డాలర్ విలువ 83 రూపాయాలు మాత్రమే. అప్పుడు మనం 8,798 రూపాయలు చెల్లించి ఒక బారెల్ కొనేవాళ్ళం. కానీఇప్పుడు అదే 106 డాలరు విలువ ఉన్న ఒక బారెల్‌కు ఒక డాలర్ 96 రూపాయల చొప్పున సుమారు 10,176 రూపాయలు చెల్లించాలి. ఆ అదనపు భారం వలన దేశీయ మార్కెట్ లో ఇంధనం ధరలు పెంచవలసి వస్తుంది. ఒక వేళా ఇంధన ధరలు దేశీయంగా పెంచితే, ఆ ప్రాభవం అన్ని రంగాల మీద పడి ద్రవ్యోల్బణం, ఆర్థిక అనిచ్చితి దారి తీస్తుంది. ఈ అధిక ధరల వల్ల కరెంట్ అకౌంట్ లోటు పెరగడం, విదేశీ మారక నిల్వలు తగ్గడం, ప్రభుత్వ సబ్సిడీలపై ఒత్తిడి పెరగడం వంటి పరోక్ష ఖర్చులు గణనీయంగా పెరుగుతున్నాయి. అందుకే ఇటీవల దేశ ప్రధాని నరేంద్ర మోడీ కూడా ఇంధనం, బంగారం కొనుగులు తగ్గించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేసారు. ప్రస్తుత పరిస్థితులలో విదేశీ మారకపు నిల్వలపై ఒత్తిడి తగ్గించేందుకు ప్రభుత్వం, బంగారం వెండి దిగుమతులపై పన్నులను 15 శాతానికి పెంచింది. దీనితో ఆయా వస్తువుల దిగుమతుల వ్యయం పెరగడం వలన దేశీయ మార్కెట్‌లో ధరలు పెరిగి, కొనుగోళ్లు తగ్గుతాయి. ఫలితంగా వాటి దిగుమతులు కూడా తగ్గే అవకాశంఉన్నది. ముడి చమురు తరువాత మనదేశం ఎక్కువగా బంగారం వెండి వస్తువులు దిగుమతి చేసుకుంటుంది. బంగారం, ముడి చమురు, వంట నూనె వినియోగం కనీసం 10 శాతం తగ్గినా సుమారు 45బిలియన్ డాలర్ల వరకు విదేశీ మారక నిల్వలను ఆదాచేయవచ్చని 'ఎనలిస్టులు' అంచనా వేస్తున్నారు. ఈ నెల 1వ తేదీ వరకు సుమారు 690.7 బిలియన్ డాలర్ల విదేశీ మారక నిల్వలు ఆర్.బి.ఐ దగ్గర ఉన్నాయి. రూపాయి పతనాన్ని ఆపేందుకు ఆర్.బి.ఐ తన దగ్గరున్న డాలర్లను దిగుమతి దారులకు అమ్ముతుంది. రూపాయి విలువ మరింత తగ్గకుండా ఉండేందుకు ప్రధాని సైతం దేశ ప్రజలకు ఇంధనం, వంట నూనె, బంగారం వంటి వస్తువుల పై ఏడాది పాటు పొదుపు పాటించాలని పిలుపు ఇచ్చారు. ఒక వేళా దిగుమతులు తగ్గకుండా ఇదే పరిస్థితి కొనసాగితే, రాబోయేరోజుల్లో రూపాయి విలువ మరింత పడిపోతుంది. ఫలితంగా ఆర్థిక మందగమనం ఏర్పడుతుంది. •

(రచయిత: కామర్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్)

# బస్తర్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం!

## - శాశ్వత శాంతి నెలకొల్పడానికి చర్యలు చేపట్టాం
## - జగదల్‌పూర్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా



**జగదల్‌పూర్, మే 18:** ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో శాశ్వత శాంతిని నెలకొల్పడానికి, అభివృద్ధి ఫలాలు చివరి వ్యక్తికి కూడా చేరేలా చూడటానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం బస్తర్ జిల్లా కేంద్రమైన జగదల్‌పూర్‌లోని 'అమర్ వాటిక' వద్ద మావోయిజంపై పోరాటంలో ప్రాణాలు అర్పించిన 1,000 మందికి పైగా భద్రతా సిబ్బందికి అమిత్ షా నివాళి అర్పించారు. అమర్ వాటిక వద్ద జరిగిన కార్యక్రమంలో, బిజాపూర్ జిల్లాలో జరిగిన మావోయిస్టు దాడిలో అమరులైన భద్రతా సిబ్బంది కలెంద్ర ప్రసాద్ నాయక్, పవన్ కుమార్ మండవి కుటుంబ సభ్యులను షా కలిశారు. వారికి ప్రభుత్వం తరపున అన్ని విధాలా అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. కేంద్ర హోం మంత్రి భద్రతా సిబ్బందితో కూడా ముచ్చటించి, వారి ధైర్యాన్ని, అంకితభావాన్ని, నిబద్ధతను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ, "బస్తర్ ప్రాంతంలో శాంతి, భద్రత, అభివృద్ధిని నెలకొల్పడంలో మన జవాన్లు చేసిన త్యాగాలు ఎప్పటికీ మరువలేనివి. దేశ భద్రత కోసం తమ ప్రాణాలను అర్పించిన ఆ ధైర్యవంతులైన సిబ్బంది త్యాగం ఎప్పటికీ వృధా కాదు" అని పేర్కొన్నారు. "శాశ్వత శాంతిని నెలకొల్పడానికి, అభివృద్ధి ఫలాలు చివరి వ్యక్తికి కూడా చేరేలా చూడటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి నిబద్ధతతో కృషి చేస్తున్నాయి" అని కేంద్ర హోంమంత్రి వివరించారు. దశాబ్దాల తీవ్రవాద హింస అనంతరం ఇటీవల నక్సల్ రహిత రాష్ట్రంగా ప్రకటించబడిన ఛత్తీస్‌గఢ్‌లో, అభివృద్ధికి సంబంధించిన ఒక నూతన అధ్యాయానికి నాంది పలుకుతూ... కేంద్ర హోం మంత్రి అమిత్ షా సోమవారంనాడు బస్తర్ జిల్లాలోని ఒక మారుమూల గ్రామంలో, భద్రతా శిబిరం నుండి ప్రజా సేవా కేంద్రంగా రూపాంతరం చెందిన మొట్టమొదటి కేంద్రాన్ని ప్రారంభించారు.రాష్ట్రంలోని గతంలో వామపక్ష తీవ్రవాద (ఎల్‌డబ్ల్యూఇ) ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న మొత్తం 196 భద్రతా దళాల శిబిరాలలో 70 శిబిరాలను, రాబోయే ఏడాదిన్నర కాలంలో 'సేవా శిబిరాలు' (ప్రజా సేవా కేంద్రాలు)గా మారుస్తామని మంత్రి తెలిపారు. 'బస్తర్ 2.0' కార్యాచరణ ప్రణాళిక ప్రారంభానికి ఈ కార్యక్రమం నాంది పలుకుతుందని అధికారులు తెలిపారు. ఈ ప్రణాళికలో భాగంగా భద్రతా శిబిరాలను ప్రజా సంక్షేమ వినియోగ పనుల కోసం "పునరుద్దేశిస్తారు". అభివృద్ధి లోపం కారణంగా ఈ ప్రాంతాలకు మావోయిజం మళ్లీ తిరిగి రాకుండా చూసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించిన అత్యంత కీలకమైన కార్యాచరణ ప్రణాళిక ఇది అని అధికార వర్గాలు తెలిపాయి. మార్చి 31న రాష్ట్రం సాయుధ మావోయిస్టుల ముప్పు నుండి విముక్తమైందని ప్రకటించిన తర్వాత ఛత్తీస్‌గఢ్‌లో అమిత్ షా జరిపిన తొలి పర్యటన.

# ఢిల్లీ లిక్కర్ కేసు విచారణ మరొక జడ్జికి బదలాయింపు!



**న్యూఢిల్లీ, మే 18:** ఢిల్లీ లిక్కర్ కేసు విచారణకు సంబంధించిన తీవ్రస్థాయిలో జరిగిన వివాదానికి తెరపడింది. జస్టిస్ స్వర్ణకాంతశర్మ బెంచ్‌నుంచి కేసును తప్పించాలని కోరిన ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్ కృషి సఫలం అయింది. ఇకపై ఈ కేసును జస్టిస్ మనోజ్ జైన్ విచారించనున్నారు. అనేక నాటకీయ పరిణామాల మధ్య ఈ కేసు విచారణ నుంచి జస్టిస్ స్వర్ణకాంత శర్మ తప్పుకొన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఢిల్లీ హైకోర్టులో ఈ కేసు విచారణ సాగుతోంది. ఈ కేసులో ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, ఆమ్ ఆద్మీ పార్టీ నేతలైన మనీష్ సిసోడియా వంటి నేతలు కీలక నిందితులుగా ఉన్నారు. ఢిల్లీ లిక్కర్ కేసులో అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా సహా పలువురు నిందితులపై సీబీఐ మోపిన అభియోగాల్ని ఇటీవల ట్రయల్ కోర్టు కొట్టేసిన సంగతి తెలిసిందే. దీంతో కేజ్రీవాల్ సహా నిందితులంతా బెయిల్‌పై విడుదలయ్యారు. అయితే, ట్రయల్ కోర్టు నిర్ణయాన్ని సవాలు చేస్తూ సీబీఐ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. తాజాగా ఈ కేసు విచారణ మంగళవారం జరగనుంది. దీన్ని జస్టిస్ మనోజ్ జైన్ ఆధ్వర్యంలోని బెంచ్ విచారించనుంది. ఇంతకుముందు ఈ కేసును జస్టిస్ స్వర్ణకాంత శర్మ ఆధ్వర్యంలోని బెంచ్ విచారించింది. ఆమె ఈ కేసు వాదించడాన్ని కేజ్రీవాల్ సహా నిందితులు వ్యతిరేకించారు. జస్టిస్ స్వర్ణకాంత శర్మపై పలు ఆరోపణలు చేశారు. ఆమెకు ఆర్ఎస్ఎస్ వంటి సంస్థలతో సంబంధాలున్నాయని, కేసు విచారణ నిష్పక్షపాతంగా జరగదని తెలిపారు. అందుకే, ఆమె ఉంటే కేసు విచారణకు హాజరయ్యేది లేదన్నారు. ఇదే సమయంలో గతంలో జరిగిన కేసు విచారణకు సంబంధించిన వీడియోని కేజ్రీవాల్ సహా నిందితులు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఫొటోలు, వీడియోల్ని కూడా షేర్ చేశారు. దీంతో ఈ అంశం వివాదాస్పదమైంది. కోర్టులు, న్యాయవ్యవస్థ గౌరవాన్ని తగ్గించేలా ఆమ్‌ఆద్మీ నేతలు వ్యవహరించారని జస్టిస్ స్వర్ణకాంత శర్మ ఆరోపించారు. ఈ మేరకు కేజ్రీవాల్ సహా నిందితులపై దీనిపై కేసు నమోదైంది. ఇదే సమయంలో ఈ కేసు విచారణ నుంచి తప్పుకొంటున్నట్లు జస్టిస్ స్వర్ణకాంత శర్మ ప్రకటించారు. ఆమె తప్పుకోవడంపై ఆమ్ ఆద్మీ నేతలు హర్షం వ్యక్తం చేశారు.

# గోమతి ఎక్స్‌ప్రెస్ బోగీలోని ట్రంకుపెట్టెలో ముక్కలుగా మహిళ మృతదేహం



**లక్నో, మే 18:** రైలు స్లీపర్ కోచ్‌లో అనుమానాస్పద ఇనుప పెట్టెను పారిశుధ్య సిబ్బంది గుర్తించి తాళం పగులగొట్టి దానిని తెరిచి చూడగా మహిళ మృతదేహం భాగాలను పోలీసులు గుర్తించారు. మహిళను హత్య చేసి మృతదేహాన్ని ముక్కలుగా నరికి పెట్టె, బ్యాగులో ఉంచి రైలులో వదిలేసినట్లు రైల్వే పోలీసులు అనుమానిస్తున్నారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో ఈ సంఘటన జరిగింది. బీహార్‌లోని చాప్రా నుంచి బయలుదేరిన ఎక్స్‌ప్రెస్ రైలు, లక్నోలోని గోమతి నగర్ స్టేషన్‌లో ప్రయాణాన్ని ముగించింది. సోమవారం ఉదయం ఆ రైలు కోచ్‌లను పారిశుధ్య సిబ్బంది క్లీనింగ్ చేస్తుండగా ఒక స్లీపర్ కోచ్ సిటు కింద వదిలేసిన ఇనుప పెట్టె, ఒక బ్యాగ్‌ను వారు గుర్తించారు. రక్తం మరకలు ఉండటంతో అనుమానించి రైల్వే అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆ ఇనుప పెట్టె తాళం పగులగొట్టి చూడగా మహిళ మృతదేహం భాగాలు ఉన్నాయి. మొండెం, వేరు చేసిన తల భాగాలు పెట్టెలో, కాళ్లు, చేతుల భాగాలను పాలిథిన్ సంచుల్లో ప్యాక్ చేసి బట్టల మధ్య దాచి బ్యాగ్‌లో ఉంచడాన్ని రైల్వే పోలీసులు పరిశీలించారు. మరోవైపు మృతురాలి వయస్సు 25 నుంచి 30 ఏళ్ల మధ్య ఉంటుందని రైల్వే పోలీస్ అధికారి తెలిపారు. ఆమె గొంతు కోసి హత్య చేసి, మృతదేహాన్ని ముక్కలుగా నరికిన హంతకులు ఇనుప పెట్టె, బ్యాగులో వాటిని ఉంచి రైలులో వదిలేసినట్లు అనుమానించారు. ఆ రైలు ప్రయాణించిన అన్ని రైల్వే స్టేషన్లలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నట్లు వివరించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# 22న ఢిల్లీకి విజయ్ - ముఖ్యమంత్రిగా తొలి హస్తిన పర్యటన

## - ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులతో భేటీ - మూడ్రోజులు ఢిల్లీలోనే విజయ్ మకాం



**చెన్నై, మే 18:** తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్, పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత తన తొలి అధికారిక పర్యటన నిమిత్తం మే 22న న్యూఢిల్లీలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, సీనియర్ కేంద్ర మంత్రులతో సమావేశం కానున్నారు. ఈ మూడు రోజుల పర్యటనలో, తమిళనాడులోని అభివృద్ధి ప్రాజెక్టులకు ఆర్థిక సహాయం అందించాలన్న డిమాండ్లు, శ్రీలంక అధికారులు తమిళనాడు మత్స్యకారులను పదేపదే నిర్బంధించడం, వారిపై దాడులు చేస్తున్నారనే ఆరోపణలపై ఆందోళనలతో సహా కీలకమైన రాష్ట్రకేంద్ర సమస్యలపై దృష్టి సారించే అవకాశం ఉంది. విజయ్ విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌ను కలిసి, భారత్– శ్రీలంకల మధ్య దీర్ఘకాలంగా దౌత్య, రాజకీయ సమస్యగా ఉన్న మత్స్యకారుల సమస్యను ప్రస్తావించే అవకాశం ఉంది. తమిళనాడుకు చెందిన మత్స్యకారులు, ముఖ్యంగా రామనాథపురం, నాగపట్టణం వంటి తీరప్రాంత జిల్లాల వారు, తరచుగా పాల్క్ జలసంధి సమీపంలోని జలాల్లోకి వెళ్తుంటారు. అక్కడ సముద్ర సరిహద్దుల వివాదాల కారణంగా, గత కొన్నేళ్లుగా శ్రీలంక అధికారులు మత్స్యకారులను అరెస్టు చేయడం, నిర్బంధించడం, పడవలను స్వాధీనం చేసుకోవడం వంటివి చేస్తున్నారు. ఈ సమస్య తమిళనాడులో పదేపదే నిరసనలకు దారితీసింది. నిర్బంధంలో ఉన్న మత్స్యకారులను విడుదల చేయించాలని, శాశ్వత దౌత్య పరిష్కారం కనుగొనాలని వరుస రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రాన్ని కోరాయి. ఇటీవలి సంవత్సరాలలో, ఉద్రిక్తతలను తగ్గించే లక్ష్యంతో భారత్, శ్రీలంక చర్చలు జరిపినప్పటికీ, ఎప్పటికప్పుడు సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ముఖ్యమంత్రి కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌లను కూడా కలవనున్నారు. ఈ సమావేశాల్లో, రాష్ట్రంలో మౌలిక సదుపాయాలు, సంక్షేమం, ఇతర అభివృద్ధి కార్యక్రమాల కోసం మరింత కేంద్ర సహాయం కోరుతూ విజయ్ ప్రతిపాదనలు సమర్పించే అవకాశం ఉంది. పట్టణ మౌలిక సదుపాయాలు, విపత్తు సహాయం, పారిశ్రామిక వృద్ధి, సామాజిక సంక్షేమ కార్యక్రమాల కోసం కేంద్రం నుంచి కేటాయింపులు పెంచాలని తమిళనాడు తరచుగా కోరుతూ వస్తోంది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత కేంద్ర ప్రభుత్వంతో విజయ్ పాల్గొం టున్న తొలి అధికారిక కార్యక్రమం ఈ పర్యటన. కేంద్ర, రాష్ట్ర సంబంధాలపై, ఆయన పరిపా లనలో తమిళనాడు విధాన ప్రాధాన్యతలపై ప్రభా వం ఉంటుందోనని పరిశీలకులు అంటున్నారు.

# కేరళం పీఠంపై సతీశన్

## ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణం చేయించిన గవర్నర్ అర్లేకర్
## 20 మంది మంత్రులలో రమేశ్ చెన్నితల, కె.మురళీధరన్
## హాజరైన మల్లికార్జున్‌ఖర్గే, రాహుల్, ప్రియాంకగాంధీ, పినరైవిజయన్ ప్రభృతులు



**తిరువనంతపురం, మే 18:** కేరళంలో కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ ప్రభుత్వం కొలువుదీరింది. తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో కేరళ 13వ సీఎంగా వీడీ సతీశన్ సోమవారం ప్రమాణం స్వీకారం చేశారు. ఆయనతో గవర్నర్ ఆర్లేకర్ ప్రమాణం చేయించారు. సతీశన్ ప్రమాణ స్వీకారోత్సవానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ, కాంగ్రెస్ సీనియర్ నేతలు హాజరయ్యారు. కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ హాజరయ్యారు. 20 మంది మంత్రులు ప్రమాణం సతీశన్‌తో పాటు 20 మంది ఎమ్మెల్యేలను గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్ మంత్రులుగా ప్రమాణం చేయించారు. వారిలో 14 మంది తొలిసారిగా మంత్రులుగా బాధ్యతలు చేపట్టారు. యూడీఎఫ్ కూటమి పార్టీలతో చర్చల అనంతరం 20 మందికి మంత్రి పదవులను ఖరారు చేశారు. కాంగ్రెస్ సీనియర్ నేతలు రమేశ్ చెన్నితల, కే మురళీధరన్, ఎపీ అనిల్ కుమార్, సన్నీ జోసెఫ్‌తో పాటు ఐయూఎంఎల్‌కు చెందిన పీకే కున్హాల్ కుట్టి, ఎన్ శంషుద్దీన్, కెఎం షాజీ, పీకె బషీర్, వీఇ అబ్దుల్ గఫూర్ ఉన్నారు. టీ రాధాకృష్ణన్ స్పీకర్‌గా, షనిమోల్ ఉస్మాన్ (మహిళ) డిప్యూటీ స్పీకర్‌గా వ్యవహరించ నున్నారు. సీఎం ఎంపికకోసమే రెండువారాలు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత కేరళ ముఖ్యమంత్రి ఎవరనే దానిపై ఉత్కంఠ నడిచింది. కేసీ వేణుగోపాల్, సతీశన్ మధ్య హోరాహోరీ పోటీ నెలకొంది. దాదాపు 10 రోజులకుపైబడి చర్చలు జరిగాయి. ఈనెల14న కాంగ్రెస్ అధిష్ఠానం కేరళ ముఖ్యమంత్రిగా వీడీ సతీశన్ పేరును ప్రకటించింది. మే 7న తిరువనంతపురంలో జరిగిన కాంగ్రెస్ శాసనసభ పక్ష సమావేశంలో రాష్ట్రంలో సీఎల్పీకి కొత్త నాయకుడిని నియమించేందుకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేకు పూర్తి అధికారం ఇవ్వాలని ఏకగ్రీవంగా తీర్మానించింది. దీనికి అనుగుణంగా కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు, ఎంపీలతో సహా అనేక ఇతర నాయకులతో సమావేశమైన ఏఐసీసీ పరిశీలకులతో కాంగ్రెస్ అధ్యక్షుడు, సోనియా గాంధీ, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ విస్తృత చర్చలు జరిపారు. ఈ చర్చలన్నింటి ఆధారంగా వీడీ సతీశన్‌ను సీఎల్పీ నాయకుడిగా నియమించాలని నిర్ణయించారు. కొచ్చి సమీప నెట్టూర్‌లో 1964లో జన్మించిన వీడీ సతీశన్ వృత్తిరీత్యా న్యాయవాది. పదేళ్ల కేరళ హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. సామాజిక కార్యకర్తగానూ పేరొందారు. కేరళ విద్యార్థి విభాగం కేఎస్‌యూతో ఆయన రాజకీయ ప్రస్థానం మొదలైంది. 2001 నుంచి పరావూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గత ఐదేళ్లుగా కేరళ అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా ఉన్నారు. ప్రతిపక్ష నేతగా పినరయి విజయన్ ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేశారు. కేరళ ముఖ్యమంత్రి పదవికి ముగ్గురు సీనియర్ నేతలు తీవ్రంగా పోటీ పడినప్పటికీ చివరకు సతీశన్ వైపే కాంగ్రెస్ అధిష్ఠానం మొగ్గుచూపింది. పదేళ్లుగా కేరళలో అధికారానికి దూరమైన పార్టీని విస్తృత ప్రజాబాహుళ్యం మద్దతుతో గెలిపించడంలో సతీశన్ కీలక పాత్ర పోషించారు. విపక్షనేతగా సమర్థంగా పనిచేయడంతో పాటు వామపక్షాల ఆధిపత్యానికి గండికొట్టారు.

# సతీశన్ ప్రమాణ స్వీకారంలో లోక్‌భవన్ నిబంధనలు తూచ్!

**తిరువనంతపురం, మే 18:** కేరళ ముఖ్యమంత్రి సతీశన్ ప్రమాణ స్వీకారంలో లోక్ భవన్ విధించిన నిబంధనల్ని పాటించలేదనే ఆరోపణలు వస్తున్నాయి. వేదికపై కేవలం గవర్నర్, కొత్త సీఎం వీడీ సతీశన్, ప్రమాణ స్వీకారం చేసే మంత్రులు మాత్రమే కూర్చోవాలని లోక్ భవన్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని సమాచారం. మిగిలిన నేతలంతా కింద ప్రేక్షకుల్లోనే కూర్చోవాలని పేర్కొన్నట్లు లోక్‌భవన్ వర్గాలు తెలిపాయి. కానీ ఈ ప్రొటోకాల్‌ను ఎవరూ పాటించలేదు. సెంట్రల్ స్టేడియంలో జరిగిన ఈ వేడుకలో కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ నేరుగా వేదికపైకి వచ్చి కూర్చున్నారు. వీరితో పాటు ప్రతిపక్ష నేత పినరయి విజయన్, సీపీఐ బినోయ్ విశ్వం, బీజేపీ నేత రాజీవ్ చంద్రశేఖర్‌కు కూడా స్టేజ్‌పైనే సీట్లు కేటాయించారు.

దీంతో లోక్ భవన్ ఆదేశాలు పూర్తిగా పక్కనబెట్టినట్లయింది. ఈ కఠినమైన ప్రొటోకాల్స్ వెనుక రాజకీయ కుట్ర ఉందని కాంగ్రెస్ నాయకత్వం ఆరోపించింది. రాహుల్ గాంధీ, ఖర్గేలను స్టేజ్‌పైకి రానివ్వకుండా చేయడానికే ఈ నిబంధనలు పెట్టారని మండిపడింది. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ప్రధాని, హోంమంత్రులు ఇలాగే వేదికలను పంచుకుంటారని కాంగ్రెస్ గుర్తుచేసింది. లోక్ భవన్ వైఖరి ప్రజాస్వామ్య విరుద్ధంగా ఉందని విమర్శించింది.

# మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం నెలనెలా రూ.3వేలు ఆర్థికసాయం

## బెంగాల్‌లో సువేందు ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు..



**కోల్‌కత్తా, మే 18:** పశ్చిమ బెంగాల్‌లో అధికారం చేపట్టిన బీజేపీ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుకు సిద్ధమవుతోంది. ఎన్నికల్లో హామీ మేరకు కొన్ని పథకాల అమలుపై నిర్ణయం తీసుకున్నారు. బెంగాల్ రాజధాని కోల్‌కతాలో సోమవారం సీఎం సువేందు అధికారి ఆధ్వర్యంలో రెండోసారి క్యాబినెట్ భేటీ జరిగింది. ఈ భేటీలో జూన్ 1 నుంచి పలు పథకాల అమలు చేయాలని నిర్ణయించారు. క్యాబినెట్ భేటీలో ప్రధానంగా ఐదు కీలక అంశాలపై చర్చ జరిపి, ఆమోదం తెలిపారు. వచ్చే జూన్ 1 నుంచి అన్నపూర్ణ పథకం అమలు చేస్తారు. అర్హులైన మహిళలకు ఈ పథకం కింద నెలకు రూ.3,000 ఆర్థిక సాయం అందిస్తారు. ప్రభుత్వ బస్సుల్లో మహిళలకు జూన్ 1 నుంచి ఉచిత ప్రవేశం కల్పిస్తారు. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం కోసం 7వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సీఏఏ చట్టం కింద భారత పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకున్న మహిళలకు కూడా సంక్షేమ పథకాలు అందిస్తామని బెంగాల్ మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి అగ్నిమిత్ర పాల్ తెలిపారు. ఇప్పటికే అమలవుతున్న లక్ష్మీ భండార్ పథకం లబ్ధిదారులు మళ్లీ దరఖాస్తు చేయకుండానే అన్నపూర్ణ పథకానికి అర్హత పొందుతారని మంత్రి చెప్పారు. ఈ పథకం పొందలేని వారు దరఖాస్తు చేసుకునేందుకు త్వరలోనే కొత్త పోర్టల్ ప్రారంభిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, వివిధ శాఖల సిబ్బంది కోసం 7వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. మరోవైపు మతపరమైన సంక్షేమ పథకాల్ని, ప్రోత్సహకాల్ని జూన్ 1 నుంచి రద్దు చేయబోతున్నట్లు తెలిపారు. దీని ప్రకారం మదర్సాలకు అందించే సాయం ఆగిపోయే అవకాశం ఉంది. ఓబీసీలకు అందించే పథకాల అమలుకు కొత్త కమిషన్ ఏర్పాటు చేయబోతున్నారు. త్వరలో ప్రభుత్వం కొత్త ఎలక్ట్రిక్ బస్సుల్ని కొనుగోలు చేయనుంది. కేంద్రంతో కలిసి ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేయబోతున్నట్లు ఇటీవలే సువేందు అధికారి ప్రభుత్వం ప్రకటించింది.

# అమెరికాపై డ్రోన్ల దాడులకు క్యూబా వ్యూహాలు!

## కలవరపడుతున్న అగ్రరాజ్యం

**హవానా, మే 18:** క్యూబాను అమెరికా ఇప్పుడు ఓ భద్రతాపరమైన ముప్పుగా పరిగణిస్తోంది. సుమారు 300కు పైగా సైనిక డ్రోన్లను హవానా సమీకరించుకుందని, అమెరికా లక్ష్యాలపై దాడులకు సంబంధించిన ప్రణాళికలు చర్చిస్తోందని వర్గీకృత నిఘా వర్గాలు గుర్తించినట్లు యాక్సియోస్ కథనం వెల్లడించింది. దీంతో ట్రంప్ యంత్రాంగంలో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఉద్రిక్తతలు పెరిగితే గ్వాంటనామో బేలోని అమెరికా నావికా స్థావరం, సైనిక నౌకలు, ఫ్లోరిడాలోని కీ వెస్ట్‌పై దాడులకు క్యూబా అధికారులు ప్రణాళికలు రచించినట్లు ఈ నివేదికలో పేర్కొన్నారు. క్యూబాకు రష్యా, ఇరాన్‌లతో పెరుగుతున్న రక్షణ సంబంధాలు, హవానాలో ఇరాన్ సైనిక సలహాదారుల ఉనికిపై అమెరికా ఆందోళన చెందుతోంది. ఇంత సమీపంలో ఇలాంటి టెక్నాలజీలు ఉండటం ఆందోళన కలిగించే అంశం, ఇదొక పెరుగుతున్న ముప్పు అని ఒక సీనియర్ అమెరికా అధికారి వ్యాఖ్యానించారు. ఈ పరిణామాల నేపథ్యంలో సీఐఏ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్ గురువారం క్యూబాలో పర్యటించి, ఎలాంటి రెచ్చగొట్టే చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించారు. 1996లో రెండు విమానాలను కూల్చివేసిన ఘటనలో క్యూబా మాజీ నేత రౌల్ క్యాస్ట్రోపై అభియోగాలు నమోదు చేసేందుకు అమెరికా న్యాయశాఖ సిద్ధమవుతోంది. ఈ ఆరోపణలను క్యూబా విదేశాంగ మంత్రి బ్రూనో రోడ్రిగ్జ్ ఖండించారు. ఆంక్షలు, సైనిక జోక్యాన్ని సమర్థించుకునేందుకే అమెరికా తప్పుడు కేసు బనాయిస్తోందని ఆరోపించారు. ఐక్యరాజ్యసమితి చార్టర్ ప్రకారం ఆత్మరక్షణ హక్కు తమకుందని స్పష్టం చేశారు. అయితే, డ్రోన్లు ఉన్నాయా లేదా అనే విషయాన్ని క్యూబా నేరుగా ఖండించలేదు.

# మహిళలకు ఉచిత ప్రయాణం.. ఆశావర్కర్లకు గౌరవభృతి పెంపు

## - సిఎంగా సతీశన్ తొలిసంతకం



**తిరువనంతపురం,మే 18:** ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారంచేసిన వెనువెంటనే ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా మహిళలకు ఉచిత ప్రయాణం, ఆశా వర్కర్ల గౌరవభృతి పెంపు ఫైళ్లపై తొలిసంతకం చేసారు. కెఎస్‌ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలుచేయాలన్న ఆదేశాలు అమలుకు వచ్చాయి. అలాగే ఆశా వర్కర్లకు ఇచ్చే గౌరవ వేతనం పెంచేందుకు కూడా ముఖ్యమంత్రి ఉత్తర్వులు ఆరీచేసారు. మహిళలకు ఉచిత ప్రయాణం జూన్ 15వ తేదీనుంచి అమలులోకి రానున్నట్లు సీఎం స్వయంగా ప్రకటించారు. ఎన్నికల ప్రచారంలోను, తన మేనిఫెస్టోలో కూడా మహిళలకు ఉచితప్రయాణం ఇసానతమని హామీ ఇచ్చింది. అలాగే ఆశావర్కర్లకు నెలవారీ భత్యం మరో 3వేల రూపాయలు పెంచుతున్నట్లుకూడాప్రకటించింది. ప్రస్తుతం రూ.9వేలు పొందుతున్న ఈ భత్యం ఇకపై 12 వేలకు పెరుగుతుందని సతీశన్‌వెల్లడించారు. తదుపరి భవిష్యత్తులో అవసరమైతే మరోసారి సవరణలు మార్పులు ఉంటాయని కూడా వెల్లడించారు. ఎన్నికల్లో యుడిఎఫ్ ఇచ్చిన హామీలు అమలుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, హామీలు నెరవేర్చడమే తమ ప్రథమ కర్తవ్యమని సతీశన్ చెప్పుకొచ్చారు.20 మందితోకూడిన కేబినెట్ ప్రమాణంచేసిన సంగతి తెలిసిందే.

# బెంగాల్ ప్రభుత్వ ఉద్యోగ నియామకాలకు గరిష్ట వయోపరిమితి పెంపు - మే 11 నుంచే అమల్లోకి

**కోల్‌కతా, మే 18:** పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం, 'పశ్చిమ బెంగాల్ సర్వీసెస్ (వయోపరిమితి పెంపు) నిబంధనలు, 1981'కు కొత్త సవరణలు జారీ చేయడం ద్వారా వివిధ రాష్ట్ర సర్వీసులలో ప్రవేశానికి గరిష్ట వయోపరిమితిని సవరించింది. పశ్చిమ ఈ మేరకు బెంగాల్ ఆర్థిక శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ ఉత్తర్వు ప్రకారం, గ్రూప్ ఎ నియామకాలకు గరిష్ట వయోపరిమితిని ఇప్పుడు 41 సంవత్సరాలకు పెంచారు. ఇప్పటికే అధిక వయోపరిమితి ఉన్న ఏ పోస్టు అయినా ప్రస్తుత నిబంధన ప్రకారమే కొనసాగుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. గ్రూప్ బి పోస్టులకు గరిష్ట వయోపరిమితిని 44 సంవత్సరాలకు సవరించారు. గ్రూప్ సి, గ్రూప్ డి పోస్టులకు గరిష్ట వయోపరిమితిని 45 సంవత్సరాలకు పెంచారు. రాష్ట్ర చట్టబద్ధ సంస్థలు, ప్రభుత్వ కంపెనీలు, స్థానిక సంస్థలలో నియామకాల పశ్చిమ బెంగాల్ నియంత్రణ చట్టం, 1999 పరిధిలోకి వచ్చే నియామ కాలలో, పబ్లిక్ సర్వీస్ కమిషన్ యంత్రాంగం వెలుపల ఎంపిక జరిగే చోట, అనుమతించబడిన గరిష్ట వయోపరిమితి.

# సంక్షిప్తంగా..

## ఇరాక్‌లో ఒకటికాదు.. రెండు ఇజ్రాయెల్ రహస్య స్థావరాలు

**బాగ్దాద్, మే 18:** ఇరాన్‌పై దాడులు చేసేందుకు ఇజ్రాయెల్.. ఇరాక్ ఎడారిలోని కర్బలా నగరానికి సమీపంలో ఉన్న ఎండిపోయిన సరస్సులో రహస్యంగా సైనిక స్థావరాన్ని నిర్మించినట్లు గతంలో వార్తలు వచ్చాయి. అయితే ఇరాక్‌లో ఉన్నది ఒక రహస్య స్థావరం కాదని.. రెండు ఉన్నాయని అక్కడి అధికారిక వర్గాలు వెల్లడించాయి. పశ్చిమ ఎడారి ప్రాంతంలో రెండో స్థావరం కూడా ఉన్నట్లు ఆ దేశ సైన్యం గుర్తించింది. ఇరాన్‌పై 2025లో ఇజ్రాయెల్ నిర్వహించిన 12 రోజుల దాడులు ఈ స్థావరం నుంచే చేసినట్లు వెల్లడించింది. ఈ రహస్య స్థావరాన్ని రక్షించే క్రమంలో ఇటీవల ఇరాక్ సైనికుడు, ఓ పౌరుడు కూడా ప్రాణాలు కోల్పోవడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

2024లో ఇజ్రాయెల్ రెండో స్థావరాన్ని నిర్మించిందని.. దాని గురించి అమెరికాకు కూడా తెలుసని ఇరాక్ అధికారులు వెల్లడించారు. అయితే ప్రస్తుతం ఆ స్థావరంలో సైనికులు ఉన్నారా, లేదా అనే విషయంపై స్పష్టత లేదన్నారు.

## మదురై వద్ద ఘోర ప్రమాదం : ఐదుగురు మృతి

**మదురై, మే 18:** తమిళనాడులోని మధురై సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు. ఆలయానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ విషాదం చోటుచేసుకోవడంతో స్థానికంగా విషాద ఛాయలు అలముకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మధురైలోని అన్నా నగర్‌కు చెందిన ప్రకాశ్, అతని బంధువు రమేశ్‌తో పాటు మరో ముగ్గురు మహిళలు కారులో తిరుచిరాపల్లిలోని ప్రముఖ సమయపురం మరియమ్మన్ ఆలయానికి వెళ్లారు. దైవ దర్శనం ముగించుకుని తిరిగి మధురైకి బయలుదేరారు. మేలూరు సమీపంలోని అయ్యపట్టి వద్ద హైవేపై వీరి కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న బ్యారియర్‌ను బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు కారు నుజ్జునుజ్జయి, అందులో ప్రయాణిస్తున్న ఐదుగురూ ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు.

## ఇమ్రాన్ పదవీచ్యుతికి అమెరికా కుట్ర, రహస్యపత్రాలు లీక్..

**కరాచి, మే 18:** పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌ను పదవి నుంచి దించేయడం వెనుక అమెరికా హస్తం ఉందంటూ ఆరోపిస్తున్న ఓ రహస్య దౌత్య పత్రంవెలుగులోకి వచ్చింది. అమెరికాకు చెందిన డ్రాప్ సైట్ అనే పరిశోధక వార్తా సంస్థ ఈ పత్రాల పూర్తి సారాంశాన్ని బయటపెట్టింది. ఇమ్రాన్ ఖాన్ ప్రభుత్వం విశ్వాస పరీక్షలో కూలిపోవడానికి సరిగ్గా నెల ముందు అంటే 2022 మార్చిలో అమెరికా అధికారి డోనాల్డ్ లూ, అప్పటి అమెరికాలోని పాక్ రాయబారి అసద్ మజీద్ ఖాన్ మధ్య జరిగిన సంభాషణలు ఈ పత్రంలో ఉన్నాయి. ఉక్రెయిన్ సంక్షోభం విషయంలో పాకిస్థాన్ తటస్థంగా ఉండటాన్ని అమెరికా తీవ్రంగా తప్పుబట్టినట్లు ఈ పత్రాల ద్వారా తెలుస్తోంది.

ఇమ్రాన్ ఖాన్ రష్యా పర్యటనను ఆయన సొంత నిర్ణయంగానే అమెరికా చూసిందని డోనాల్డ్ లూ పేర్కొన్నారు. ఒకవేళ ప్రధానిపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గితే వాషింగ్టన్ అంతా మర్చిపోతుంది. లేదంటే పాకిస్థాన్‌కు ముందు ముందు రోజులు చాలా కష్టంగా ఉంటాయి అని అమెరికా అధికారి హెచ్చరించినట్లు ఆ పత్రాల్లో ఉంది.

## గ్యాస్ సిలిండర్ లీక్‌తో భారీ పేలుడు..



**ఫతేపూర్,యుపి మే 18:** ఉత్తరప్రదేశ్‌లోని ఫతేపూర్ జిల్లాలో గ్యాస్ సిలిండర్ లీక్ కావడంతో ఓ ఇంట్లో భారీ పేలుడు సంభవించింది. ఈ దుర్ఘటనలో 9 మందికి తీవ్ర గాయాలయి వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. బాధితులను మెరుగైన చికిత్స కోసం కాన్పూర్‌లోని ఆసుపత్రికి తరలించారు. కల్యాణ్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పిల్హిని గ్రామంలో ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. సంతోష్ లోధి భార్య కళావతి ఇంట్లో వంట చేస్తుండగా గ్యాస్ పైపు నుంచి లీకైంది. క్షణాల్లో ఇల్లంతా గ్యాస్ వ్యాపించి, ఒక్కసారిగా మంటలు అంటుకుని భారీ పేలుడు సంభవించింది. ఈ పేలుడు ధాటికి ఇంట్లో ఉన్న ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి.

## సోషల్‌మీడియాతో ట్రంప్ ఇరాన్‌పై మైండ్‌గేమ్!

**వాషింగ్టన్, మే 18:** అమెరికా, ఇరాన్ మధ్య యుద్ధ ప్రతిష్టంభన కొనసాగుతున్న వేళ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన దూకుడును సోషల్ మీడియా వేదికగా ప్రదర్శించారు. తన ట్రూత్ సోషల్ ప్లాట్‌ఫామ్‌లో ఇరాన్‌ను హెచ్చరిస్తూ, రెచ్చగొట్టేలా ఉన్న ఏఐ చిత్రాలను వరసగా పోస్ట్ చేశారు. కొన్ని గంటల వ్యవధిలోనే ట్రంప్ 20కి పైగా చిత్రాలను పంచుకున్నారు. వీటిలో చాలా వరకు ఇరాన్పై అమెరికా సైనిక చర్యను తీవ్రతరం చేస్తున్నట్లుగా ఉన్నాయి. ఇరాన్ పటాన్ని అమెరికా జెండాతో కప్పి, చుట్టూ బాణాలు గురిపెట్టినట్లు ఉన్న ఒక చిత్రం తీవ్ర చర్చనీయాంశమైంది. ఇరాన్ ఫాస్ట్ బోట్లపై అమెరికా డ్రోన్ దాడి చేస్తున్న చిత్రం కింద బై బై, ఫాస్ట్ బోట్స్ అని రాశారు. అంతేగాక తాను ఒక కంప్యూటర్ ముందు కూర్చుని టేబుల్పై చేతితో నొక్కుతూ, "బా బా బా బా ఫైర్, బూమ్ అంటూ క్షిపణి దాడికి" ఆదేశాలిస్తున్నట్లు నటించిన ఒక వీడియోను కూడా పంచుకున్నారు.

# మహిళా ఆర్థిక సాధికారత దిశగా మరో ముందడుగు

## తెలంగాణలో వేగంగా విస్తరిస్తున్న మహిళా పెట్రోల్ బంకులు

## మహిళా సంఘాలను ఆర్థిక శక్తులుగా తీర్చిదిద్దుతున్న ప్రభుత్వం

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త:** గ్రామీణ మహిళలను ఆర్థికంగా మరింత బలోపేతం చేసే దిశగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన మహిళా పెట్రోల్ బంకుల ఏర్పాటు కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా వేగంగా ముందుకు సాగుతోంది. మహిళా సంఘాలకు స్థిరమైన ఆదాయ వనరులు కల్పించాలనే లక్ష ్యంతో అమలు చేస్తున్న ఈ ప్రాజెక్టుపై అధికారులు తాజాగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రి సీతక్కకు సమగ్ర నివేదిక సమర్పించారు.

ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేయాలనిసెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్‌కు మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా జిల్లా కలెక్టర్లు, సెర్ప్ అధికారులు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులు పరస్పర సమన్వయంతో పనిచేసి అనుమతులు, నిర్మాణ పనులు, ట్యాంకుల ఏర్పాటు వంటి అంశాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

ముఖ్యమంత్రి నియోజకవర్గం కొడంగల్‌లోని హకీంపేట గ్రామంలో మహిళా సంఘం ఆధ్వర్యంలో పెట్రోల్ బంకు నిర్మాణ పనులు ప్రస్తుతం కీలక దశకు చేరుకున్నాయి. అక్కడ ఇంధన ట్యాంకుల ఇన్‌స్టాలేషన్ పనులు కొనసాగుతుండగా వీలైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే దిశగా చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర అవతరణ దినోత్సవం నాటికి ప్రారంభించే లక్ష ్యంతో పనిచేయాలని మంత్రి ఆదేశాలు జారి చేశారు.

ప్రస్తుతం రాష్ట్రంలోని 39 ప్రాంతాల్లో మహిళా పెట్రోల్ బంకుల ఏర్పాటుకు చర్యలు కొనసాగుతున్నాయి. ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం సంస్థల సహకారంతో భూముల గుర్తింపు, లీజు ఒప్పందాలు, ఎన్‌ఓసీలు, లేఅవుట్లు, అడ్వాన్స్ పొజెషన్, ట్యాంకుల ఇన్‌స్టాలేషన్ వంటి పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. నల్గొండ జిల్లా గందవారిగూడెంలో ట్యాంకుల ఏర్పాటు పూర్తయి తదుపరి పనులు జరుగుతుండగా, పెద్దపల్లి జిల్లా భూపతిపురంలో కూడా ట్యాంకుల ఇన్‌స్టాలేషన్ పూర్తై నిర్మాణ పనులు వేగం పుంజుకున్నాయి. ఆదిలాబాద్, వికారాబాద్, వనపర్తి, ఖమ్మం, కొమురం భీం, హనుమకొండ జిల్లాల్లో భూమి లెవలింగ్, నిర్మాణ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి.

కరీంనగర్ జిల్లాలో అవసరమైన అన్ని ఎన్‌ఓసీలు పూర్తికాగా కామారెడ్డి, సూర్యాపేట, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో లీజు ఒప్పందాలు, తుది అనుమతుల ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. మరికొన్ని ప్రాంతాల్లో జాతీయ రహదారులు, ఫైర్, పోలీస్, మున్సిపల్, రెవెన్యూ శాఖల నుంచి అనుమతుల ప్రక్రియ కొనసాగు తోంది. ఇప్పటికే నారాయణపేట, సంగారెడ్డి జిల్లాల్లో జిల్లా మహిళా సమాఖ్యల ఆధ్వర్యంలో మహిళా పెట్రోల్ బంకులు విజయవంతంగా నడుస్తు న్నాయి. ఈ బంకుల ద్వారా పది మందికి పైగా మహిళలకు ఉపాధి లభించడంతోపాటు ప్రతీ నెల సుమారు రూ.7 లక్షల వరకు ఆదాయం సమకూ రుతోంది. మహిళా సంఘాలే పెట్రోల్ బంకులను నిర్వహించడం దేశవ్యాప్తంగా ప్రత్యేక మోడల్‌గా నిలుస్తోంది. చమురు కంపెనీలు, వినియోగదారుల నుంచి కూడా మహిళా పెట్రోల్ బంకులకు మంచి స్పందన లభిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

సేవల నాణ్యత, నిర్వహణ విధానం పట్ల సంతృప్తి వ్యక్తమవు తుండటంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నమూనాను మరిన్ని జిల్లాలకు విస్తరించే దిశగా అడుగులు వేస్తోంది. జిల్లా కేంద్రాల్లో మహిళా పెట్రోల్ బంకులు ఏర్పాటయ్యాక, నియోజకవర్గ స్థాయిలో బంకులను ఏర్పాటు చేసే దిశలో కార్యచరణ సిద్ధం చేస్తున్నారు.

# గోవుల అక్రమ రవాణా

## డిజిపికి ఎమ్మెల్యే రాజాసింగ్ లేఖ

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త:** తెలంగాణలో గోవులను అక్రమంగా తరలి స్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రాజాసింగ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్‌కు ఎమ్మెల్యే బహిరంగ లేఖ రాశారు. ఈనెల 16న, శనివారం రాత్రి గోవులతో వెళ్తున్న లారీని గో రక్షక్ దళ్ కార్యకర్తలు అడ్డుకున్నారని.. దీంతో ఎంఐఎం ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ అక్కడకు చేరుకొని ఆ లారీని తీసుకెళ్లడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. చట్టం అందరికీ ఒకేలా ఉండాలని.. హిందువైనా, ఎంఐఎం నాయకులైనా ఒకే విధంగా చూడాలని అన్నారు. గోవుల అక్రమ రవాణా చేస్తూ బహిరంగంగా తిరుగుతున్న వారిపై వెంటనే కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. పోలీసులు.. రాజకీయ ఒత్తిడికి లోనుకాకుండా పని చేయాలని తెలిపారు. హిందువులపై మాత్రమే చర్యలు తీసుకుంటే ప్రజల్లో అనుమానాలు వస్తాయన్నారు. గోమాతను కాపాడాలని చెప్పే ప్రభుత్వం.. అక్రమ రవాణాను ఎందుకు ఆపడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారని తెలిపారు. ఎవరైనా చట్టం ఉల్లంఘిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. తెలంగాణ డీజీపీ వెంటనే ఈ విషయంపై స్పందించి చర్యలు తీసుకోవాలని రాజాసింగ్ లేఖలో స్పష్టం చేశారు.

# మరో రెండు వ్యవసాయ మార్కెట్లకు నూతన కమిటీలు

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని మరో రెండు అగ్రికల్చర్ మార్కెట్ కమిటీలకి నూతన పాలకవర్గాలను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వనపర్తి జిల్లా గోపాల్‌పేట వ్యవసాయ మార్కెట్ కమిటీతోపాటు జిల్లాలోని ఖిల్లాఘనపూర్ వ్యవసాయ మార్కెట్‌కు నూతన పాలకవర్గాలను నియమించింది. ఈ రెండు వ్యవసాయ మార్కెట్ కమిటీలకు చైర్ పర్సన్లను, వైస్‌చైర్ పర్సన్లను, నూతన పాలకవర్గాన్ని నియమించింది. తాజాగా రెండు పాలక వర్గాలను కలుపుకుని ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 190 అగ్రికల్చర్ మార్కెట్ కమిటీలకు నూతన పాలకవర్గాన్ని ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులను అభినందించారు.

# ప్రశాంతంగా ముగిసిన లాసెట్, పిజి లాసెట్ పరీక్షలు

## 81.32 శాతం అభ్యర్థులు హాజరు

## 23న ప్రాథమిక కీ విడుదల

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు లా కాలేజీల్లో మూడు సంవత్సరాలు, 5 సంవత్సరాల కోర్సులో ప్రవేశాల కోసం నిర్వహించే లా సెట్-2026 పరీక్షను, పీజీ లా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పీజీ లాసెట్-2026 పరీక్ష సోమవారం ప్రశాంతంగా ముగిసింది. పరీక్షకు 81.32 శాతం మంది అభ్యర్థులు హాజరైనట్టు లా సెట్, పీజీ లాసెట్-2026 కన్వీనర్ ప్రొఫెసర్ వి బిజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ప్రారంభమైన పరీక్షలను ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, ఓయూ వీసీ ప్రొఫెసర్ ఎం కుమార్, ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్లు ప్రొఫెసర్ ఈ పురుషోత్తం, ఎస్‌కె మహమూద్, కార్యదర్శి శ్రీరామ్ వెంకటేష్, కన్వీనర్ ప్రొఫెసర్ బి విజయలక్ష్మి పరిశీలించారు. పరీక్షకు సంబంధించిన ప్రాథమిక కీని ఈ నెల 23న విడుదల చేయనున్నట్టు తెలిపారు. ప్రాథమిక కీపై అభ్యంతరాలను ఈ నెల 25 వరు స్వీకరించనున్నారు. లాసెట్, పీజీ లాసెట్‌కి 66,864 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో సోమవారం జరిగిన పరీక్షలకు 54,374 మంది హాజరయ్యారు. పరీక్షల నిర్వహణ కోసం 71 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొదటి సెషన్‌ను ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహించగా.. అందులో 23,877 మంది దరఖాస్తు చేసుకుంటే వారిలో 19,139 మంది(80.16శాతం) మంది హాజరయ్యారు. రెండో సెషన్‌ను మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 2 గంటల వరకు నిర్వహించగా 23,696 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 19,122 మంది(80.70శాతం) హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో సాయంత్రం 4 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు 5 సంవత్సరాల లా కోర్సుతోపాటు పీజీలో అడ్మిషన్ల కోసం పరీక్షను నిర్వహించగా 19,291 మందికి గానూ 16,113 మంది(83.53శాతం) మంది పరీక్షకు హాజరయ్యారు. లాసెట్, పీజీ లాసెట్ పరీక్షను ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహిస్తోంది.

# కాంగ్రెస్ నాయకులమంతా ఐక్యంగానే ఉన్నాం

## ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్

**హైదరాబాద్, మే18, ప్రభాతవార్త:** కాంగ్రెస్ నాయకులు బిఆర్ఎస్ పార్టీతో టచ్ లో ఉన్నారని జగదీష్‌రెడ్డి చెప్పడం హాస్యాస్పదమనీ కాంగ్రెస్ నాయకుల మంతా ఐక్యంగానే ఉన్నామనీ ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ తెలిపారు. సిఎల్‌పిలో విలేఖరులతో సోమవారం ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు పది మంది కాంగ్రెస్ తో కలిసి పనిచేస్తున్న విషయం నీకు తెలియదా..?అని ప్రశ్నించారు. మీ పార్టీ అంటే అసలు ఏ పార్టీ..? బిఆర్ ఎస్‌నా, టిఆర్ఎస్‌నా? అన్నారు. టిఆర్ఎస్ పార్టీ పెట్టుకున్న కవిత ప్రశ్నలకు మీదగ్గర సమాధానం లేదు. హరీష్ రావు మీ పార్టీలో ఉంటు బిజెపితో కలవడానికి ప్రయత్నం చేస్తు మీ చుట్టు తొవ్వుతున్న గుంటల గురించి మీకు తెలియదా అని అడిగారు. మీ పార్టీని టిఆర్ఎస్‌గా మార్చుకోవడానికి ప్రయ త్నం చేస్తూ మల్లగుల్లాలు పడుతున్నారనీ ఆయన ఎద్దేవా చేశారు. మీ పార్టీలోనే మూడు ముక్కలాట జరుగుతోందనీ తె లిపారు కవిత వెళ్లిపోయిన తర్వాత కెసిఆర్ , కెటిఆర్ ఒక వైపు, హరీష్ రావు బిజెపి వైపు ఉన్నారనీ, మీరే గందరగోళం పడుతున్నారనీ విమర్శించారు.కాంగ్రెస్ నాయకులు అంతా ఐక్యంగా ఉన్నారనీ పార్టీ బలోపేతం కోసం ప్రయత్నం చేస్తున్నారనీ వివ రించారు. పంట కొనుగోళ్లు, రైతుల అంశంపైన రాజకీయాల కోసమే ఆరో పణలు చేస్తున్నారనీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పైన తప్పుడు ప్రచారం చేస్తు న్నారనీ ఆవేదన చెందారు. మొదట మీ పార్టీ ఉంటుందో లేదో చూసుకో జగదీష్ రెడ్డి అని సలహా ఇచ్చారు. మీ పార్టీ ఉంటే అందులో హరీశ్‌రావు వర్గమా? కెటిఆర్ వర్గమా? ముందు అది తేల్చుకో కాంగ్రెస్ నాయకుల కమిట్మెంట్‌పైన కామెంట్ చేస్తే మీకు వచ్చేది గుండు సున్నానే అని చెప్పారు.

# బెంబేలెత్తిస్తున్న తమలపాకుల ధరలు

## భారీగా పెరిగిన వైనం

## రూ.200కు కట్ట చొప్పున విక్రయం

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త:** ఎన్ని ఆకులు అందుబాటులో ఉన్నా దేవుడి పూజలో తమలపాకుదే అక్కడ అగ్రస్థానం. ఏ శుభకార్యానికైనా తాంబూలం ఉండాల్సిందే. ఎంతో చవకగా దొరికే తమలపాకుల ధర ఇప్పుడు అమాం తం పెరిగి పోయింది. ముఖ్యంగా తెలంగాణలో రూ.60 ఉండే తమలపాకు ఒక కట్ట ధర.. ఇప్పుడు రూ.200కు చేరుకుంది. ఇది సాదా ఆకుల ధర మాత్రమే. పండుగలు, శుభకార్యాలకు వాడే ప్రసిద్ధ కలకత్తా ఆకు ధర డబుల్ అయింది. రోజూ రాష్ట్ర వ్యాప్తంగా కోట్లలో తమలపాకుల వ్యాపారం జరుగుతుంది. అయితే ఇప్పుడు రేట్లు పెరగడంతో వ్యాపారం తగ్గిందని వ్యాపారస్తులు వాపోతున్నారు. తమలపు ఆకుల ధరలు పెరగడానికి ప్రధాన కారణం దేశవ్యాప్తంగా నెలకొన్న వర్షాభావ పరిస్థితులేనని వ్యాపారులు చెబుతున్నారు. వర్షాలు సకాలంలో పడకపోవడం, నీటి లభ్యత తగ్గడంతో తమలపాకు సాగు భారీగా తగ్గింది. అయిదు నెలలుగా ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవడంతో మార్కెట్‌కు వచ్చే సరుకు సగానికి పైగా పడి పోయింది. దిగుబడి లేకపోవడం, డిమాండ్ ఎక్కువగా ఉండటంతో ధరలు విపరీతంగా పెరిగాయి. తెలంగాణ వ్యాప్తంగా తమలపాకుల వినియోగం ఎక్కువగా ఉన్నప్పటికీ స్థానిక దిగుబడి లేకపోవడంతో ఇతర రాష్ట్రాలపైనే పూర్తిగా ఆధారపడాల్సి వస్తోంది. ప్రస్తుతం తెలంగాణ మార్కెట్లకు పశ్చిమ బెంగాల్ (కలకత్తా), కర్ణాటక, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి తమలపాకులు దిగుమతి అవుతున్నాయి.

# మరోసారి వివాదాల్లో హెచ్‌సిఏ

## కార్యదర్శి జీవన్‌రెడ్డి ఎన్నిక చెల్లదని టిసిఏ ఆరోపణ

## బిసిసిఐ, సిఐడికి ఫిర్యాదు

**హైదరాబాద్,మే 18,ప్రభాతవార్త:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఏ) మరోసారి వివాదాల్లో చిక్కుకుంది. ప్రస్తుత హెచ్సీఏ కార్యదర్శి జీవన్ రెడ్డి ఎన్నిక చెల్లదంటూ తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ తీవ్ర ఆరోపణలు చేసింది. ఈ వ్యవహారంపై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బిసిసిఐ), సీఐడీకి అధికారికంగా ఫిర్యాదు చేసినట్లు టీసీఏ కార్యదర్శి గురువా రెడ్డి వెల్లడిం చారు.




జీవన్ రెడ్డి డబుల్ రిజిస్ట్రేషన్ ఉన్న క్లబ్‌ను కొనుగోలు చేసి హె చ్సీఏలోకి ప్ర వే శిం చా ర ని గురువా రెడ్డి ఆరోపిం చారు. రంగారెడ్డి జిల్లాకు చెందిన "ఆక్స్ఫర్డ్ బ్లూస్" అనే క్లబ్‌ను గతంలో వెంకటేశ్వ రావు నిర్వహిం చారని, అయితే గతేడాది అదే క్లబ్‌ను మళ్లీ రీరిజిస్టర్ చేసి జీవన్ రెడ్డి కార్యదర్శిగా మారారని తెలిపారు. ఒక జిల్లాలో ఇప్పటికే రిజిస్టర్ అయిన క్లబు మరో జిల్లాలో మళ్లీ రిజిస్టర్ చేయడం నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఇలాంటి తప్పిదమే గతంలో జగన్ మోహన్ రావు చేసినట్లు గుర్తుచేసిన గురువా రెడ్డి.. ప్రస్తుతం జీవన్ రెడ్డి కూడా అదే విధానాన్ని అనుసరించారని ఆరోపించారు.

సభ్యులు, ఓటర్ల మార్పులు జనరల్ బాడీ సమావేశంలో ఆమోదం పొందాల్సి ఉండగా అలాంటి ప్రక్రియ జరగలేదని అన్నారు. క్లబ్ కొనుగోలు చేసిన మూడు నెలల్లోనే జీవన్ రెడ్డి హెచ్సీఏ కార్యదర్శిగా ఎన్నిక కావడం అనుమానాలకు తావిస్తోందని వ్యాఖ్యానించారు. గతంలో జగన్ మోహన్ రావుతో పాటు ముగ్గురిని అరెస్ట్ చేసిన తర్వాత ఖాళీలను భర్తీ చేసేందుకు పలు కుట్రలు జరిగాయని పేర్కొన్నారు. ఎలాంటి అనుభవం లేని ఇంతియాజ్‌ను సీఈఓగా నియమించారని, అమర్నాథ్‌ను అక్రమంగా హెచ్సీఏ అధ్యక్షుడిగా నియమించారని ఆరోపించారు. సీఎంవో నుంచి వచ్చిన ఆదేశాల మేరకు జీవన్ రెడ్డికి మద్దతు ఇచ్చామని హెచ్‌సిఏ పెద్దలు చెప్పడం ఆశ్చర్యంగా ఉందని గురువా రెడ్డి అన్నారు. ఈ అంశంపై కూడా బీసీసీఐకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అలాగే కార్పొరేట్ సంస్థలకు లబ్ధి చేకూర్చేందుకే ఈ టి20 లీగ్ నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఇటీవల హైకోర్టు ఆదేశాల ప్రకారం మాజీ క్రికెటర్ అంబటి రాయుడును ఆపరేషన్ హెడ్‌గా నియమించారని, అలాగే ఈవెంట్ మేనేజర్ నిరంజన్‌ను అడ్మినిస్ట్రేటివ్ కమిటీలో చేర్చారని తెలిపారు. అయితే మాజీ క్రికెటర్లు నియోల్ డేవిడ్, వెంకటపతి రాజు వంటి అనుభవజ్ఞులకు అవకాశం ఇవ్వకపోవడం ప్రశ్నార్థకమని పేర్కొన్నారు.

టి20 లీగ్ లో వయోపరిమితిని 16 నుంచి 36 సంవత్సరాల వరకు నిర్ణయించడం ఎక్కడా చూడలేదని.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆటగాళ్లకు ఒక్క రోజులోనే సెలక్షన్ నిర్వహించడం ఎలా సాధ్యమవుతుందో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. మొత్తం వ్యవహారంపై జీవన్ రెడ్డి ఎన్నికను వెంటనే రద్దు చేసి, హెచ్‌సిఏలో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ డిమాండ్ చేసింది.

# వేగంగా ధాన్యం కొనుగోళ్లు

## ఇప్పటివరకు 40.03 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం

## సేకరణ: పౌర సరఫరాల శాఖ వెల్లడి

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా యాసంగి/రబి సీజన్ ధాన్యం కొనుగోళ్లు అత్యంత వేగంగా, రికార్డు స్థాయిలో కొనసాగుతున్నాయని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ పేర్కొంది. ఈ విషయమై సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రంలో ఇప్పటి వరకు 40.03 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు వెల్లడించింది. ఈ ఏడాది రికార్డు స్థాయిలో 8,575 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. ఇప్పటి వరకు సేకరించిన ధాన్యానికి రైతులకు రూ.6,462.73 కోట్ల చెల్లింపులను నేరుగా బ్యాంకు ఖాతాల్లోకి జమ చేసినట్లు పేర్కొంది. అయితే గత ప్రభుత్వ హయాంలో రబీ సీజన్లతో పోలిస్తే ఈ సీజన్‌లో సోమవారం నాటికి కొను గోళ్లు పుంజుకున్నాయని వెల్లడించింది.

ప్రభుత్వం ఇప్పటివరకు కొను గోలు చేసిన 40.03 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం.. గత నాలుగేళ్ల రబీ సీజన్ల గణాంకాలతో పోల్చి చూస్తే సాధించిన అద్భుత పురోగతి అని స్పష్టం చేసిం ది. మొత్తంగా అత్యధిక కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, వేగవంతమైన చెల్లిం పులు, పారదర్శకమైన సేకరణ విధానాలతో ఈ యేడాది ప్రభుత్వం రికార్డు స్థాయి కొనుగోళ్లను చేపడుతోందని పౌరసరఫరాలశాఖ స్పష్టం చేసింది.

# ధాన్యం కొనుగోలుపై రైతులను తప్పదోవ పట్టించే ప్రకటనలు మానుకోవాలి

## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ఎంపి మల్లు రవి సూచన

**హైదరాబాద్, మే18, ప్రభాతవార్త:** ధాన్యం కొనుగోలుపై కిషన్‌రెడ్డి రైతులను తప్పు దోవ పట్టించే ప్రకటనలు మానుకోవాలని నాగర్‌కర్నూల్ ఎంపి మల్లు రవి హితవు చెప్పారు. సోమవారం గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లా డుతూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యలపై ఎంపీ మల్లు రవి ఆగ్రహం వ్యక్తంచేశారు. కేంద్రం డబ్బులు ఇస్తుంటే రాష్ట్రంలో ప్రభుత్వం రైతుల వద్ద నుంచి ధాన్యం కొనడానికి ఏమిటి సమస్య అని అంటున్నారని కేంద్రం ఎక్కడ నుంచి డబ్బులు ఇస్తుందని మల్లు రవి ప్రశ్నించారు. తెలంగాణ నుంచి కేంద్రానికి పన్నుల రూపంలో ఒక్క రూపాయి ఇస్తే మాకు 42 పైసలు తిరిగి ఇస్తున్నారని ఆయన లెక్కలు వివరించారు. మా తెలంగాణ డబ్బులను బిజెపి రాష్ట్రాల్లో వ్యయం చేస్తున్నారని విమర్శించారు. ఎవరి పైసలు ఎవరు ఇస్తు న్నారు. మన డబ్బులు మనకు ఇవ్వడానికే కేంద్రానికి చేతులు రావడం లేదని దుయ్యబట్టారు. ఇంకా ధాన్యం కొనుగోలు ప్రత్యేకంగా ఇస్తున్నారా అని రవి ప్రశ్నించారు. కిషన్‌రెడ్డి కేంద్రమంత్రిగా తెలంగాణకు రావాల్సిన నిధులను తెప్పించి చిత్తశుద్ధిని చాటుకోవాలని డిమాండ్ చేశారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింపుల్ ఇ-గవర్నెన్స్ ద్వారా

# ప్రజలకు మరింత మెరుగైన సేవలు

## రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలతో కేంద్ర ప్రభుత్వ కేబినెట్ సెక్రెటరీ టివి సోమనాథన్ వీడియో కాన్ఫరెన్స్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, మే 18:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింపుల్ ఇ-గవర్నెన్స్ ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిం చేందుకు కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వ కేబినెట్ సెక్రెటరీ డాక్టర్ టివి సోమ నాథన్ ఆయా రాష్ట్రాల చీఫ్ సెక్రెటరీలను ఆదేశించారు. సోమవారం కేంద్ర కేబినెట్ సెక్రెటరీ తమిళనాడు ప్రభుత్వం అనుసరిస్తున సింపుల్ గవర్నె న్స్-ఇ-గవర్నెన్స్ విధానాన్ని ఇతర రాష్ట్రాలు కూడా ఆయా రాష్ట్రాలలో ఉన్న నిబంధనల మేరకు ప్రజలకు సరళతరమైన,మెరుగైన ప్రభుత్వ సేవలను అందించేందుకు ప్రయత్నించాలని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఈగవర్నెన్స్ విధానాన్ని వివరించారు. ప్రజలకు పాదర్శకంగా సులభతరమైన పౌర సేవలను అందిస్తున్నామని, ఎప్పటికప్పుడు వివిధ విభాగాల వారీగా ఆన్ లైన్ లో డ్యాష్ బోర్డుల ద్వారా తెలియ జేస్తున్నా మన్నారు. మున్సిపల్,



ఇండ స్ట్రీస్, ఎడ్యుకేషన్, ఎనర్జీ, రెవెన్యూ తదితర శాఖల్లో ఈ-గవర్నెన్స్ ద్వారా ప్రజలకు అంది స్తున్న సేవలను వివ రించారు. కేబినెట్ సెక్రెటరీ సిఎస్ కె. రామకృష్ణారావును ఈగవర్నెన్స్ విధానంపై అభినందించారు. తమిళనాడు ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని కూడా అధ్యయనం చేసి ప్రజలకు ఎలాంటి ఆర్థికభారం, ఇతర ఇబ్బందులు కలగకుండా రాష్ట్రంలో ఇ-గవర్నెన్స్ విధానాల్లో మార్పులు చేస్తామన్నారు. ఈ సమావేశంలో స్పెషల్ సిఎస్ నవీన్ మిట్టల్, ముఖ్యకార్యదర్శి యోగితారాణా, శీకాగోయల్, సెక్రెటరీలు రఘునందన్‌రావు, ఇ.శ్రీధర్, అనితా రామచంద్రన్, హౌసింగ్ ఎం.డి వి.పి. గౌతం, సెర్పు సిఇఒ దివ్య తదితరులు పాల్గొన్నారు.

# నిజామాబాద్ జిల్లాకు రేవంత్‌రెడ్డి పంగనామాలు

## రేవంత్‌కు, మోడీకి లింక్ ఉందేమో?

## నాకైతే తెలియదు: ఎంపి ధర్మపురి అరవింద్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 18:** నిజామాబాద్ జిల్లాకు ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి పంగనామాలు పెట్టారని స్థానిక ఎంపి, బిజెపి నేత ధర్మపురి అరవింద్ మండిపడ్డారు. సోమవారం నిజామాబాద్‌లో ఎంపి అరవింద్ విలేకర్లతో మాట్లాడుతూ.. పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్‌ను రాజకీయంగా అణగదొక్కేందుకే జిల్లాకు మొండి చేయి చూపించారని విమర్శించారు.

ఇంకా ఏ ముఖం పెట్టుకుని ఈ జిల్లాలో పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ తిరుగుతున్నారని ప్రశ్నిం చారు. నిజామాబాద్‌కు ఔటర్ రింగ్‌రోడ్ ఇస్తామని హామీ ఇచ్చి మరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందూరు ప్రజలను మో సం చేస్తే, వారే బుద్ధి చెబుతారన్నారు. రేవంత్ రెడ్డికి ప్రధాని నరేంద్ర మోడీకి లింక్ ఉందేమో, బెంగాల్‌లో సువేందు అధికారి లాగా ఇద్దరు కలుస్తారేమో అందుకే నాతో కలిసి పనిచేయ్, అని మోడీ అన్నారేమో, నాకైతే తెలియదంటూ వ్యాఖ్యానించారు.

నేను ముందే చెప్పా.. రేవంత్ రెడ్డి మోసపూరిత నాయకుడు, ఆయనకు బదులు కోమటిరెడ్డి లేదా శ్రీధర్‌బాబు వంటి జెన్యూన్ పర్సన్‌ని ముఖ్యమంత్రిగా నియమించాలని అని సంచలన వ్యాఖ్యలు చేశారు.

నిజామాబాద్ నగరంలో మౌలిక వసతుల కల్పన, డ్రైనేజీ పనుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అర్వింద్ విమర్శించారు. నగరంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనుల కోసం రూ. 162 కోట్లు అవసరం కాగా, ప్రభుత్వం కేవలం రూ.10 కోట్లు మాత్రమే కేటా యించిందని, కనీసం 25 శాతం పనులు కూడా పూర్తి కాలేదని వివరించారు. దేవుళ్లకు ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చకుండా మోసం చేసిన రేవంత్‌రెడ్డికి, ప్రజలను మోసం చేయడం ఒక లెక్కా అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. బుల్లెట్ రైల్ కారిడార్ విషయంలో సిఎం రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాలు మాట్లా డుతున్నారని విమర్శించారు.

పట్టణాన్ని అప్‌గ్రేడ్ చేస్తానని ప్రకటించిన బిఆర్ఎస్ అధ్యక్షుడు కేసిఆర్‌నే ప్రజలు నమ్మలేదని.. ఇక లేని ఫ్యూచర్ సిటీ అంటే నమ్ముతారా? అంటూ సిఎం రేవంత్‌రెడ్డిపై ఎంపి అరవింద్ విమర్శలు చేశారు.

# ఇంటర్ విద్యలోని ఉద్యోగులకు సాధారణ బదలీలు చేపట్టాలి

## ఇంటర్ విద్య డైరెక్టర్‌కు టిజిఓ విజ్ఞప్తి

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఇంటర్మీడియట్ విద్యలో పనిచేస్తున్న ఉద్యోగులకు సాధారణ బదిలీలు చేపట్టాలని టిజీవో కేంద్ర ఉపాధ్యక్షులు, టిగ్లా వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి మాచర్ల రామకృష్ణ గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇంటర్ విద్య డైరక్టర్ అభిలాష అభినవ్‌ని సోమవారం కలిసి విజ్ఞప్తి చేసినట్టు తెలిపారు. ఇంటర్మీడియట్ బోర్డు, ఇంటర్ విద్యకు సంబంధించిన పలు అంశాలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరినట్టు తెలిపారు. ఫిబ్రవరి, మార్చిలో జరిగిన వార్షిక పరీక్షలు, ప్రాక్టికల్ పరీక్షలు, స్పాట్ వాల్యుయేషన్ క్యాంపులలో పనిచేసిన ఉద్యోగులకు డిఏ, టిఏ రెమ్యూనరేషన్ లను చెల్లించాలని కోరగా అందుకు ఇంటర్ బోర్డు కార్యదర్శి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు సాధారణ బదిలీలకు అనుమతించినందున రాష్ట్రంలోని 4 జిల్లాలలో మాత్రమే పదుల సంఖ్యలో ఇంటర్ ఉద్యోగులు సెన్సస్ విధులలో ఉన్నారని.. సెన్సస్ విధులకు సంబంధం లేని ఇంటర్మీడియట్ విద్యలో పనిచేస్తున్న ఉద్యోగులకు మినిమమ్ ఒక సంవత్సరం సర్వీస్ ఉన్న ఉద్యోగులకు రిక్వెస్ట్ బదలీలకు, తప్పనిసరి బదిలీలకు అనుమతి ఇవ్వాలని కోరారు.

నాలుగు సంవత్సరాలుగా అవకాశం కలిపిస్తూ బదలీలు చేపట్టాలన్నారు. బోర్డు ఉద్యోగులకు తప్పని సరి బదిలీలకు అవకాశం ఇవ్వాలని కోరినట్టు రామకృష్ణ గౌడ్ తెలిపారు. సాధారణ బదిలీలపై సెక్రటరీ స్పందిస్తూ .. ప్రభుత్వ పెద్దలతో చర్చించి బదిలీలపై నిర్ణయం కుంటానని తెలిపారన్నారు.

# బోర్డు తిప్పేసిన సిడి దశరథ్ కన్సల్టెన్సీ



నిందితులు రాజేంద్రప్రసాద్, అర్చన ప్రియ, సోమశేఖర్

## విదేశాల్లో ఉద్యోగాల పేరుతో భారీ మోసం

## రోడ్డున పడిన 90 మంది నిరుద్యోగ యువత

## కేసు దర్యాప్తు చేస్తున్న మియాపూర్ పోలీసులు

**హైదరాబాద్(శేరిలింగంపల్లి), మే 18, ప్రభాతవార్త:** నగరంలో విదేశీ ఉద్యోగాల పేరుతో భారీ మోసం వెలుగుచూసింది. మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హాఫీజ్‌పేట్ ప్రాంతంలో సీడీ దశరథ్ కన్సల్టెన్సీ పేరుతో నడుస్తున్న సంస్థ నిరుద్యో గులను నమ్మించి కోట్ల రూపాయలు వసూలు చేసి పరారైన సంఘటన సంచలనంగా మారింది. ఈ ఘరానా మోసానికి దాదాపు 90 మంది యువ నిరుద్యోగులు బలైపోయారు. వివరాలోనికి వెళితే.. హాఫీజ్‌పేట్ ప్రాంతంలో అర్చనప్రియ, సోమశేఖర్, రాజేంద్రప్రసాద్ సీడీ దశరథ్ కన్సల్టెన్సీ పేరుతో ఈజిప్ట్, ఇజ్రాయెల్ దేశాల్లో మంచి జీతాలతో ఉద్యోగాలు ఇప్పిస్తామని ఆశ చూపిం చారు. విదేశాల్లో ఉద్యోగం వస్తుందనే నమ్మకంతో నిరుద్యోగులు ఒక్కొక్కరి నుంచి రూ.6 లక్షల వరకు వసూలు చేసినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. ఉద్యో గాల కోసం ఆశగా ఎదురు చూసిన యువకు ల్లో కొంత మందిని ఈజిప్ట్ వరకు తీసుకెళ్లినట్లు తెలు స్తోంది. అయితే అక్కడ సరైన ఉద్యోగ అవకాశాలు లేక పోవడంతో బాధితులు కన్సల్టెన్సీ నిర్వా హకులకు ఫోన్ చేసినా వారు స్పందించక పోవడం తో బాధిత నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గుర య్యారు. చివరికి సొంత ఖర్చులతో హైదరాబాద్‌కు తిరిగివచ్చినట్లు బాధితులు వాపోయారు.

**బోర్డు తిప్పేసిన కన్సల్టెన్సీ కంపెనీ**

నిరుద్యోగులకు విదే శాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మ బలికి దాదాపు 90 మందికి పైగా యువ తను బుట్టలో వేసుకున్న సీడీ దశరత్ కన్సల్టెన్సీ కంపెనీ బోర్డు తిప్పేసింది. లక్షల్లో పైసలిచ్చి మోస పోయామని గుర్తించిన బాధితులు హాఫీజ్‌పేట్‌లో ఉన్న కన్సల్టెన్సీ కార్యా లయానికి చేరు కోవడంతో అప్పటికే కన్సల్టెన్సీ కార్యాలయం మూత పడటంతో నిరుద్యోగులు షాక్‌కు గురయ్యారు. కార్యాలయం వద్దకు పదుల సంఖ్యలో చేరుకున్న బాధితులకు కార్యాలయం తాళాలు వేసి కని పించటంతో మోసం జరిగిన విషయం బట్ట బయలైంది. దీంతో పెద్ద సంఖ్యలో ఉన్న బాధితులు మియాపూర్ పోలీసులను ఆశ్రయించి తమకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు. తమ డబ్బులు తిరిగి తమకు ఇప్పిం చాలని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాదితులు పోలీసులను కోరుతున్నారు. ప్రస్తుతం కేసు నమోదు చేసుకున్న మియాపూర్ పోలీసులు పరారీలో ఉన్న నిర్వాహకుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. విదేశాల్లో ఉద్యోగాల పేరుతో జరుగుతున్నమోసాల పట్ల నిరుద్యోగులు అప్ర మత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. ప్రభుత్వ అనుమతులు, అధికారిక ధృవీకరణలు ఉన్న సంస్థల ద్వారానే విదేశీ ఉద్యోగాల కోసం ప్రయత్నించాలని పోలీసులు వెల్లడించారు.

# భావితరాలకు భద్రపరచిన అమూల్య వారసత్వ సంపద మ్యూజియం

## అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవంలో మంత్రి జూపల్లి కృష్ణారావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 18:** మ్యూజియాలు అనేవి కేవలం పురాతన వస్తువుల నిల్వ కేంద్రాలు మాత్రమే కావు. అవి మన నాగరికత, సంస్కృతి, చరిత్ర, సంప్రదాయాలు, జీవన విధానానికి అద్దం పట్టే జ్ఞాన కేంద్రాలని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి



జూపల్లి కృష్ణారావు అన్నారు. ప్రపంచ వారసత్వ సంపదను రక్షి ంచడం అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు. అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం సందర్భంగా సోమవారం పబ్లిక్ గార్డెన్ లోని రాష్ట్ర మ్యూజియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి జూపల్లి హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలంగాణలో పరమార జగద్దేవుని శాసనాలు, స్టకో స్కప్చర్స్ ఇన్ సెంటెనరీ మ్యూజియం అనే పుస్తకాలతో పాటు బ్రోషర్లను మంత్రి జూపల్లి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. ఒక దేశ గొప్ప తనం, నాగరికత, సంస్కృతి, సాంప్రదాయాలు అన్నీ మ్యూజియాలు, వారసత్వ సంపద ద్వారానే భావితరాలకు చేరుతాయని అన్నారు.ఎటువంటి సాంకేతిక పరిజ్ఞానం, పరికరాలు లేని కాలంలో అద్భుతమైన కట్టడాలను మన పూర్వీకులు నిర్మించారని, వాటిని చూసి తరించక పోతే జీవితం సంపూర్ణం కాదని తెలిపారు.

రామప్ప దేవాలయానికి ప్రపంచ వారసత్వ జాబితాలో స్థానం లభించడం తెలంగాణ చరిత్రకు అంతర్జాతీయ గుర్తింపును తీసుకువచ్చిందని, ఈ వారసత్వ కట్టడాలను ప్రపంచానికి పరిచయం చేయడం ద్వారా తెలంగాణను అంతర్జాతీయ పర్యాటక పటంలో మరింత ప్రతిష్టాత్మకంగా నిలపాలని ప్రభుత్వం సంకల్పించిందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం వారసత్వ సంపద పరిరక్షణ, మ్యూజియాల అభివృద్ధి, చారిత్రక కట్టడాల సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. చారిత్రక ప్రాంతాలు, పర్యాటక ప్రదేశాలలో స్థానిక యువతకు ఉపాధి కల్పించేందుకు, సందర్శకులకు మెరుగైన సమాచారం అందించేందుకు ప్రత్యేకంగా గైడ్ లకు శిక్షణ ఇవ్వనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. దీని కోసం రూ. 5 కోట్లు కేటాయిస్తామని చెప్పారు.

పర్యాటక, సాంస్కృతిక శాఖ స్పెషల్ సీఎస్ వాణిప్రసాద్ మాట్లాడుతూ..రాష్ట్ర పురావస్తు శాఖ ఆధ్వర్యంలో ఆర్కియాలజీ, మ్యూజియాలజీ రంగాల్లో నూతన కోర్సులను అందుబాటులోకి తీసుకు వచ్చామని తెలిపారు. యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని వారసత్వ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చిన్నపిల్లలు, విద్యార్థులు, యువత మ్యూజియాలను సందర్శించి చరిత్రపై అవగాహన పెంచుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో వరల్డ్ మన్యూమెంట్ ఫండ్ బోర్డు మెంబర్ షాలిని భూపాల్, పర్యాటక అభివృద్ధి సంస్థ మెనేజింగ్ డైరెక్టర్ గౌతమి, పర్యాటక శాఖ డైరెక్టర్ లక్ష్మణ్ రంజిత్ నాయక్, పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జున రావు, నిథమ్ డైరెక్టర్ వెంకటరమణ, కేంద్ర పురావస్తు శాఖ సూపరిన్టెండెంట్ నిఖిల్ దాస్, డెక్కన్ హెరిటేజ్ అకాడమీ చైర్మన్ వేద కుమార్, ఇంటాచ్ కన్వీనర్ అనురాధ రెడ్డి, చరిత్రకారులు డా.ఈమని

# విధాన రూపకల్పన కోసం డేటా, సాంకేతికత అవసరం

## మహిళలు, బాలికల సాధికారితకు ఎస్‌డిసి ప్రాజెక్టు

## లింగ సమానత్వం సాధన దిశగా చర్యలు

## కేంద్ర మహిళా, శిశు సంక్షేమ మంత్రి అన్నపూర్ణాదేవి

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త :** చైతన్యవంతమైన విధాన రూపకల్పన కోసం మంచి డేటా, సాంకేతికతతో కూడిన పర్యవేక్షణతో కూడిన పటిష్టమైన వ్యవస్థలు అవసరమని కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి అన్నపూర్ణా దేవి అన్నారు. నీతి ఆయోగ్, ఐఐఎం ఖధ్వర్యంలో సోమవారం జరిగిన ఒక కార్యక్రమంలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష ్యం (ఎస్‌డిసి), లింగ సమానత్వాన్ని సాధించడం, మహిళలు, బాలికలందరినీ సాధికారత కల్పించడం దీని లక్ష ్యమన్నారు. సమానత్వం ఒక ప్రాథమిక మానవ హక్కు అని, శాంతియుత, సుసంపన్నమైన, సుస్థిరమైన ప్రపంచానికి అది ఒక అవసరమైన పునాదిగా పేర్కొన్నారు. ఎస్‌డిసి 5 అనేది వివక్షను నిర్మూలించడానికి, మహిళలకు సాధికారత కల్పించడానికి కీలకమైన చర్యలను వివరించే తొమ్మిది నిర్దిష్ట లక్ష్యాలచే నడపబడుతుందని వివరించారు. మహిళలు, బాలికలపై జరిగే అన్ని రకాల వివక్షలను నిర్మూలించాలని పిలుపునిచ్చారు. బహిరంగ, ప్రైవేట్ రంగాలలో మహిళలు, బాలికలపై జరిగే అన్ని రకాల హింసలను, అక్రమ రవాణా, లైంగిక దోపిడీతో సహా అంతం చేయాల్సిన బాధ్యత అందరిదీ అని చెప్పారు. లింగపరమైన నిబంధనలను పరిష్కరించడానికి మరియు సామాజిక, ఆర్థిక నిర్ణయ నిర్మాణంలో మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి ప్రవర్తనాపరమైన జోక్యాల, క్షేత్రస్థాయి సంస్థాగత యంత్రాంగాల ఆవశ్యకత అవసరమన్నారు. లింగపరమైన నిబంధనలను పరిష్కరించడానికి మరియు సామాజిక, ఆర్థిక నిర్ణయనిర్మాణంలో మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి ప్రవర్తనాపరమైన జోక్యాలు మరియు క్షేత్రస్థాయి సంస్థాగత యంత్రాంగాల ఆవశ్యకతను గూర్చి నొక్కి చెప్పారు.

# రాష్ట్రంలో బక్రీద్ సెలవు మార్పు

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త :** ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు జరుపుకునే పండుగ అయిన బక్రీద్‌కు తెలంగాణ ప్రభుత్వం సెలవులో మార్పు చేస్తూ నిర్ణయించింది. తెలంగాణ క్యాలెండర్ ప్రకారం, ప్రభుత్వం మే 27వ తేదీని సెలవు దినంగా ప్రకటించింది. అయితే, ఆదివారం హైదరాబాద్‌లో గానీ, తెలంగాణలోని ఇతర ప్రాంతాలలో గానీ 1447 హిజ్రీ ధుల్‌హిజ్జా మాసం ప్రారంభానికి సూచిక అయిన నెలవంక కనిపించనందున సెలవులో మార్పు చేసింది. ఇందుకు అనుగుణంగా ఈ పండుగను ఈ నెల 28న జరుపుకుంటారు. దీనికి అనుగుణంగా, ప్రభుత్వం సెలవు దినంలో మార్పులు చేయనుంది. జుల్‌హిజ్జా మాసం ప్రారంభాన్ని సూచించే నెలవంక హైదరాబాద్‌లో గానీ, తెలంగాణలోని ఇతర ప్రాంతాలలో గానీ కనిపించలేదని సదర్ మజ్లిస్ ఎ ఉలమా ఎడెక్కన్ ప్రకటించింది. సయ్యద్ హసన్ ఇబ్రహీం హుస్సేనీ ఖాద్రీ జారీ చేసిన అధికారిక ప్రకటనలో చంద్ర దర్శనం జరగలేదని వివిధ ప్రాంతాల నుండి అందిన నివేదికలు నిర్ధారించాయని ఆ సంస్థ తెలిపింది.ఈ ప్రకటన తరువాత, ధుల్‌ఖదా 30 రోజులు పూర్తి చేసుకుంటుందని ఈ నెల 19 వ తేదీ మంగళవారాన్ని ధుల్ హిజ్జా మొదటి రోజుగా పాటిస్తారని మజ్లిస్ ప్రకటించింది. కాగా ధుల్‌హిజ్జా మాసం ప్రారంభం వార్షిక హజ్ యాత్రకు నాంది పలుకుతుంది మరియు ఇస్లాంలో అత్యంత ముఖ్యమైన పండుగలలో ఒకటైన ఈద్ అల్‌అధాకు కౌంట్‌డౌన్‌ను సూచిస్తుంది. ఈ నేపథ్యంలో ఈద్ అల్‌అధాను ఈ నెల 28వ తేదీన జరుపుకుంటారు. దీంతో తెలంగాణ ప్రభుత్వం 2026 బక్రీద్‌కు సెలవును మార్చనుంది, అయితే దీనిని ఇంకా ప్రకటించలేదు.

# భారత్, నార్వే మధ్య 100 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్యం


## ఇస్రో, నార్వేజియన్ అంతరిక్ష సంస్థల అవగాహన ఒప్పందం

## ఐటి, డిజిటల్, ఎఐ రంగాల్లో పరస్పర సహకారం

## భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వంపై నార్వే మద్దతు

## నార్వే ప్రధాని జోనాస్‌గర్ స్టోరేతో ప్రధాని మోడీ భేటీ

**ఓస్లో, మే 18:** ప్రధాని మోడీ ఐదు దేశాల పర్యటనలో భాగంగా నార్వేకు చేరిన ప్రధానిమోడీ ఆదేశ ప్రధానమంత్రి జోనాస్ గర్ స్టోరేతో ద్వైపాక్షిక భేటీ నిర్వహించారు. ఒందు రోజుల పర్యటనలో భాగంగా నార్వే ప్రధాని స్టోరేతో మోడీ సోమవారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా రెండు దేశాల ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించారు. 2030 నాటికి నార్వే, భారత్‌లమధ్య ద్వైపాక్షిక వాణిజ్యం100 బిలియన్ డాలర్లకు చేర్చడంతోపాటు పదిలక్షలమందికి తగ్గకుండా భారత్‌లో ఉపాధి అవకాశాలుపెంచాలన్న లక్ష్యం వదించినట్లు ఇరువురునేతలుప్రకటించారు. ఇండోయూరోప్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతోపాటు వాణిజ్యం, ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం టెపా వంటి వాటిపైనా వాతావరణ మార్పులు, ఇంధన సంరక్షణ, బ్లూ ఎకానమి, సముద్రజలాల పర్యవేక్షణ, ఉన్నత విద్యలో పరిశోధనలు, ఆర్కిటిక్, పోలార్ సహకారం వంటి వాటిపై విస్తృత స్థాయిలోచర్చలుజరిగాయి. అంతరిక్షం, ప్రతిభావంతులకు అవకాశాల వంటి అంశాలు కూడా ప్రస్తావనకు వచ్చాయి. అలాగే హరితవ్యూహాత్మక భాగస్వామ్య వ్యవస్థను మరింతగా పెంపొందించుకు నేందుకు ఇరువురు అధినేతలు ఏకాభిప్రాయానికి వచ్చారు. మోడీ మాట్లాడుతూఈ రోజు నార్వే ఇండోపసిఫిక్ మహాసముద్రాల చొరవలో చేరడం మాకు చాలా సంతోషంగా ఉందన్నారు. రెండు ప్రధాన సముద్ర దేశాలుగా సముద్ర ఆర్థిక వ్యవస్థ, సముద్ర భద్రత, సామర్థ్య నిర్మాణం వంటి రంగాల్లో సహకారాన్ని బలోపేతం చేయడానికి మేము కలిసి పనిచేస్తాం. ఈ రోజు మేము త్రికోణాకార అభివృద్ధి సహకార ఒప్పందాన్ని కుదుర్చుకున్నాం. ఏ సమస్యకైనా సైనిక ఘర్షణ పరిష్కారం చూపలేదనే విషయంలో మేమంతా ఏకతాటిపై ఉన్నాం. అది ఉక్రెయిన్‌కు సంబంధించినదైనా లేదా పశ్చిమాసియాకు



సంబంధించినదైనా ఘర్షణలను త్వరితగతిన నిలిపివేసి, శాంతిని పునరుద్ధరించడమే లక్ష్యంగా సాగే ప్రతి ప్రయత్నానికి మేము మద్దతు ఇస్తామని మోడీ తెలిపారు. ఈ రోజు మేము భారత్ నార్వే మధ్య సంబంధానికి హరిత వ్యూహాత్మక భాగస్వామ్యరూపాన్ని ఇస్తున్నామ స్వచ్ఛ ఇంధనం నుంచి వాతావరణ స్థితిస్థాపకత వరకు పరస్పర సహకారం ఉంటుందన్నారు. బ్లూ ఎకానమీ నుంచి హరిత నౌకా రవాణా వరకు ప్రతి రంగాన్ని విస్తరించిన ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం, భారతదేశ పరిమాణం, వేగం, ప్రతిభను నార్వే సాంకేతికత, మూలధనంతో కలపడం ద్వారా రూపుదిద్దుకుంటోందని తెలిపారు. భారతదేశపు ఆర్కిటిక్ పరిశోధనా కేంద్రమైన హిమాద్రి కార్యకలాపాలను సులభతరం చేసినందుకు మేము నార్వేకు కృతజ్ఞతలు తెలిపారు. ఇస్రో, నార్వేజియన్ అంతరిక్ష సంస్థ మధ్య ఈ రోజు సంతకం అవుతున్న అవగాహన ఒప్పందం. అంతరిక్ష రంగంలో మా సహకారానికి ఒక కొత్త కోణాన్ని జోడిస్తుందని ప్రధాని పేర్కొన్నారు. నౌకానిర్మాణం, హరిత నౌకాయానం, టన్నెలింగ్, మౌలికవనరులు, అంతరిక్షం, కృత్రిమ మేధ, రోబోటిక్స్, సైబర్ సెక్యూరిటీ, సముద్రజలాలపై యుద్ధశిక్షణ, మత్స్య, ఆక్వాకల్చర్ వంటి రంగాల్లో పరస్పర సహకారం మరింతపెంపొందాలని ఆకాంక్షించారు. ఈ ఏడాది జూన్‌లో ఫ్రాన్స్‌లో నిర్వహించనున్న భారత్ ఇన్నొవేట్స్ 2026కు హాజరుకావాలని నార్వేప్రధాని స్టోరేను ఆహ్వానించారు. రెండుదేశాలమధ్య స్టార్టప్ ఇన్నొవేషన్ హబ్, గ్రీన్ ఇన్నొవేషన్ హాక్యథాన్‌లు ఏర్పాటుచేయాలనిసూచించారు. పునరుత్పత్తిఇంధనం, సముద్ర జలవనరులు, వాతావరణం, ఆరోగ్యం, సంక్లిష్ట ఖనిజవనరులు, ఐటి, ఉన్నతవిద్య రంగాల్లో సంయుక్త కార్యాచరణ అమలుచేయాలని భావించారు. అలాగే జాయింట్ డిగ్రీ కార్యక్రమాలు, విద్యార్థతలను పరస్పరం గుర్తించుకోవడం, స్టూడెంట్, ఫాకల్టీలపరస్పర మార్పిడి వంటివి చర్చకు వచ్చాయి. అలాగే ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వంకల్పించడంలో నార్వే మద్దతునుప్రకటిస్తున్నట్లు ఆదేశ ప్రధాని స్టోరే పేర్కొన్నారు.

# రామానుజ సిద్ధాంత అధ్యయన కేంద్రం ప్రారంభం

## తెలుగు వర్సిటీకి అనుబంధంగా

## శ్రీవైష్ణవ సిద్ధాంతంలో డిప్లొమా కోర్సులు

**హైదరాబాద్ (రవీంద్రభారతి), మే 18, ప్రభాతవార్త :** మహాభాగవతంలో పేర్కొన్నట్లు ఇప్పుడున్న పరిస్థితులలో రకరకాల దుస్థితులను గమనిస్తున్నా మని, ఈ పరిస్థితుల్లో శ్రీవైష్ణవ తత్వాన్ని, అష్టాక్షరీ మంత్రాన్ని కాపాడు కోవడానికి చేస్తున్న ప్రయత్నంలో డా. చెన్నమనేని హనుమంతరావుకు వచ్చిన ఆలోచన చాలా గొప్పదని, శ్రీమద్భ గవద్రామానుజ సిద్ధాంతాన్ని అధ్యయనం చేయ డానికి ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేసుకొని శ్రీవైష్ణవ తత్వాన్ని పరివ్యాప్తి అవుతుందని సంకల్పించి ఆశయసిద్ధికి త్రిదండి దేవనాథ రామానుజ జీయర్‌స్వామి చేతులమీదుగా అధ్యయన కేంద్రాన్ని వైభవంగా ప్రారంభించారు.

రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి నేతృ త్వంలో, సాధన నరసింహాచార్య సహకారంతో డా. సముద్రాల వెంకటరంగ రామానుజాచార్య స్వామివారి అధ్యక్షతన జరిగింది.

ఈ సందర్భంగా డా. కె.వి.రమణాచారి మాట్లాడుతూ ఈ ఆశయా లనుగుణంగా చెన్నమనేని హనుమంతరావు అధ్యక్షుడుగా, సాతులూరి గోపాల కృష్ణమాచార్య ఉపా ధ్యక్షుడుగా, కంద్ల కుంట నరసిం హాచార్య



అధ్యయన కేంద్రాన్ని ప్రారంభిస్తున్న త్రిదండి దేవనాథ రామానుజ జీయర్‌స్వామి, వెంకటరంగ రామానుజాచార్య, గోపాలకృష్ణమాచార్య, నరసింహాచార్య, కె.వి.రమణాచారి, సాధన నరసింహాచార్య తదితరులు

ప్రిన్సిపాల్‌గా, కిషన్‌రావు కోశాధికారిగా, ఏడుగురు సభ్యులుగా ఒక ట్రస్టు ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. వెనువెంటనే సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్య క్షుడు వెలుదండ నిత్యా నందరావుతో సవివరంగా చర్చించి శ్రీమద్భగవద్రా మానుజ సిద్ధాంత అధ్య యన కేంద్రం విశ్వవిద్యా లయానికి అనుబంధ సంస్థగా ఏర్పాటుచేసి ఈ సంస్థ ద్వారా శ్రీ వైష్ణవ సిద్ధాంతంలో సర్టిఫికెట్ డిప్లమా తదితర కోర్సులను పూర్తిచేసి సర్టిఫికెట్ పొందే అవకాశం ఉంటుందని విన్నవించి అనుమతి పొందడం జరిగిందన్నారు. 15రోజులలోగా పూర్తి కార్యాచరణ సిద్ధంచేసి, సిలబస్ ఆలోచించి నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని డా. కె.వి.రమణా చారి తెలిపారు. అనంతరం ఇతర అతిథులు ప్రసంగించారు.

# సినీ పరిశ్రమ పైరసీని అడ్డుకోండి

## ఫిలిం ఛాంబర్ యాంటీ విడియో

## పైరసీ సెల్ హెడ్ మునీంద్రబాబు ఫిర్యాదు

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త :** సినీ పరిశ్రమలో పైరసీ మరోసారి తెరముందుకు వచ్చింది. ఐ బొమ్మ వ్యవహారం మళ్లీ కలవరపెడుతోంది. పైరసీ వెబ్‌సైట్ల ద్వారా కొత్త సినిమాలను అక్రమంగా విడుదల చేస్తున్నారంటూ తెలంగాణ ఫిలిం ఛాంబర్ సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేసింది. ముఖ్యంగా ఐ బొమ్మ, బప్పం టీవీ పేర్లతో నడుస్తున్న వెబ్‌సైట్లు తాజాగా విడుదలైన పలు సినిమాలను ఆన్‌లైన్‌లో లీక్ చేస్తున్నట్లు ఆరోపణలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ఫిలిం ఛాంబర్ అధికారికంగా ఫిర్యాదు చేసింది. ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ యాంటీ-వీడియో పైరసీ సెల్ ప్రాజెక్టు హెడ్ యర్రా మునింద్ర బాబు సోమవారం దాఖలు చేసిన ఫిర్యాదు ప్రకారం వెబ్‌సైట్లు తెలుగు, తమిళం, హిందీ, బెంగాలీతో సహా పలు భాషల్లోని కాపీరైట్ ఉన్న చిత్రాలను పైరసీ చేశాయని ఆరోపించారు. ఆపరేటర్లు గూగుల్ బ్లాగ్‌స్పాట్ ప్లాట్‌ఫామ్‌ను ఫ్రంట్-ఎండ్ పోర్టల్‌గా ఉపయోగించుకుంటూ, పైరసీ సినిమాల నిరంతరాయ ప్లేబ్యాక్ కోసం ప్రత్యేకంగా రూపొందించిన స్ట్రీమింగ్ ప్లేయర్‌లను పొందుపరచి ఒక అధునాతన పైరసీ నెట్‌వర్క్‌ను సృష్టించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాపీరైట్ హక్కుదారుల అనుమతి లేకుండా కొత్తగా విడుదలైన థియేట్రికల్, ఒటిటి చిత్రాలను ప్రచారం చేయడానికి, అలాగే ప్రేక్షకులను ఆకర్షించడానికి నిందితులు ఐ బొమ్మ, బప్పం అనే పైఈ బ్రాండ్‌లను ఉపయోగించాలని పేర్కొన్నారు. ఆపరేటర్లు 1+బిఇటి, 4ఆర్‌ఎబిఇటి వంటి నిషేధిత బెట్టింగ్ అప్లికేషన్లను ప్రోత్సహించారని ఫిర్యాదులో ఆయన వివరించారు. సినిమాలు స్ట్రీమింగ్ చేసే ముందు వినియోగదారులను ప్రకటనలకు సంబంధించి వత్తిడి తెచ్చారని, అలాగే వీడియోలను పాజ్ చేసినప్పుడల్లా అదనపు బెట్టింగ్ ప్రమోషన్లు కనిపించాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా సినిమా పరిశ్రమకు భారీ నష్టం కలిగించేలా పైరసీ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని సినీవర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# బొగ్గు, లిగ్నైట్ గ్యాసిఫికేషన్‌కు ప్రోత్సాహకం

## ప్రభుత్వాలకు యేటా రూ.6,300 కోట్లు రాబడి

## రూ.37,500 కోట్ల ఆర్థిక వ్యయానికి గ్రీన్‌సిగ్నల్

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త :** ఉపరితల బొగ్గు, లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుల ప్రోత్సాహక పథకానికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టుకు రూ.37,500 కోట్ల ఆర్థిక వ్యయం అవుతుందని అంచనా వేసింది. బొగ్గు మంత్రిత్వ శాఖ సీనియర్ కార్యదర్శి వెల్లడించిన వివరాలు ప్రకారం 2030 నాటికి 100 మిలియన్ టన్నుల బొగ్గును గ్యాసిఫై చేయాలనే జాతీయ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించింది. అంచనా వేయబడిన పెట్టుబడి సమీకరణగా రూ.2.5 లక్షల కోట్ల నుండి రూ.3 లక్షల కోట్లుగా అంచనా వేసింది. ఇంధన భద్రతను బలోపేతం చేయడంలో, ఎస్‌ఎన్‌జి (50 శాతం కంటే ఎక్కువ దిగుమతి), యూరియా (20 శాతం దిగుమతి), అమ్మోనియా (100 శాతం దిగుమతి), మిథనాల్ ( 80-90 శాతం దిగుమతి) వంటి కీలక ఉత్పత్తుల దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడంలో ఒక ప్రధాన ముందడుగు పడనుంది. సంస్కరణలో భాగంగా, ప్రభుత్వం నియంత్రణేతర రంగం లింకేజ్ వేలం ఫ్రేమ్‌వర్క్‌లోని బొగ్గు వాయువుగా మార్చడానికి దారితీసే సింగాస్ ఉత్పత్తి అనే ఉపరంగం కింద బొగ్గు అనుసంధాన కాలపరిమితిని 30 సంవత్సరాల వరకు పొడిగించింది. ఇది బొగ్గు వాయువుగా మార్చే ప్రాజెక్టులలో పెట్టుబడులకు దీర్ఘకాలిక విధాన స్థిరత్వాన్ని అందిస్తుందని బొగ్గు మంత్రిత్వ శాఖ భావిస్తోంది. కాగా ఈ పథకం యొక్క ముఖ్య లక్షణాలు గురించి వివరిస్తూ కొత్త ఉపరితల బొగ్గు, లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులను ప్రోత్సహించ డానికిగాను సుమారు 75 మిలియన్ టన్నులు గ్యాసిఫికేషన్ చేసే లక్ష ్యంతో రూ.37,500 కోట్ల మొత్తం కేటాయింపు చేస్తోంది. ఇందులో ప్లాంట్, యంత్రాల ఖర్చులో గరిష్టంగా 20 శాతం వరకు ఆర్థిక ప్రోత్సాహం అందించబడు తుంది. ప్రాజెక్ట్ వ్యయం, బొగ్గు వినియోగం, సింగాస్ ఉత్పత్తిని బెంచ్‌మార్క్ చేసే మూల్యాంకన ఫ్రేమ్‌వర్క్‌తో, పారదర్శకమైన, పోటీ బిడ్డింగ్ ప్రక్రియ ద్వారా ఎంపిక చేయబడుతుంది. ప్రాజెక్ట్ మైలురాళ్లకు అనుసంధానించి, ప్రోత్సాహకాన్ని నాలుగు సమాన వాయిదాలలో విడుదల చేస్తారు. ఏదైనా ఒకే ప్రాజెక్టుకు ఆర్థిక ప్రోత్సాహకం రూ.5 వేల కోట్లకు పరిమితం కాగా, ఏదైనా ఒకే ఉత్పత్తికి (సింథటిక్ నేచురల్ గ్యాస్, యూరియా మినహా) రూ.9 వేల కోట్లకు, అలాగే అన్ని ప్రాజెక్టులలో ఏదైనా ఒకే సంస్థల సమూహానికి రూ.12 వేల కోట్లకు పరిమితం కానుంది. ఈ పథకం ద్వారా బొగ్గు నిక్షేపాలున్న ప్రాంతాల్లోని 25 ప్రాజెక్టులలో సుమారు 50 వేల ప్రత్యక్ష, పరోక్షంగా ఉద్యోగాలు సృష్టించబడతాయని అంచనా. మరోపక్క ఈ పథకం కింద ఉద్దేశించిన 75 మిలియన్ టన్నుల గ్యాసిఫికేషన్ ద్వారా బొగ్గు, లిగ్నైట్ వినియోగం నుండి ప్రభుత్వాలకు ఏటా రూ.6,300 కోట్లు సమకూరవచ్చని అంచనా. దీనికి అదనంగా, జీఎస్టీ మరియు ఇతర పన్నుల ద్వారా అనుబంధ రాబడి కూడా లభిస్తుందని కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

# కేరళం సిఎం సతీశన్ ప్రమాణ స్వీకారానికి హాజరైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

## కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సిఎంల ఫొటో సెషన్, ట్విట్టర్ ద్వారా షేర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 18:** కేరళం నూతన ముఖ్యమంత్రి సతీశన్ ప్రమాణ స్వీకారానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్కతో కలిసి హాజర య్యారు. సతీశన్ ప్రమాణ స్వీకారానికి కాంగ్రెస్ అగ్రనేతలు మల్లిఖార్జున ఖర్గే,రాహుల్‌గాంధీ,ప్రియాంకగాంధీతో పాటు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కీలక నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులంతా కలిసి ఫోటోలు దిగారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తూ ఫోటోలను ట్విట్టర్ ద్వారా షేర్ చేశారు. సిఎం ప్రమాణ స్వీకారానికి హాజరుకావడం ఫ్రెండ్స్,కొలీగ్స్‌తో ఓ రీయునియన్‌లా ఉందని సిఎం ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కతో పాటు హిమాచల్‌ప్రదేశ్ సిఎం సుఖ్‌వీందర్ సింగ్ సుఖు,చత్తీస్‌గఢ్ మాజీ సిఎం భూపేశ్ బఘేల్,కర్ణాటక డిప్యూటీ సిఎం డికె శివకుమార్,కేరళం సిఎం సతీశన్‌తో దిగిన ఫోటోలను ట్విట్టర్ ద్వారా షేర్ చేశారు. ఇదే ఉత్సాహంతో రాహుల్‌గాంధీని దేశ ప్రధానమంత్రిగా చూడాలన్న లక్ష్యాన్ని చేరుకుంటామన్నారు. కాగా, కేరళ పర్యటన ముగించుకుని సిఎం రేవంత్‌రెడ్డి సోమవారం సాయంత్రం హైదరాబాద్‌కు చేరుకున్నారు.

# బండి సంజయ్ తప్పు చేయలేదు

## కెటిఆర్, బిఆర్‌ఎస్ నాయకులు బిజెపిపై విషప్రచారం చేస్తున్నారు

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు




**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త:** కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో పాటు బిజెపిపై రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు దుష్ప్రచారం చేస్తున్నాయని తెలంగాణ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాం చందర్‌రావు అన్నారు. బిఆర్‌ఎస్ పార్టీ నాయ కులు, భారతీయ జనతా పార్టీని లక్ష ్యంగా చేసుకుని వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారు. ఒక వ్యక్తిని, వారి కుటుంబాన్ని టార్గెట్ చేస్తూ రాజ కీయ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నారని చెప్పారు. సోమ వారం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ కార్యక్రమాలపై నిర్వహించిన సన్నాహక సమావేశంలో రాంచందర్ రావు కీలక ప్రసంగం చేశారు. పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ, ప్రజా సమస్యల పరిష్కారం, కార్యకర్తల పాత్రపై ఆయన స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి పోస్టర్లు, సోషల్ మీడియా ప్రచారం, అనుకూల మీడియా ద్వారా భారతీయ జనతా పార్టీని బద్నాం చేసే ప్రయత్నం జరుగుతుందన్నారు. ముఖ్యంగా కెటిఆర్ ఈ ప్రచారాన్ని నడిపిస్తున్నారు. ఎవరైనా తప్పు చేసి ఉంటే చట్ట ప్రకారం చర్యలు తప్పవు. ఒకవేళ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తప్పు చేసి ఉంటే పార్టీ చర్యలు తీసుకుంటుందని, కాని ఇక్కడ జరిగింది ఆయన కుటుంబ సభ్యులకు సంబంధించింది. ఆయన కుటుంబ సభ్యులు తప్పు చేసి ఉంటే చట్టం తన పని చేస్తుంది. కోర్టులు నిర్ణయం తీసుకుంటాయి. చట్టపరమైన హక్కుల ప్రకారం ఎవరైనా ముందస్తు బెయిల్ తీసుకోవచ్చు. అది పారిపోవడం కాదు. చట్టంలో ఉన్న హక్కును వినియోగించుకోవడమే. కానీ ముందు బిఆర్‌ఎస్ నాయకులు తమ పాలనలో జరిగిన ఘటనలకు సమాధానం చెప్పాలి. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అక్రమాలు, అవినీతి అంశంపై విచారణలు ప్రారంభమయ్యాక కోర్టులను ఆశ్రయించిన వారు, ఇప్పుడు నైతికత గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉంది. ప్రజలు ఇప్పటికే బిఆర్‌ఎస్‌ను తిరస్కరించారు. కాళేశ్వరం, ఫార్ములా ఈ-రేస్ వంటి అంశాల్లో ఇరుక్కుపోతామనే కెటిఆర్‌తో పాటు ఇతర బిఆర్‌ఎస్ నాయకులు, భయంతో బిజెపిపై విష ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ ప్రధానమంత్రిగా 12 సంవత్సరాల పాలనను పూర్తి చేసుకోబోతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇంధన పొదుపుపై మేరా భారత్ మేరా యోగదాన్" అనే కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ మూడు అంశాలపై పార్టీ నాయకులు, కార్యకర్తలు చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

# కుటుంబ కలహాలతో భార్యను హత్యచేసిన భర్త

## సుత్తితో బాది హత్య చేసిన నిందితుడు

## అక్కడిక్కడే మృతి చెందిన భార్య

**చెన్నూరు, మే 18, ప్రభాతవార్త :** మంచిర్యాల జిల్లాలోని చెన్నూరు మండలం ఏళ్లక్కపేట గ్రామానికి చెందిన సల్ల శారద (25)ను సోమవారం రోజున భర్త సుత్తితో మోది హత్యచేసినట్లు బంధువులు తెలిపారు. దీంతో మృతురాలు సంఘటనా స్థలంలోనే మృతిచెందిందని వారు అన్నారు. మృతురాలి తల్లిదండ్రులు మాట్లాడుతూ ఐదు సంవత్సరాల క్రితం సల్ల రమేష్‌కు ఇచ్చి వివాహం చేసినట్లు వారికి ఇద్దరు కుమారుల సంతానం ఉన్నారు. ఒక కుమారుడు మూడు సంవత్సరాలు, రెండవ సంతాన నెలబాబు మాత్రమే ఉన్నట్లు తెలిపారు. ఆది నుండి తమ కూతురిపై అదనపువరకట్నం కోసం వేధింపులకు పాల్పడేవాడని గతంలో పంచాయితులు అయిన సంఘటనలు ఉన్నాయని వారు తెలిపారు. విషయం తెలుసుకున్న మృతురాలి బంధువులు కొంత హింసాత్మక వాతావరణం నెలకొనడంతో లా అండ్ ఆర్డర్ సమస్య తలెత్తకుండా జైపూర్ ఏసీపీ, కోటపల్లి సీఐ, ఎస్సై, చెన్నూరు సీఐ,ఎస్సై, పర్యవేక్షించారు. మృతురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.




శారద (ఫైల్)

# ఉద్యోగుల కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ వ్యయాన్ని పెట్టుబడిగా భావించాలి

## అది వృథా ఖర్చు కాదు.. ఎస్కీ డైరెక్టర్ డా. జి. రామేశ్వర్ రావు

**హైదరాబాద్, మే 18 ప్రభాతవార్త** ఉద్యోగుల వృత్తి జీవితంలో వారి ఎదుగుదలకు అనుగుణంగా ప్రతి దశలో అందించే కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ ప్రభుత్వానికి పెట్టుబడిలాంటిదే గానీ, అనవసర ఖర్చు కాదని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డా. జి. రామేశ్వర్ రావు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో, ఎస్కీకి చెందిన పవర్ అండ్ ఎనర్జీ, వాటర్ రిసోర్సెస్ డెవలప్‌మెంట్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం ఎస్కీ ప్రాంగణంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా డా. రామేశ్వర్ రావు మాట్లాడుతూ, రివ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్ కింద భారత ప్రభుత్వ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ సహకారంతో దేశంలోని వివిధ రాష్ట్రాల డిస్కంలలో పనిచేస్తున్న 2,500 మంది మిడిల్ లెవల్ మేనేజ్‌మెంట్ ఇంజినీర్లకు గత 11 నెలలుగా ఎస్కీ ద్వారా సీనియర్ నిపుణులతో శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో ఫండమెంటల్స్ ఆఫ్ పవర్ క్వాలిటీ, ఫ్రీక్వెన్సీ స్టెబిలిటీ, మెడికల్ గ్యాస్ పైప్‌లైన్ సిస్టమ్స్, ఫైర్ డిటెక్షన్, ఫైర్ సేఫ్టీ ఆడిట్, సైబర్ సెక్యూరిటీ వంటి కీలక అంశాలపై సాంకేతిక అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా మధ్యప్రదేశ్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ అధికారులకు, కేంద్ర రహదారులు, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ అధికారులకు కూడా ఎస్కీ ద్వారా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గత నాలుగున్నర దశాబ్దాలుగా, ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా వేలాది కెపాసిటీ బిల్డింగ్ కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, వివిధ శాఖల ఇంజినీరింగ్ పనులకు థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ ఏజెన్సీగా సైతం సేవలందిస్తుందని తెలిపారు. ఎస్కీ అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా సంస్థకు తొమ్మిది సార్లు గోల్డెన్ పీకాక్ అవార్డులు లభించాయని పేర్కొన్నారు. ఇరిగేషన్ ఇంజినీర్ల కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమైనట్లు తెలియజేస్తూ, డ్యామ్ సేఫ్టీ గైడ్‌లైన్స్, మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ మెజర్స్, ఎమర్జెన్సీ యాక్షన్ ప్లాన్, సిస్మిక్ సేఫ్టీ, ఫ్లడ్ డిస్పోజల్ వంటి అంశాలపై సీనియర్ ఫ్యాకల్టీ ద్వారా శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేశంలోని వివిధ రాష్ట్రాల డిస్కం విభాగాలకు చెందిన 60 మంది, ఎంపిపిడబ్ల్యుడికు చెందిన 30 మంది, ఇతర విభాగాలకు చెందిన 10 మంది కలిపి మొత్తం 100 మంది మిడిల్ లెవల్ మేనేజ్‌మెంట్ ఇంజినీర్లు పాల్గొన్నారు. అలాగే, వాటర్ రిసోర్సెస్ విభాగం నిర్వహిస్తున్న శిక్షణ కోసం వివిధ రాష్ట్రాల నుండి ఇరిగేషన్ ఇంజినీర్లు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డా. ఐ.ఎస్.ఎన్. రాజు, నరేంద్ర కుమార్, సయ్యద్ హుస్సేన్, డా. వి. విద్యాసాగర్, కాలేజ్ చీఫ్ ఎస్. లక్ష్మీ మకాంత రావు, డా. పి. రాజారావు, శ్రీకాంత్, నరేశ్, జ్యోతి తదితరులు

# సిఎస్ఐఆర్.. ఐఐసిటి ఉద్యోగ పరీక్షలో హైటెక్ మాల్‌ప్రాక్టీస్ రాకెట్ గుట్టరట్టు - 12 మంది అరెస్ట్



పోలీసుల అదుపులో మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడిన అభ్యర్థులు

**నాచారం, మే 18 ప్రభాతవార్త :** మల్కాజ్‌గిరి కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన సిఎస్ఐఆర్-ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ ఉద్యోగ నియామక పరీక్షలో సంఘటిత మాల్‌ప్రాక్టీస్ రాకెట్‌ను నాచారం పోలీసులు ఛేదించారు. అత్యాధునిక రహస్య ఎలక్ట్రానిక్ పరికరాల సహాయంతో పరీక్షలో అక్రమాలకు పాల్పడుతున్న 12 మంది అభ్యర్థులను పోలీసులు అరెస్ట్ చేసి భారీగా ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం నాచారం స్నేహపురి కాలనీలోని సెయింట్ పాయిస్ డిగ్రీ, పీజీ అండ్ ఎంబీఏ కాలేజ్ ఫర్ ఉమెన్‌లో మల్టీ టాస్కింగ్ స్టాఫ్ (ఎంఎటీఎస్) పోస్టుల భర్తీకి నిర్వహించిన పరీక్షలో కొంతమంది అభ్యర్థులు అనుమానాస్పదంగా ప్రవర్తించడం గుర్తించారు. వెంటనే నాచారం పోలీస్ స్టేషన్ సిబ్బంది, సిఎస్ఐఆర్ ఐఐసీటీ అధికారులతో కలిసి తనిఖీలు చేపట్టారు. మొదట మందీప్ అనే అభ్యర్థి వద్ద రహస్య ఎలక్ట్రానిక్ పరికరాలు బయటపడగా అనంతర విచారణలో మొత్తం 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు అయిన వారి నుంచి మైక్రో, నానో ఇయర్‌ఫోన్లు, స్పై జీఎస్ఎం కమ్యూనికేషన్ పరికరాలు, మార్పు చేసిన మొబైల్ ఫోన్లు, సిమ్ ఆధారిత రహస్య కమ్యూనికేషన్ పరికరాలు, ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక విచారణలో అరెస్టు అయిన వారిలో పలువురు హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులుగా గుర్తించారు. వీరు హర్యానాలోని "మైండ్ క్యూ టైపింగ్" సంస్థ ద్వారా శిక్షణ పొందినట్లు, బయట ఉన్న హ్యాండ్లర్ల సహాయంతో ప్రశ్నాపత్రాలను స్కాన్ చేసి సమాధానాలు అందుకుంటూ పరీక్షలో మోసానికి పాల్పడినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో అభ్యర్థుల నుంచి రూ.1 లక్ష నుంచి రూ.8 లక్షల వరకు వసూలు చేసిన ఆర్థిక లావాదేవీల అంశాలు కూడా వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. పోలీసుల విచారణలో అభ్యర్థులు చెవుల్లో మైక్రో స్పై ఇయర్‌ఫోన్లు దాచుకోవడం, శరీరానికి రహస్య కమ్యూనికేషన్ పరికరాలను అమర్చుకోవడం ద్వారా పరీక్షలు రాసినట్లు గుర్తించారు. కొందరు అభ్యర్థులు ప్రశ్నాపత్రాలను మార్పు చేసిన మొబైల్ పరికరాల ద్వారా బయట ఉన్న హ్యాండ్లర్లకు పంపగా, అక్కడి నుంచి సమాధానాలు తిరిగి పంపించి వాటిని వినిపించే విధానాన్ని అనుసరించినట్లు వెల్లడైంది. ఈ ఘటనపై నాచారం పోలీసులు కేసు నంబర్ 242/2026గా నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పట్టుబడిన వారిలో హర్యాణ, యూపికి చెంతదిన రామ్‌కేష్, అజయ్ మందీప్, సాహిల్, నితీష్, అజ్మీర్, ధీరజ్, అజయ్, స్వాభిమాన్, మనోజ్, పంకజ్, మెనుకుమార్ తదితరులు ఉన్నారు. కాగా వీరిపై తెలంగాణ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ చట్టంతో పాటు భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్)లోని పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. పరారీలో ఉన్న మిగతా నిందితులను గుర్తించి పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయని, ఈ కేసు మల్కాజ్‌గిరి కమిషనరేట్ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా పోటీ పరీక్ష నిర్వహించిన నాచారం సెయింట్ పాయిస్ కళాశాలకు మల్కాజ్‌గిరి డీసీపీ సురేష్ కుమార్, అదనపు డీసీపీ వెంకటరమణ, ఏసీపీ వెంకట్ రెడ్డి, ఎస్‌హెచ్ఓ ధనుంజయ్ గౌడ్, ఎస్ఐలు వెంకటయ్య, ప్రభాకర్ రెడ్డిలు చేరుకున్నారు.

# 'సర్' పై వైసిపి కార్యకర్తలు దృష్టి కేంద్రీకరించాలి

## పార్టీ రాష్ట్ర కో- ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి

**విజయవాడ,మే18,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో జూన్ జరిగే ఎస్ఐఆర్ సర్వే సందర్భంలో వైసిపి కార్యకర్తలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని వైసీపీ రాష్ట్ర కో- ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం నేపథ్యంలో వైసీపీ తన క్యాడర్‌ను ఈ కార్యక్రమం కోసం సిద్ధం చేస్తోంది. పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్లమెంటరీ పరిశీలకులతో నిర్వహించిన కీలక సమావేశంలో వైసీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ ఓటర్ల సవరణ ప్రక్రియ జూన్ 15న ప్రారంభమై సెప్టెంబర్ వరకు అత్యంత కీలకమైన దశల వారీగా సాగనుందని ఆయన వివరించారు, జూన్ 15 నుంచి జూలై 14 వరకు రాష్ట్రవ్యాప్తంగా ముమ్మరంగా ఇంటింటి సర్వే నిర్వహిస్తారు. అనంతరం జూలై 21న ముసాయిదా (డ్రాఫ్ట్) ఓటర్ల జాబితాను విడుదల చేయడం జరుగుతుంది. ఆ తర్వాత ఓటర్ల నుంచి వచ్చే అభ్యంతరాల స్వీకరణ, వాటి పరిష్కార ప్రక్రియను పూర్తి చేసి, చివరగా సెప్టెంబర్ 22న తుది ఓటర్ల జాబితాను అధికారికంగా విడుదల చేస్తారు. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాగే ఈ ఎస్ఐఆర్ ప్రక్రియ అత్యంత ప్రాధాన్యత కలిగినది కావడంతో, పార్టీ తరఫున నియమించిన కమిటీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు ఎలాంటి నిరక్ష్యానికి తావులేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన ఆదేశించారు. ఈ ఓటర్ల సవరణ క్రతువులో బూత్ లెవల్ ఏజెంట్ల పాత్ర అత్యంత కీలకమని సజ్జల స్పష్టం చేశారు. బూత్ లెవల్ ఆఫీసర్లతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ, వైసీపీ సానుభూతిపరుల ఓట్లు ఎట్టి పరిస్థితుల్లోనూ జాబితా నుండి తొలగించబడకుండా డ్రాఫ్ట్ స్థాయిలోనే అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇందుకోసం బీఎల్ఏలకు త్వరలోనే ప్రత్యేక ఓరియెంటేషన్, శిక్షణ ఇస్తామని ప్రకటించారు. ఇది ఖీస్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌ఖీ కావడం వల్ల ఒకసారి ఓటు తొలగిస్తే మళ్లీ చేర్చడం చాలా కష్టమని, ఎన్యూమరేషన్ ఫామ్ ఇస్తేనే ఓటు భద్రంగా ఉంటుందనే విషయాన్ని క్షేత్రస్థాయిలో ఓటర్లకు వివరించి వారిని చైతన్యపరచాలన్నారు.

# వర్సిటీలకు సంస్థాగత అభివృద్ధి ప్రణాళిక కీలకం

## అంబేద్కర్ యూనివర్సిటీ విసి ప్రొ. ఘంటా చక్రపాణి



సంస్థాగత అభివృద్ధి సమగ్ర ప్రణాళికను విడుదల చేస్తున్న ఘంటా చక్రపాణి ఇతర ఆచార్యులు

**జూబ్లీహిల్స్, మే 18, ప్రభాతవార్త:** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ తన సంస్థాగత అభివృద్ధి ప్రణాళికను రూపొందించుకొని క్రమపద్ధతిలో అమలు చేయడం ద్వారా, ఒక సమగ్ర డిజిటల్ విద్యా సంస్థగా పరిణామం చెందడానికి ముందడుగు వేస్తోందని ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి అభిప్రాయపడ్డారు. విద్యా వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న అయన మాట్లాడుతూ సమగ్ర అధ్యయనం తర్వాత రూపొందించుకున్న ఇన్స్టిట్యూషనల్ డెవలప్మెంట్ ప్లాన్‌ని పూర్తి స్థాయిలో అమలు చేస్తే అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అత్యున్నత స్థాయి గుర్తింపును సాధించడానికి దోహదపడటంతోపాటు, భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తుందన్నారు. విశ్వవిద్యాలయాన్ని పరివర్తన దశాబ్దంగా పేర్కొనడం సముచితంగా ఉంటుందని, ఇందులో భాగంగా సాంప్రదాయ విద్యా కార్యక్రమాలతో పాటు ఉపాధి ఆధారిత కోర్సులను ప్రవేశపెట్టినట్లు వెల్లడించారు. విశ్వవిద్యాలయ నిర్దిష్ట కార్యాచరణ నిర్మాణంలో అకడమిక్ వ్యవహారాలు, విద్యార్థి, సేవలు, పరిపాలనా సేవలు, సాంకేతిక సేవలు, స్కిల్ డెవలప్మెంట్ ఎంతో కీలకమన్నారు. వీటన్నింటినీ సమన్వయం చేస్తూ ముందుకు వెళ్లడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు ఘంటా చక్రపాణి వెల్లడించారు. అనంతరం ఇతర డైరక్టర్లు, డీన్‌లతో కలిసి సంస్థాగత అభివృద్ధి సమగ్ర ప్రణాళిక(2026-2036)ను విడుదల చేశారు. అదేవిధంగా వర్సిటీ నేషనల్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ గుర్తింపు కోసం ఆన్లైన్ అప్లికేషన్‌ను దిగ్విజయంగా సమర్పించింది. అకాడమిక్ డైరెక్టర్ ఆచార్య పుష్పాచక్రపాణి, రిజిస్ట్రార్ డా. యల్. విజయా కృష్ణారెడ్డి, ఓఎస్డీ ఆచార్య రవీంద్రనాథ్ సోలమన్, ఆచార్య పల్లవి కాబ్దే, ఆచార్య పి. వెంకటరమణ, ఆచార్య ఎన్.రజని, ఆచార్య కె.శ్రీదేవి, డా.వై. వెంకటే శ్వర్లు, బోధనేతర సంఘం, అన్ని విభాగాల డైరెక్టర్లు, డీన్లు ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# హార్ముజ్ మీదుగా వెళ్లే అండర్‌సీ కేబుల్స్‌పై ఇరాన్ డిజిటల్ ట్యాక్స్!

**టెహ్రాన్, మే 18:** ప్రపంచ దేశాలకు ప్రధాన రవాణా మార్గంగా ఉన్న హార్ముజ్ జలసంధిలో ఇరాన్ ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ఈ జలసంధి గుండా వెళ్లే అంతర్జాతీయ అండర్ సీ ఫైబర్‌ఆప్టిక్ ఇంటర్నెట్ కేబుల్స్ పై ట్రాన్సిట్ ఫీజు" అంటే రవాణా రుసుము వసూలు చేసే అవకాశాలను పరిశీలిస్తోంది. ఈ రకంగా భారీగా ఆదాయాన్ని గడించడంతో పాటు, విదేశీ ప్రత్యర్థులపై రాజకీయ, డిజిటల్ పట్టు సాధించాలని ఇరాన్ భావిస్తోంది. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్‌కు చెందిన తస్నీమ్ న్యూస్ ఏజెన్సీ కథనం ప్రకారం.. అంతర్జాతీయ కేబుల్ ఆపరేటర్లపై ఇరాన్ ఈ డిజిటల్ పన్నును విధించనుంది. దీనివల్ల గూగుల్, మెటా, మైక్రోసాఫ్ట్, అమెజాన్ వంటి గ్లోబల్ టెక్ దిగ్గజాలు ఇరాన్ నిర్దేశించిన నిబంధనలకు లోబడి పనిచేయాల్సి ఉంటుంది.

మేము ఇంటర్నెట్ కేబుల్స్‌పై ఛార్జీలు విధిస్తామని ఇరాన్ సైనిక ప్రతినిధి ఇబ్రహీం జోల్ఫాగరి గత వారం చెప్పిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం హార్మూజ్ జలసంధి గుండా దాదాపు ఏడు ప్రధాన జలగర్భ కేబుల్ మార్గాలు వెళుతున్నాయి. వీటిలో ఫాల్కన్ , గల్ఫ్ బ్రిడ్జ్ ఇంటర్నేషనల్ గల్ఫ్ టిజిఎన్ వంటి వ్యవస్థలు ఉన్నాయి. ఇవి గల్ఫ్ దేశాలకు ఇంటర్నెట్ కనెక్టివిటీని అందిస్తూ ఇరాన్ ప్రాంతీయ జలాల గుండా ప్రయాణిస్తాయి. ఈ ప్లాన్ అమలులోకి వస్తే, ఆ కేబుల్స్ ద్వారా ప్రసారమయ్యే అంతర్జాతీయ డేటాను ఇరాన్ నిఘా పెట్టే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒకవేళ ఏవైనా సంస్థలు నిబంధనలు ఉల్లంఘిస్తే మిలిటరీ డైవర్లు, చిన్న జలాంతర్గాములు లేదా డ్రోన్ల ద్వారా ఈ కేబుల్స్ నెట్‌వర్క్‌ను ఇరాన్ దెబ్బతీసే అవకాశం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ ప్రతిపాదనను ఈజిప్ట్ దేశానికి చెందిన సూయజ్ కాలువ నౌకల టోల్ సిస్టమ్‌తో పోలుస్తున్నారు. సముద్ర మార్గాల ద్వారా ఈజిప్ట్ ఎలాగైతే ఆదాయాన్ని సంపాదిస్తుందో, ఇరాన్ కూడా కేబుల్స్ ద్వారా డిజిటల్ టోల్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని చూస్తోందని నిపుణుల అంచనా.



# రైతుల పాలిట శాపంగా కేంద్ర విధానాలు

- సాగుకు ఆర్థిక భరోసా కల్పించే విధానాలు రావాలి - రైతులను ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా చూడాలి: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యవసాయవిధానాలు రైతులను నట్టేట ముంచుతున్నాయని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. అన్నదాతలకు పూర్తి స్థాయి రక్షణను కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమవుతోందని దుయ్యబట్టారు. రైతులకు గిట్టుబాటు ధర, మార్కెట్ భరోసా, దిగుమతుల నుంచి రక్షణ, ఉత్పత్తి వ్యయాల నియంత్రణ వంటి అంశాల్లో కేంద్రం సమగ్ర దృష్టితో ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న బిజెపి కేంద్ర మంత్రులు పదేపదే "కేంద్రమే ధాన్యం సేకరిస్తోంది. అందుకు అయ్యే ఖర్చు మొత్తాన్ని కేంద్రమే భరిస్తోంది." అంటూ ప్రచారం చేయడం వాస్తవ పరిస్థితులను వక్రీకరించడం తప్ప మరొకటి కాదని స్పష్టం చేశారు. రైతుల సమస్యలను ఒక్క వరి ధాన్యానికి మాత్రమే పరిమితం చేయడం సరైంది కాదని, తెలంగాణలో వరితోపాటు మొక్కజొన్న, జొన్న, కందులు, పెసలు, సోయాబీన్, పొద్దుతిరుగుడు, పత్తి, ఆయిల్‌పామ్ వంటి అనేక పంటలు విస్తృతంగా సాగవుతున్నాయని తెలిపారు. వరి ధాన్యం విషయంలో ఎఫ్‌సిఐ పూర్తి పంట దిగుబడిని కొనుగోలు చేయడం లేదని మండిపడ్డారు. కేంద్రం వరి ధాన్యానికి క్వింటాకు రూ.2,300 మద్దతు ధర ప్రకటించినప్పటికీ, తెలంగాణ ప్రభుత్వం అదనంగా క్వింటాకు రూ. 500 బోనస్ ఇస్తున్న విషయాన్ని కేంద్ర మంత్రులు ఎందుకు గుర్తించడంలేదని ప్రశ్నించారు. రైతు ఆదాయాన్ని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని బిజెపి ప్రజాప్రతినిధులు చిన్నచూపు చూడడం బాధాకరమన్నారు. రైతులకు నిజమైన భరోసా కల్పిస్తున్నది రాష్ట్ర ప్రభుత్వమేనని తేల్చి చెప్పారు. కేంద్రం మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్న పెసలు, కందులు, సోయాబీన్, పొద్దుతిరుగుడు వంటి పంటలపై 25శాతం పరిమితి విధించడం వల్ల మిగిలిన పంటను రైతులు ఎక్కడ విక్రయించాలనే ప్రశ్నకు సమాధానం చెప్పాలని బిజెపి నేతలను డిమాండ్ చేశారు. ప్రత్యేకంగా తెలంగాణలో విస్తృతంగా సాగు చేస్తున్న మొక్కజొన్న, జొన్న పంటలను కేంద్ర ప్రభుత్వం ధర మద్దతు పథకం పరిధిలోకి ఎందుకు తీసుకురావడం లేదో స్పష్టం చేయాలని కోరారు. ఇది రైతుల పట్ల నిరక్ష్య ధోరణికి నిదర్శనమని, ఈ రెండు పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించినప్పటికీ, ఆ ధరకు ప్రభుత్వ కొనుగోలు హామీ లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారని మంత్రి తుమ్మల ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా.. కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తున్న కనీస మద్దతు ధరలు స్వామినాథన్ కమిటీ సిఫారసుల ప్రకారం సి2 + 50 శాతం సూత్రాన్ని అనుసరిస్తున్నాయా అన్న విషయంలో రైతులకు స్పష్టత ఇవ్వాలని మంత్రి తుమ్మల డిమాండ్ చేశారు. గడిచిన అయిదేళ్లలో ఎరువులు, డీజిల్, విత్తనాలు, కూలీల ఖర్చులు భారీగా పెరిగినా అదే స్థాయిలో మద్దతు ధరలు పెరగలేదన్నారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందాల కారణంగా దిగుమతి సుంకాలు తగ్గితే అక్కడి నుంచి తక్కువ ధరలకు వచ్చే వ్యవసాయ ఉత్పత్తులు భారత రైతులపై తీవ్ర ప్రభావం చూపుతాయని ఆయన హెచ్చరించారు. ముఖ్యంగా మొక్కజొన్న, సోయాబీన్, పత్తి వంటి పంటలకు దేశీయ మార్కెట్లో గిట్టుబాటు ధరలు రాక తీవ్ర నష్టాలను చవిచూడాల్సి వస్తుందని పేర్కొన్నారు. గత సీజన్‌లో దేశీయ పత్తి ధర క్వింటాల్ కు 1000 నుండి 1500 తగ్గిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఆయిల్‌పామ్‌పై దిగుమతి సుంకాలు తగ్గించడంతో దేశీయ ఉత్పత్తిదారులకు ధరలు పడిపోతున్నాయని, దీంతో ఆయిల్‌పామ్ రైతులు పెట్టుబడులు కూడా తిరిగి పొందలేని పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ఎరువుల విషయంలోకేంద్ర విధానం అసమతుల్యతను ప్రోత్స హిస్తోందని మంత్రి విమర్శించారు. యూరియాను మాత్రమే అధిక సబ్సిడీతో అందించడంతో రైతులు ఇతర సమతుల ఎరువుల వినియోగాన్ని తగ్గించి యూరియాపైనే ఆధారపడుతున్నారని తెలిపారు.

# కార్మికులను నిర్లక్ష్యం చేయడం ప్రభుత్వాలకు మంచిది కాదు : మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ



అభివాదంచేస్తున్న దత్తాత్రేయ, మధుసూధనాచారి, పెద్దిరెడ్డి, దిలీప్‌కుమార్ తదితరులు

**హైదరాబాద్, మే 18,ప్రభాతవార్త:** కార్మికుడు - కర్షకుడు ఇద్దరూ బాగుంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుంది. సమాజ నిర్మాణంలో వారు ఉత్పాదక శక్తులని, తమ రక్తాన్ని శ్రమగా మార్చి రాష్ట్ర అభివృద్ధికి అహర్నిశలు పాటుపడుతున్న కార్మికులను నిరక్ష్యం చేయడం ఏ ప్రభుత్వానికీ మంచిది కాదు" అని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. ఈమేరకు శనివారం బండారు వైష్ణవ్ మెమోరియల్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ బండారు విజయలక్ష్మి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో కనీస వేతనాల పెంపు కోసం నిర్వహించిన ఆల్ ట్రేడ్ యూనియన్ రౌండ్ టేబుల్ సమావేశానికి దత్తాత్రేయ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రత్యేకంగా అసంఘటిత రంగ కార్మికుల పరిస్థితిపై మనందరం మరింతగా ఆలోచించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. దేశంలోని మొత్తం శ్రామిక శక్తిలో అసంఘటిత రంగ కార్మికుల వాటా 93 శాతంగా ఉందని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో 2012 సంవత్సరం నుండి ఇప్పటి వరకు కనీస వేతనాల సవరణ జరగకపోవడం చాలా దౌర్భాగ్యకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత దాదాపు నాలుగు కనీస వేతన సవరణ కమిటీలు ఏర్పడినా, వాటి సిఫార్సులను ప్రభుత్వం ఇప్పటివరకు ఆమోదించకపోవడం శోచనీయమని అన్నారు. పెరుగుతున్న ధరలు, నిత్యావసర వస్తువుల భారం, విద్యా-వైద్య ఖర్చులు, అలాగే కార్మిక కుటుంబాల్లో జరిగే శుభ కార్యాల వ్యయాలను దృష్టిలో ఉంచుకొని కనీస వేతనాలను నిర్ణయించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే త్రిసభ్య (ట్రైపార్టీ) సమావేశాలు నిర్వహించి యాజమాన్యాలు, కార్మిక సంఘాలు, ప్రభుత్వ అధికారులతో చర్చలు జరిపి కార్మికుల సమస్యలు, డిమాండ్ల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ మంత్రి పెద్ది రెడ్డి వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# అన్నా డిఎంకెలో పెచ్చుమీరిపోయిన వర్గపోరు!

## సీనియర్ మాజీ మంత్రి సెన్‌మలై రాజీనామా

**చెన్నై, మే 18:** అసెంబ్లీ ఎన్నికల అనంతరం తమిళనాడు అన్నాడిఎంకెలో అంతర్గత పోరు ఒక్కసారిగా పెరిగిపోయింది. నేతలందరూ పళనిసామి వైఖరిని దుయ్యబడుతున్నారు. ఈ క్రమంలోనే ఆపార్టీకి సీనియర్ నేత, మాజీ మంత్రి ఎస్.సెమ్మలై రాజీనామా చేశారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే ఓటమి చవిచూడటం, పార్టీలో అంతర్గత సంక్షోభం నెలకొన్న నేపథ్యంలో సెమ్మలై రాజీనామా ప్రాధాన్యం సంతరించుకుంది. జయలలిత మరణం తర్వాత పార్టీలో పెరుగుతున్న వర్గపోరు, సీనియర్లకు సరైన గుర్తింపు లేకపోవడంతో మనస్తాపం చెంది రాజీనామా నిర్ణయం తీసుకున్నట్టు ఆయన తెలిపారు. తన రాజీనామా లేఖను పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామికి పంపారు. పార్టీలో ఇటీవల తలెత్తిన పరిణామాలపై సెమ్మలై తన రాజీనామా లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీని ఎంతో ఉన్నత స్థితికి తీసుకువెళ్లిన రివల్యూషనరీ నేత ఎంజీఆర్, అమ్మ (జయలలిత) ఇలాంటి పరిణామాలను ఎన్నడూ ఊహించి ఉండరని, పార్టీలోని అంతర్గత కలహాలపై వస్తున్న కథనాలు కూడా పార్టీ దిగజారుడు పరిస్థితికి అద్దంపడుతున్నాయని అన్నారు. జయలలిత మరణాంతరం తనను పక్కకు పెట్టేశారని, అయినప్పటికీ తన మనోభావాలను బయటపెట్టకుండా క్రమశిక్షణతో పార్టీలో కొనసాగుతూ వచ్చానని చెప్పారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఇంకెంతమాత్రం పార్టీలో కొనసాగేందుకు తన మనసు అంగీకరించడం లేదన్నారు. పార్టీ వ్యవస్థాపకుడు ఎంజీఆర్, జయలలిత తనకు ఎన్నో అవకాశాలు ఇచ్చారని, రాజకీయ రంగంలో తన పురోగతికి ఎంతో సహకరించారని ఆయన గుర్తు చేసుకున్నారు. బరువెక్కిన హృదయంతో పార్టీకి, పార్టీ పదవులకు రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నట్టు సెమ్మలై తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు.

2001-04 మధ్యలో తమిళనాడు ఆరోగ్య, విద్యాశాఖ మంత్రిగా ఆయన సేవలందించారు. 1980లో తొలిసారి తారామంగళం నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా తమిళనాడు అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ఆ తర్వాత అన్నాడీఎంకేలో చేరారు. ప్రధాన రాజకీయ పార్టీలు ప్రకటించే ఉచిత పథకాలను బహిరంగంగా వ్యతిరేకించిన సీనియర్ నేతల్లో ఆయన కూడా ఒకరు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలే కానీ ఉచితాలు మంచిది కాదని సూచించేవారు.

# స్మార్ట్‌ఫోన్ వినియోగంతో పడిపోతున్న సంతానోత్పత్తిరేటు!

**న్యూయార్క్ మే 18:** ప్రపంచవ్యాప్తంగా జనాభా పెరుగుదల తీరు వేగంగా మారుతోంది. మూడు దశాబ్దాల క్రితం భారతదేశంలో ఒక మహిళ సగటున 3.4 మంది పిల్లలకు జన్మనిస్తే, ఇప్పుడు ఆ సంఖ్య 2.0కి పడిపోయిందని ప్రభుత్వ సర్వేలు చెబుతున్నాయి. ఇది జనాభా స్థిరంగా ఉండటానికి అవసరమైన 2.1 కంటే తక్కువ. ఈ ధోరణి కేవలం భారత్‌కే పరిమితం కాలేదు. ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో జననాల రేటు తీవ్రంగా పడిపోతోంది. కొన్ని దేశాల్లో అయితే మహిళలు సగటున ఒక్క బిడ్డకు కూడా జన్మనివ్వడం లేదు. ఇప్పటివరకు పెరుగుతున్న జీవన వ్యయం, ఖరీదైన గృహ వసతి, ఆలస్యంగా పెళ్లిళ్లు చేసుకోవడం, కెరీర్‌పై ఒత్తిడి, మారుతున్న సామాజిక పోకడలే సంతానలేమికి కారణాలని నిపుణులు భావించారు. ఇటీవలి కాలంలో పరిశోధకులు మరో కొత్త కోణాన్ని వెలుగులోకి తెస్తున్నారు. అదే స్మార్ట్‌ఫోన్లు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ప్రభావం. టెక్నాలజీ మానవ సంబంధాలను మార్చిన విధానమే పిల్లల్ని కనే వారి సంఖ్య తగ్గడానికి కారణమవుతోందని అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయి. సిన్సినాటి విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు నాథన్ హడ్సన్, హెర్నాన్ మోస్కోసోబోడో ఇటీవల అమెరికా, బ్రిటన్‌లలో 4జీ మొబైల్ ఇంటర్నెట్ రాకకు, జననాల రేటుకు మధ్య ఉన్న సంబంధంపై అధ్యయనం చేశారు. హైస్పీడ్ మొబైల్ కనెక్టివిటీ ముందుగా వచ్చిన ప్రాంతాల్లో జననాల రేటు వేగంగా, ఎక్కువగా తగ్గినట్టు వారి పరిశోధనలో తేలింది. స్మార్ట్‌ఫోన్లు యువత ఒకరితో ఒకరు గడిపే విధానాన్ని ప్రాథమికంగా మార్చేశాయని,

ముఖాముఖిగా కలుసుకోవడం తగ్గి, ఆన్‌లైన్‌లో ఎక్కువ సమయం గడపడం వల్ల సంతానోత్పత్తిపై ప్రభావం పడి ఉండవచ్చని వారు విశ్లేషించారు. అనేక దేశాల్లో స్మార్ట్‌ఫోన్‌ల వాడకం విస్తృతమైన తర్వాతే జననాల రేటు గణనీయంగా క్షీణించడం ప్రారంభమైనట్లు తేలింది. ముఖ్యంగా అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో 2007 తర్వాత ఈ మార్పు స్పష్టంగా కనిపించింది. స్మార్ట్‌ఫోన్లను ఎక్కువగా వినియోగించే యువతలో ఈ తగ్గుదల మరింత ఎక్కువగా ఉంది. ఫిన్లాండ్‌కు చెందిన జనాభా నిపుణురాలు అన్నా రోట్‌కిర్చ్ ప్రకారం యువతలో సోషల్ మీడియా వాడకం పెరగడం వల్ల జంటల మధ్య లైంగిక సమస్యలు కూడా పెరుగుతున్నాయని తెలుస్తోంది. సోషల్ మీడియాలో కనిపించే ఆడంబరమైన జీవనశైలి, ఆర్థికపరమైన ఆందోళనలు, ఇతరులతో పోల్చుకోవడం వంటివి యువతలో అభద్రతా భావాన్ని, అస్థిరతను పెంచుతున్నాయని, దీనివల్ల వారు పిల్లల్ని కనేందుకు సిద్ధపడటం లేదని ఆమె వాదిస్తున్నారు. గతంలో టీవీ సీరియళ్లలో చిన్న కుటుంబాలను చూసి మహిళలు తక్కువ మంది పిల్లల్ని కన్నట్టు కొన్ని అధ్యయనాలు తెలిపాయి.



# పూజార్లు,సేవాదారులపై దాఖలయిన పిల్‌కు సుప్రీం తిరస్కృతి

**న్యూఢిల్లీ, మే 18:** దేశవ్యాప్తంగా ప్రభుత్వ నియంత్రణలో ఉన్న ఆలయాల్లో పనిచేస్తున్న పూజారులు, సేవాదార్లు, ఇతర సిబ్బందికి ఏకరీతి వేతనాలు, సంక్షేమ ప్రణాళికను రూపొందించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ విషయంలో తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. న్యాయవాది అశ్విని ఉపాధ్యాయ్ ఈ పిల్ దాఖలు చేశారు. ప్రభుత్వ ఆధీనంలోని ఆలయాల్లో పనిచేస్తున్న పూజారులు, సిబ్బంది వేతనాలు, సేవా నిబంధనలను సమీక్షించేందుకు జ్యుడీషియల్ కమిషన్ లేదా నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని ఆయన తన పిటిషన్‌లో కోరారు. వేతనాల కోడ్ 2019లోని సెక్షన్ 2(కే) ప్రకారం పూజారులను, ఆలయ సిబ్బందిని ఉద్యోగులుగా గుర్తించి, వారికి కనీస వేతనం, ఇతర కార్మిక సంక్షేమ రక్షణలు కల్పించాలని అభ్యర్థించారు. ప్రభుత్వాలు ఆలయాలపై పరిపాలన, ఆర్థిక నియంత్రణ చేపట్టినప్పుడు ప్రభుత్వానికి పూజారుల మధ్య యజమాని ఉద్యోగి సంబంధం ఏర్పడుతుందని పిటిషనర్ వాదించారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ వంటి రాష్ట్రాల్లో పూజారులు, సిబ్బంది కేవలం రూ.1,000 నుంచి రూ.5,000 మధ్య ఉన్న నామమాత్రపు గౌరవ వేతనాలు, దక్షిణలపై ఆధారపడి జీవిస్తున్నారని, వారికి పెన్షన్, ఆరోగ్య సంరక్షణ వంటి సామాజిక భద్రత కూడా లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు ఆలయాల నియామకాలు, ఆదాయంపై పూర్తి నియంత్రణ కలిగి ఉంటూ, అక్కడి సిబ్బందికి కార్మిక సంక్షేమ ప్రయోజనాలు నిరాకరించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 21 కింద కల్పించిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమేనని ఆయన వాదించారు. అయితే, ధర్మాసనం ఈ పిల్ విచారణకు విముఖత వ్యక్తం చేయడంతో సంబంధిత అధికారులను ఆశ్రయించేందుకు స్వేచ్ఛనిస్తూ పిటిషన్‌ను ఉపసంహరించుకోవడానికి అనుమతి ఇవ్వాలని అశ్విని ఉపాధ్యాయ్ కోరారు. ఇందుకు ధర్మాసనం అంగీకరించింది. పిటిషనర్ ఉపసంహరించుకున్న కారణంగా ఈ వ్యాజ్యాన్ని కొట్టివేస్తున్నట్లు తన ఉత్తర్వుల్లో పేర్కొంది.



పెరుగుతున్న వేడి మనల్ని ఉక్కిరిబిక్కిరి చేసేస్తోంది కదూ ! దీనికి ఉక్కబోతకి చర్మం జిక్కడం, దద్దుర్లు, దురద సహా ఇంకెన్ని సమస్యలో! పోగొట్టుకోవడానికి

# వేడిమిని తట్టుకుందామిలా!

మార్కెట్‌లో బోలెడు ఉత్పత్తులు. కానీ ఖర్చేమో ఎక్కువ. దాన్ని తగ్గిస్తూ సహజ మార్గాలను ప్రయత్నిద్దాం. పనిమీద అలా బయటికి వెళ్లొచ్చామంటే చాలు. ముఖం ఎర్రగా కమిలిపోతుంది. కొందరిలో కాసేపటికి తగ్గుతుంది. కానీ చాలామందిలో దద్దుర్లు, చర్మమంతా నల్లగా మారడం లాంటివి కనిపిస్తాయి. తప్పించుకోవాలంటే ఇంటికి రాగానే ముఖాన్ని శుభ్రం చేసుకొన్నాక కలబంద గుజ్జును రాసి చూడండి. దీనిలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఈ సమస్యలన్నింటికీ చెక్ పెట్టేస్తాయి. గ్రీన్ టీని చల్లార్చి దూదితో రాసి, ఆరాక కడిగినా మంచిదే. ఇంట్లో ఉన్నా ఉక్కబోత తక్కువా? అదేమో చెమట కాయలు, దురదలకు దారితీస్తుంది. సాధారణంగా పౌడర్ చల్లుతుంటాం కదా? బదులుగా ఓట్‌మీల్‌ని ప్రయత్నించండి. దీన్ని మెత్తగా పౌడర్‌లా చేసుకుని, బకెట్ గోరువెచ్చని నీటిలో రెండు పెద్ద చెంచాలు కలపాలి. పావుగంట అలా వదిలేసి, ఆ నీటితో స్నానం చేయండి. ఇలా తరచూ చేస్తే సరి. చర్మానికీ పోషణ అందుతుంది. సమస్యా అదుపులోకివస్తుంది. చెమటకి జిడ్డుగా అనిపిస్తుందని మాయిశ్చరైజర్‌ని రాయడానికి సందేహించేవారే ఎక్కువ. దీంతో చర్మం నిర్జీవంగా, కళావిహీనంగా తయారవుతుంది. రాత్రుల్లు స్నానం చేశాకగానీ, ఉదయం స్నానానికి ముందుగానీ కొబ్బరి నూనెను ఒళ్లంతా పట్టించండి. నలుగుకు ముందులా కాకుండా రెండు మూడు చుక్కలు వేసు కుంటూ మృదువుగా రాసుకుంటూ వెళితే చాలు. దీనిలో సమృద్ధిగా ఉండే ఫ్యాటీయాసిడ్లు కావాల్సిన తేమను అందిసూనతనే చర్మం అందంగా, ఆరోగ్యంగా ఉండేలానూ చూస్తాయి. అదీ జిడ్డే అనిపిస్తే పుచ్చకాయ రసాన్ని రాసుకొని, ఆరాక కడిగినా చాలు. చిన్నవే కానీ.. చర్మసంరక్షణలో చూపే ప్రయోజనమెంతో. ఈ చిట్కాలతో వేసవి నుంచి చర్మాన్ని కాపాడుకుందాం.

# 'లగోరీ' ఆడదామా !



రెండు జట్లు.. ఏడు రాళ్లు లేదా పెంకులు.. ఒక టెన్నిస్ బంతి. ఆ రాళ్లను ఒకదానిపై ఒకటి టవర్‌లా పేర్చి ఒక జట్టు దాన్ని పడగొట్టి మళ్లీ కడుతూ ఉంటే ప్రత్యర్థి జట్టు ఈ రాళ్లను చెదర గొడుతూ ఉండాలి. ఆడటానికి ఓపిక ఉండాలే గానీ వయసుతో సంబంధం లేదు. ఆడేవాళ్లంతా చురుకుగా అలర్ట్‌గా ఉంటూ ఆ రాళ్లను పేరుస్తూ ఉంటే వేరే వాళ్ల చెదర గొడుతూ ఉంటారు. దీన్నే లగోరీ అనీ, ఏడు రాళ్లాట అనీ పిలు స్తారు. సరదాగా ఆరుబయట ఆడే ఈ లగోరీకి దేశ విదేశాల్లో కూడా మంచి క్రేజ్ ఉండని తెలుసా! అంతేనా.దీనికి జాతీయ స్థాయిలో ఛాంపియన్స్ ఉన్నారు. అంతర్జాతీయ స్థాయిలో టోర్నమెంట్లు జరుగుతాయి. దీనికి ప్రపంచ కప్ కూడా ఉంది. చాలా చోట్ల ఈ ఏడురాళ్లాటని విద్యాసంస్థల్లో కూడా భాగం చేశారట. ఇంత చరిత్ర ఉన్నఈ లగోరీ ద్వాపర యుగం నుంచే ఉందట. శ్రీకృష్ణుడు తన స్నేహితులతో ఎక్కువగా ఈ ఏడు పెంకులాటే ఆడేవాడట. దాన్ని రిఫరెన్స్‌గా తీసు కునే ఈ లగోరీని రూపొందించారట. గోవాలో జాతీయ క్రీడలకి ఒక ఆటని ఎంపిక చేయాల్సి వచ్చినప్పుడు అక్కడి క్రీడల మంత్రి ఈ లగోరీని ఎంపిక చేశాడట. ఆ తర్వాత దీన్ని గురించి ప్రధానమంత్రి మోదీ కూడా మన్‌కీబాత్‌లో ప్రస్తావించి తన చిన్ననాటి రోజులను గుర్తుచేసుకున్నారు. ఇంతటి చరిత్ర గల ఈ ఏడు రాళ్లాట మన భారత సంతతికి చెందినది. తలుచుకుంటేనే ఎంతో గర్వంగా అనిపిస్తుంది కదూ.. ఇంకెందుకు ఆలస్యం.. ఈ లగోరీని పిల్లలకి నేర్పించండి. ఈ వేసవి సాయంత్రాల్లో మీరూ వాళ్లతో కలిసి ఆడేసేయండి.



# నచ్చింది తిందాం ..

బరువు పెరిగిపోతామే మోనని నచ్చినవి తినడం మానేస్తుంటాం కొందరు. డైటింగ్ పేరుతోనోరు కట్టే సుకుంటారు మరి కొందరు. లావైతే శరీరాన్ని అసహ్యించు కునే వారూ లేకపోలేదు. ఇవన్నీ ఆరోగ్యాన్నే కాదు.. మనసునూ దెబ్బతీస్తాయి. కోరి కోరి ఈ సమస్యల్ని కొనితెచ్చుకోవడం కంటే నిచ్చనవి తింటూ, ఎలా ఉన్నా శరీరాన్ని అంగీకిరస్తే అంతకంటే ఆరోగ్యం ఇంకే ముంటుంది? ఇదే పాజిటివిటీని చాటి చెబుతోంది.

సరైన ఆహార నియమాలు పాటించేలా అందరిలో అవగాహన కల్పించడం వ్యక్తిగత అవసరాల రీత్యా ప్రత్యేకమైన ఆహార నియమాలు పాటించేవారు. ఈ రోజు మాత్రం ఇవన్నీ పక్కన పెట్టి నచ్చిన ఆహారం తీసుకునేలా ప్రోత్సహించడం. విభిన్న శరీరతత్వాలు, శరీరాకృతుల్ని ప్రోత్సహిస్తూ.. స్వీయ ప్రేమను పెంచుకునేలా వెన్నుతట్టడం. బాడీ షేమింగ్, ఫ్యాట్ షేమింగ్..వంటి వివక్షను అంతమొందించేలా చర్యలు తీసుకోవడం. వేగంగా బరువు తగ్గేందుకు ఉపయోగపడే క్రాష్ డైట్లతో తలెత్తే సమస్యలపై అవగాహన పెంచడం. వివిధ రకాల ఈటింగ్‌న డిజార్డర్లతో బాధపడుతోన్న వారిని చేరదీసి.. ఆయా సమస్యల నుంచి బయటపడేసేందుకు వారికి సహకరించడం. కార్యాలయాల్లో / పని ప్రదేశాల్లో.. సహోద్యోగుల్ని బాడీ షేమింగ్ చేయకుండా.. వాళ్లలో ఉన్న ప్రత్యేకమైన నైపుణ్యాల్ని, వాళ్ల సాధించే విజయాల్ని ప్రశంసించడం..



**స్వీయ ప్రేమను పెంపొందించు కోవాలంటే నియమాలు..**

.కొవ్వులు, క్యాలరీలు సంగతి పక్కన పెట్టి.. మనసుకు నచ్చిన ఆహారం తీసుకోవాలి. తద్వారా మనసు, జిహ్వా. రెండూ తృప్తి పడతాయి. బరువు తూచుకోవడాలు, నడుం కొలుచుకోవడాలు, తమను తాము విమర్శించుకోవడం.. వంటివన్నీ పక్కన పెట్టి మిమ్మల్ని మీరు నిజాయితీగా స్వీకరించండి. ఆ క్షణం మనసు ఎంతసంతోష పడుతుందో స్వయంగా ఆస్వాదించచ్చు. ప్రతి ఒక్కరిలోనూ ఏదో ఒక ప్రత్యేకత దాగుంటుంది. దాన్ని వెలికి తీయండి. మీకు మీరు కొత్తగా కనిపిస్తారు. పాజిటివిటీ తో అడుగు ముందుకు వేయగలుగుతారు. వంట రాని వారు కూడా నచ్చిన రెసిపీ తయారు చేసుకోవడానికి ఆసక్తి చూపు తారు. ఈ రోజున మీరూ అలాంటి ప్రయత్నమే చేయచ్చు. ఇది మీకు కొత్త అనుభూతిని అందించడమే కాదు. మీలో ఉన్న పాక శాస్త్ర నైపుణ్యాలూ మీకు అవగతమవు తాయి. అయినా వంటను మించిన థెరపీ మరేముంది చెపనపండి? □

# సెల్ఫ్‌కేర్ అవసరం..

ముస్తాబు పూర్తయ్యాక అద్దంలో చూసుకుంటే 'అరె భలే అందంగా ఉన్నానే' అని ఎప్పుడైనా అనిపించిందా? క్షణం తెలియకుండానే ముఖంలో చిరునవ్వు విరియడమే కాదు, ఒత్తిడి స్థాయీ తగ్గుతుందట. మనపై మనం చూపించే ప్రేమ మహత్తే అది. కొనసాగాలా.. సెల్ఫ్‌కేర్ అవసరం.. ఎవ్రీథింగ్ షవర్'ని ప్రయత్నించండి. ఇప్పుడిదో ట్రెండ్ కూడా! అసలేమిటిది అంటే.. సాధారణంగా వేడుకలు, పండగలు ఉన్నప్పుడు ఆడవాళ్ల స్వీయశ్రద్ధ పెట్టడం మామూలే మిగతారోజుల్లో సమయం లేదని తాము పట్టించుకోరు. దాంతో శారీరకంగానే కాదు, మానసికంగానూ సమస్యలు కొనితెచ్చుకంటారు. వారికి సెల్ఫ్‌కేర్‌ని అలవాటు చేసే క్రమంలో రూపుదిద్దు కుందే.. ఈ ఎవ్రీథింగ్ షవర్! దీనికిగానూ.. వారంలో ఒకరోజు కేటాయించాలి ఆరోజు.. గబగబా స్నానం ముగించే ద్దామన్న తొందరొద్దు. స్నానాల గదిలో సెంటెడ్ క్యాండిల్స్ లేదా నచ్చిన పరిమళాన్ని చల్లుకోవాలి. ఈ సువాసనలు మనసును తేలికపరుస్తాయి. ఆపై మరీ చల్లగా, వేడిగా కాకుండా గోరువెచ్చని నీటిని సిద్ధం చేసుకోండి. దానిలో ఎసెన్షియల్ అయిల్ లేదా బాతింగ్ సాల్ట్ వేసుకోండి. ఇప్పుడు నచ్చిన బాడీవాష్ లేదా సబ్బుతో నింపాదిగా స్నానం చేయండి. శరీరానికి తాజాదనం అందడమే కాదు, మనసులోని ప్రతికూల భావనలూ తొలగిపోతాయి అంటున్నారు నిపుణులు. ఇప్పుడు బాడీస్క్రబ్ కాదంటే సున్నిపిండి లేదా బియ్యప్పిండితో శరీరమంతా మృదువుగా రుద్దేయండి. మృతకణాలుంటే తొలగి, మృదువైన చర్మం సొంతమవుతుంది. మందమైన చర్మముండే మోకాళ్లు, మోచేతులు, పాదాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి మరి. అవాంఛిత రోమాలను తొలగించుకోవాల్సింది కూడా ఇప్పుడే.



ఇక కురులు.. ఎప్పటిలా ఆదరాబాదరాగా కాకుండా మృదువుగా మసాజ్ చేస్తూ షాంపూను పట్టించాలి. వలయాకారంలో తలంతా రుద్దడం అయ్యాక నీటితో కడిగేయాలి. ఎంత విశ్రాంతిగా అనిపిస్తుందో? అయితే కండిషనర్ పెట్టడం మాత్రం మర్చిపోవద్దు. చివర్లో ఓ మగ్గు చల్లటి నీళ్ల తలమీదుగా పోసుకోండి హాయితోపాటు కుదుళ్లకీ మేలు చేకూరుతుంది. ఇక చివరగా.. తడి లేకుండా తుడచి, మాయిశ్చరైజర్ లేదా బాడీ ఆయిల్ రాయాలి. తేమ అందడమే కాదు, మేనికి మెరుపూ వస్తుంది. ఈ మొత్తం ప్రక్రియకు మహా అయితే 20-30 నిమిషాలు పడుతుంది. కానీ.. శరీరమూ, మనసూ తేలికపడతాయి. అందుకే ఇది ట్రెండ్‌గా మారి యువతను ఆకర్షిస్తోంది మీరూ ప్రయత్నించి చూడండి మరి. □

# తోతాపురి మామిడి పచ్చడి



**కావాల్సి నవి :** తోతాపురి పచ్చి మామిడికాయ-ఒకటి, అల్లం-చిన్నముక్క, పచ్చిమిర్చి-నాలుగు, నువ్వులు-రెండు టేబుల్‌స్పూన్లు, ఉప్పు-తగినంత, తాలింపు కోసం, జీలకర్ర, ఆవాలు-అర టీస్పూన్ చొప్పున, ఎండుమిర్చి- ఒకటి.

**తయారీ :** మామిడికాయ చెక్కు తీపి చిన్న ముక్కలుగా కోసుకుని పక్కన పెట్టుకోవాలి. అల్లం ముక్కను శుభ్రంగా కడిగి తురమాలి. కడాయిలో నూనె వేడిచేసి పచ్చిమిర్చి, అల్లం తురుము వేసి వేయించాలి. తర్వాత మామిడిముక్కలు, ఉప్పు వేసి మరికాసేపు వేయించాలి. మామిడి ముక్కలు మెత్తగా అయ్యేంత వరకు ఉడికించి చల్లార్చాలి. నువ్వులను నూనెలేకుండా వేయించి పక్కన పెట్టు కోవాలి. ఇప్పుడు ఉడికించిన మామిడిముక్కలు, అల్లం తురుములో నువ్వులు వేసి మిక్సీ జార్‌లో మెత్తగా పేస్టు చేయాలి. కడాయిలో నూనె వేడిచేసి ఆవాలు, జీలకర్ర ఎండుమిర్చి వేసి తాలింపు పెట్టాలి. ఇది అన్నంలోకే కాకుండా చపాతీల్లోకి బాగుంటుంది. □

# దేవుడికి అంతా తెలుసు

పిల్లాడు ఒక పదునైన కత్తి చేతిలో పెట్టుకుని కనిపించాడు అది మెరుస్తోంది. అందుకే కావాలి. తండ్రి చూశాడు. ఇంకా ఏమైనా వుందా? నాక్‌గా ఆకత్తిని చిన్నోడి చేతి నుండి తీసేసుకున్నాడు. ఆ పిల్లడు ఏడుపు ప్రారంభించాడు. తన తండ్రి దుర్మార్గుడనీ తన ఆటను పాడుచేశాడనీ తిట్టుకుంటాడు. కానీ ఆ తండ్రికి తెల్సు, ఆకత్తినితన కొడుకుని గాయపరుస్తుందని . అలాగే దేవుడు కూడా అంతే మనకు మంచి వారుగా కనిపించే మనుషుల్లో విషం మారి మనస్సు ల్లో నిండి వుండ వచ్చును ఆ విషం మనకు తెలియకుండానే ఎంతో అపకారం చేస్తుందని ఆ దైవానికి మాత్రమే తెల్సు వారంటే మనకు ఎంతో ప్రాణం. ఇష్టం అయినా భగవాన్ మనకు దూరం చేస్తాడు. మనకు ఇష్టం లేకపోయినా దూరంగావిస్తాడు. నీ చేతిలో వున్న మట్టి పాత్రను దేవుడు నేలకేసి కొట్టాడనే అనుకోండి. అంటే నిన్ను ఏ పాత్రాలేకుండా ఉంచాలని ఆయన ఉద్దేశ్యం కాదు సుమా! నీకు ఒక బంగారు పాత్ర ఇవ్వబోతున్నాడన్నమాట.మనకు ఇష్టమైనవిపోగానే మనం ఏడుస్తాము కానీ మనకు అవసరమైనది మాత్రం కచ్చితంగా ఇస్తాడు. ఆయన చేతులు మన్నల్ని రక్షించేవి మాత్రంమే.

**- డా॥ పులివర్తి కృష్ణమూర్తి**

తెర

## 'పురుష' ఫ్యామిలీ చిత్రం: పవన్ కళ్యాణ్ బత్తుల



పవన్ కళ్యాణ్ బత్తుల హీరోగా బత్తుల సరస్వతి సమర్పణలో కళ్యాణ్ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద బత్తుల కోటేశ్వరరావు'పురుష: సినిమాను నిర్మించారు. ఈ మూవీకి వీరు వులవల దర్శకత్వం వహించారు.

**మీ నేపథ్యం చెప్పండి?..**

మాది పల్నాడులోని మాచర్ల దగ్గర్లోని కారంపూడి. మాకు సినిమా ఇండస్ట్రీతో ఎలాంటి రిలేషన్ లేదు. మా నాన్న కన్‌స్ట్రక్షన్ ఫీల్డ్‌లో ఉన్నారు.

**మీ పేరు వెనకాల ఉన్న స్టోరీ చెప్పండి? ఈ ఇండస్ట్రీలోకి రావాలన్నది ఎవరి ఆలోచన?..**

మా నాన్న 'గోకులంలో సీత'సినిమా చూశారు. అప్పటికి నేను ఇంకా పుట్టలేదు. అయితే 'తమ్ముడు' టైంలో పుట్టాను. నాకు పవన్ కళ్యాణ్ అని పేరు పెట్టారు. నన్ను హీరో చేయాలన్నది మా నాన్న కల.

**నటనలో శిక్షణ తీసుకున్నారా?..**

వైజాగ్‌లో సత్యానంద్ వద్ద యాక్టింగ్‌లో శిక్షణ తీసుకున్నారు. సర్ ఉండే కమ్యూనిటీలోనే నేను కూడా ఉన్నాను. నాలుగు నెలలు ఆయనతోనే కలిసి ఉన్నాను.

**'పురుష'కథనే ఎందుకు ఎంచుకున్నారు?..**

డీఓపీ సతీష్ వల్లే ఈ ప్రాజెక్ట్ మా దగ్గరకు వచ్చింది. సినిమాలతో ప్రేక్షకులకు మంచి వినోదాన్ని అందించాలని అనుకున్నాం.

**సీనియర్ ఆర్టిస్టులతో కలిసి నటించడం ఎలా అనిపించింది?..**

'పురుష'లో చాలా మంది సీనియర్ ఆర్టిస్టులున్నారు. అందరూ నాకు ఎంతో సహకరించారు. మరీ ముఖ్యంగా సప్త గిరి అన్నా, కసిరెడ్డి అన్నా ప్రతీ ఒక్క విషయంలో హెల్ప్ చేశారు.

**'పురుష'లో మెయిన్ పాయింట్స్ ఏంటి?..**

పురుష: చిత్రంలో అన్ని పాత్రలకు సమానమైన ప్రాధాన్యం ఉంటుంది. 'క్షేమంగా వెళ్లి లాభంగా రండి' సినిమాని ఆడియెన్స్ ఎంతో ఎంజాయ్ చేశారు. మా సినిమా కూడా అన్ని వర్గాల ఆడియెన్స్‌ని ఆకట్టుకుంటుంది.

**దర్శకుడితో వర్క్ ఎక్స్‌పీరియెన్స్ చెప్పండి?..**

వీరు అన్న నాకు ఎంతగానో సపోర్ట్ చేశారు. నేను చాలా ఇంట్రోవర్ట్‌గా ఉండేవాడ్ని. నన్ను నా కంఫర్ట్ జోన్ నుంచి బయటకు తీసుకు వచ్చారు.


**మీకు ఎలాంటి జానర్స్ అంటే ఇష్టం?..**

నా ఫ్రెండ్స్ ఎక్కువగా యాక్షన్ చిత్రాలు చేయమని సలహాలు ఇస్తుంటారు. కానీ ఏ జానర్‌లో సినిమా చేసినా కూడా ప్రేక్షకుల్ని ఎంటర్టైన్ చేయాలన్నదే లక్ష్యం.

**'పురుష' గురించి ఆడియెన్స్‌కి ఏం చెబుతారు? నెక్స్ట్ ప్రాజెక్ట్ గురించి చెప్పండి?..**

'పురుష' సినిమాని ఇప్పటి వరకు చూసిన వారంతా మెచ్చుకున్నారు. కచ్చితంగా విజయం సాధిస్తుందని అన్నారు.

# 21న Chiru158 ఘనంగా ప్రారంభం



జిమ్ సెషన్ వీడియోలో మెగాస్టార్ ఇంటెన్స్ ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్ రివీల్ మెగాస్టార్ చిరంజీవి మరోసారి సక్సెస్‌ఫుల్ దర్శకుడు బాబీ కొల్లితో చేతులు కలుపుతున్నారు. ప్రతిష్టాత్మక కెవిఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె నారాయణ నిర్మిస్తున్న ఈ భారీ కమర్షియల్ ఎంటర్‌టైనర్ ఈ ప్రకటనను చిరంజీవి స్వయంగా ఒక పవర్‌ఫుల్ జిమ్ వీడియో ద్వారా రివీల్ చేశారు. ఆ వీడియోలో ఆయన చూపించిన డెడికేషన్, ఇంటెన్స్ వర్కౌట్స్ అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. కొత్త లుక్ కోసం ఆయన పడుతున్న కష్టం, ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కోసం చేస్తున్న ట్రైనింగ్ ఈ సినిమాలో ఉండబోయే హై వోల్టేజ్ యాక్షన్‌కు హింట్ ఇస్తోంది. వీడియోలో మెగాస్టార్ చిరంజీవి మాట్లాడుతూ... గెట్టింగ్ రెడీ ఫర్ 158.. బాబీ.. 21 ముహూర్తం.. కెవిఎన్ ప్రొడక్షన్స్ వారిది..అంటే ఇంకో నాలుగైదు రోజుల్లో కలుస్తున్నాం. గెట్ రెడీ .ఇప్పటికే మేకర్స్ విడుదల చేసిన కాన్సెప్ట్ పోస్టర్, లుక్ టెస్ట్ ఇమేజ్ సినిమాపై భారీ అంచనాలు పెంచాయి. 'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత చిరంజీవిబాబీ కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుండటంతో అభిమాను ల్లో ఆసక్తి మరింత పెరిగింది. మాస్ ఎలిమెంట్స్‌తో కథలను పవర్‌ఫుల్‌గా తెరకెక్కించడంలో పేరున్న బాబీ కొల్లి, ఈసారి చిరంజీవిని మరింత ఇంటెన్స్, పవర్‌ఫుల్ క్యారెక్టర్‌లో చూపించ బోతున్నారు. ఈ చిత్రం భారీ యాక్షన్ ఎపిసోడ్స్, ఎలక్ట్రిఫై చేసే ఎలివేషన్స్, అభిమానులను అలరించే మాస్ మూమెంట్స్‌తో ఉండబోతోంది.

# 29న శ్రద్ధాదాస్ 'త్రికాల' విడుదల



భారతీయ సనాతన ధర్మంలో దాగి ఉన్న రహస్యాలను ఆధారంగా చేసుకుని రూపొందిన మైథలాజికల్ ఫిక్షనల్ థ్రిల్లర్'త్రికాల' మే 29న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. హీరోయిన్ శ్రద్ధదాస్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో మాస్టర్ ఫేమ్ మహేంద్రన్, అజయ్, సీనియర్ నటి ఆమని కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి మణి తెల్లగూటి కథ, దర్శకత్వం వహించగా, రాధిక- శ్రీనివాస్ నిర్మించారు. ఈ సినిమా నచ్చడంతో చాగంటి ప్రొడక్షన్ ఎల్ఎల్‌పి ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నది. ఇటీవలి కాలంలో మైథలాజికల్ టచ్‌తో వచ్చిన థ్రిల్లర్ చిత్రాలకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తుండటంతో 'త్రికాల' పై కూడా ఇండస్ట్రీలో ఆసక్తికర చర్చ మొదలైంది. ఈ సందర్భంగా దర్శకుడు మణి తెల్లగూటి మాట్లాడుతూ.. ప్రపంచంపై చీకటి కమ్ముకున్న సమయంలో వెలుగుగా అవతరించే శక్తి చుట్టూ 'త్రికాల' కథ తిరుగుతుంది. భారతీయ సనాతన ధర్మంలో దాగి ఉన్న కొన్ని ఆధ్యాత్మిక రహస్యాలను థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో మిళితం చేసి తెరకెక్కించాం. నిర్మాతలు మాట్లాడుతూ..సరికొత్త కాన్సెప్ట్‌తో, మైథలాజికల్ టచ్‌తో రూపొందిన 'త్రికాల' ప్రతి వర్గం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. సంస్కృతి, ఆధ్యాత్మికత, ఆసక్తి.. వంటి అంశాలు కలిసిన ఈ కథ ప్రేక్షకులకు కొత్త ఫీలింగ్ ఇస్తుంది" అని పేర్కొన్నారు. ఈ సినిమాకు హార్షవర్ధన్ రమేశ్వర్ సంగీతం అందిస్తున్నారు. 'త్రికాల'కు కూడా మంచి మ్యూజిక్ అందించారు. టాలీవుడ్‌లో శ్రద్ధదాస్ సిద్ధు ఫ్రమ్ శ్రీకాకుళం సినిమాతో హీరోయిన్‌గా పరిచయమై, తరువాత ఆర్య 2 ద్వారా మంచి గుర్తింపు సంపాదించింది.

# 'ది రెడ్ బ్యాగ్' చిత్రంలో కీలక పాత్రలో రాశీ



మెమరీ మేకర్స్ బ్యానర్ మీద డిఫరెంట్ కాన్సెప్ట్, కంటెంట్‌తో కొత్త నిర్మాత హారికృష్ణ సోమిశెట్టి 'ది రెడ్ బ్యాగ్' అనే సినిమాని నిర్మిస్తున్నారు. బ్యాగ్ చుట్టూ తిరిగే ఈ మూవీకి రవి కుమార్ సీరపు కథ, కథనం, దర్శకత్వ బాధ్యతల్ని నిర్వర్తిస్తున్నారు.ఈ చిత్రంలో కబీర్ సింగ్, ప్రసాద్ బెహరా, రాధ్య, మోనిక, స్నేహా సింగ్, ఆకాంక్ష, ఈషాన్ శంకర్, అవినాష్ బదల్, భార్గవి తదితరులు ముఖ్య పాత్రల్ని పోషించారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పోస్టర్లు సినిమాపై అంచనాల్ని పెంచేశాయి. తాజాగా ఈ సినిమా నుంచి స్పెషల్ రోల్ పోషిస్తున్న రాశీ పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు.సావిత్రి పాత్రలో రాశీ 'ది రెడ్ బ్యాగ్' సినిమాలో ఓ పవర్ ఫుల్ రోల్‌ను పోషించారు. ఇక ఈ పాత్రకు సంబంధించిన గెటప్, లుక్స్ ఎంత సింపుల్‌గా ఉన్నాయో.. ఆమె లుక్ అంత ఇంటెన్స్‌గా ఉంది. ఈ చిత్రాన్ని మలుపు తిప్పే ఓ కీలక పాత్రలో రాశీ నటించారు. ప్రస్తుతం ఈ చిత్రాన్ని త్వరలోనే రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే టీజర్‌ను రెడీ చేస్తున్నట్టుగా టీం తెలిపింది. ఇక టీజర్‌తో మూవీపై మరింత బజ్ క్రియేట్ కానుంది. తొలి సినిమానే అయినా, నిర్మాత హారికృష్ణ సోమిశెట్టి ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా భారీ బడ్జెట్‌తో చిత్రాన్ని నిర్మించారు. ఈ మూవీకి శేఖర్ మోపురి సంగీతమందించగా.. ప్రియేష్ గురుసామి కెమెరామెన్‌గా, శివ శర్వాని ఎడిటర్‌గా పని చేశారు.

# ' సెయాన్' షూటింగ్ నేడు ప్రారంభం




వెర్సటైల్ స్టార్ శివకార్తికేయన్, కమల్ హాసన్, ఆర్ మహేంద్రన్ నిర్మిస్తున్న 'సెయాన్' ప్రాజెక్ట్ కోసం దర్శకుడు శివకుమార్ మురుగేశన్‌తో చేతులు కలిపారు. బాక్సాఫీస్ వద్ద ఘన విజయం అందుకున్న ' అమరన్' తర్వాత రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌లో శివకార్తికేయన్ చేస్తున్న చిత్రమిది. శివకార్తికేయన్ పుట్టినరోజున విడుదల చేసిన ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌కు అద్భుతమైన స్పందన లభించింది.ఈ రోజు నుంచి ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. ఈ విషయాన్ని మేకర్స్ ఓ ఇంటెన్స్ పోస్టర్ ద్వారా అధికారికంగా ప్రకటించారు. పోస్టర్‌లో శివకార్తికేయన్ రా అండ్ పవర్‌ఫుల్ లుక్‌లో కనిపిస్తున్నారు. ఆయన కళ్లలో కనిపిస్తున్న ఆగ్రహం క్యారెక్టర్ పవర్‌ని చూపిస్తున్నాయి. ఈ పోస్టర్ సినిమా ఆధ్యాత్మికతతో పాటు మాస్ యాక్షన్ ఎలిమెంట్స్‌ను కూడా కలిగి ఉంటుందనే సంకేతాలు ఇస్తోంది.ఈ చిత్రాన్ని భారీ రూరల్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నారు. ఎమోషన్స్, మాస్ అప్పీల్, అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే ఎంటర్టైనర్ గా సినిమా రూపొందనుంది.ఈ చిత్రానికి సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్నారు. వివేక్ విజయకుమార్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తుండగా, షాన్ లోకేష్ ఎడిటింగ్ చేస్తున్నారు. యాక్షన్ డైరెక్టర్‌గా సుప్రీమ్ సుందర్ పని చేస్తున్నారు. ప్రొడక్షన్ డిజైన్‌ను అరుణ్ వెంకటరాముడి రూపొందిస్తున్నారు.

# సమ్మర్ బ్లాక్ బస్టర్ 'గోదారి గట్టుపైన'



'గోదారి గట్టుపైన' నాకు కొత్త ఆడియన్స్‌ను పరిచయం చేసింది. ఫ్యామిలీలతో థియేటర్లు కలకలలాడడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది: థాంక్ యూ మీట్‌లో హీరో సుమంత్ ప్రభాస్ యంగ్ హీరో సుమంత్ ప్రభాస్ సమ్మర్ బ్లాక్ బస్టర్ 'గోదారి గట్టుపైన' సుభాష్ చంద్ర దర్శకత్వంలో రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ నిర్మించింది. నిధి ప్రదీప్ ఈ చిత్రంలో కథానాయికగా నటించగా, జగపతి బాబు కీలక పాత్రలో కనిపించారు. మే 8న వరల్డ్‌వైడ్ రిలీజ్ అయిన ఈ చిత్రం సమ్మర్ కూల్ ఎంటర్టైనర్ గా అలరించి థియేటర్స్‌లో సక్సెస్ ఫుల్ గా రన్ అవుతోంది.. ఈ సందర్భంగా మేకర్స్ థాంక్స్ మీట్ నిర్వహించారు. థ్యాంక్స్ మీట్‌లో హీరో సుమంత్ ప్రభాస్ మాట్లాడుతూ..'అందరికీ నమస్కారం. మా కంటెంట్‌ను ఎంతో స్ట్రాంగ్‌గా సపోర్ట్ చేస్తున్న మీడియాకు థ్యాంక్స్. హీరోయిన్ నిధి ప్రదీప్ మాట్లాడుతూ.. అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. మాయ క్యారెక్టర్‌కు వస్తున్న రెస్పాన్స్ ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. నిర్మాత అభినవ్ రావు మాట్లాడుతూ.. మోత్ టాక్‌తోనే ఇలాంటి సినిమాలు నిలబడతాయి. ప్రేక్షకులు ఇచ్చిన రెస్పాన్స్‌తో మేము చాలా హ్యాపీగా ఉన్నాం. డైరెక్టర్ సుభాష్ చంద్ర మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. సచిన్ టెండూల్కర్ ఒక మంచి మాట అన్నారు.. 'ఎవరైనా రాళ్లు విసిరితే, ఆ రాళ్లతోనే మైయిలురాయి చేసుకోండి, అని.'గోదారి గట్టుపైన్న మాకు అలాంటి మైలు రాయి. దేవి ప్రసాద్ మాట్లాడుతూ.. నిర్మాతలు లాభాల దిశగా సాగుతుండటం చాలా ఆనందంగా ఉంది. రేణు మాట్లాడుతూ..మా సినిమాను ఆదరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు.

# ఇషాన్‌దార్ : ప్లే ఆఫ్‌లో సన్‌రైజర్స్



**చెన్నై:** ఇషాన్ కిషన్(47 బంతుల్లో 70 రన్స్; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) షాన్‌దార్ ఇన్నింగ్స్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్లే ఆఫ్ బెర్త్ అందుకుంది. చెన్నై సూపర్ కింగ్స్‌ను దాని సొంతగడ్డపై 5 వికెట్ల తేడాతో ఓడించింది. 181 పరుగుల లక్ష్యాన్ని మరో ఓవర్ ఉండగానే అందుకుంది. ఈ విజయంతో ఆరెంజ్ టీమ్ 16 పాయింట్లకు చేరు కోవడంతో గుజరాత్‌తో పాటు సన్‌రైజర్స్ ప్లే ఆఫ్‌బెర్తులు ఖరారయ్యాయి. చెన్నై సూపర్ కింగ్స్ 12 పాయింట్లకే పరిమితమై ప్లే ఆఫ్‌కు దూరమైంది.

181 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ కొనసాగించిన సన్‌రైజర్స్ ఆరంభంలోనే ట్రావిస్ హెడ్(6) వికెట్ కోల్పోయింది. అభిషేక్ శర్మ(26) పరవాలేదనిపించాడు. ఈ దశలో ఇషాన్ కిషన్, హెన్రీ క్లాసెన్(26 బంతుల్లో 47; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు).. మూడో వికెట్‌కు 75 పరుగులు జోడించి ఆదుకున్నారు. ఈ క్రమంలో క్లాసెన్ స్టంపవుటవగా, నితీష్(13) కూడా వెంటనే అవుటవడంతో మ్యాచ్ ఉత్కంఠకు చేరింది. మరోవైపు నిలకడగా బ్యాటింగ్ చేసిన ఇషాన్ కిషన్ అర్ధ సెంచరీ చేయడంతో పాటు ముకేష్ 18వ ఓవర్లో 4, 6సిక్స్‌తో గెలుపుకు చేరువచేశాడు. 19వ ఓవర్ తొలి బంతికి అరోరా సిక్స్ బాదాడు. మూడో బంతికి కిషన్ అవుటైనా, చివరి బంతికి రవిచంద్రన్ బౌండరీతో ఫినిషింగ్ టచ్ ఇచ్చాడు.



అంతకుముందు మొదట బ్యాటింగ్ చేసిన సీఎస్‌కే 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 180 పరుగుల స్వల్ప స్కోరుకే పరిమితమైంది. నితీష్ వేసిన తొలి ఓవర్లో సంజూ(13 బంతుల్లో 27)ఎదురుదాడికి దిగాడు. తొలి బంతికి సిక్స్, ఆ తర్వాతి బంతికి బౌండరీ బాదిన సంజూ.. చివరి బంతికి మరో ఫోర్‌తో 17రన్స్ సాధించాడు. ఇక ప్రఫుల్ ఓవర్లో వరుసగా మూడు బౌండరీలతో చెలరేగాడు. ఈ దశలో బౌలింగ్‌కు వస్తూనే కమిన్స్.. డేంజరస్ సంజూను అవుట్ చేసి సన్‌రైజర్స్‌కు బ్రేక్ ఇచ్చాడు. ఉర్విల్(13) కూడా వస్తూనే బ్యాక్ టు బ్యాక్ సిక్స్‌లతో అలరించినా... అతని ఇన్నింగ్స్‌కు సాకిబ్ తెరదించాడు.

**మిడిల్ ఆర్డర్ తడబాటు:** వన్ డౌన్‌లో వచ్చిన కార్తీక్ శర్మ(32) అదిరిపోయే హిట్టింగ్‌తో 3 ఫోర్లు, 2 సిక్సర్లు బాది మంచి ఊపులో కనిపించాడు. ప్యాట్ కమిన్స్ రెండోసారి బౌలింగ్‌కు వచ్చి చెన్నైని దెబ్బకొట్టాడు. మొదట కార్తీక్‌ను, ఆ తర్వాతి బంతికే రుతురాజ్ గైక్వాడ్ (15)ను అవుట్ చేశాడు.

**బ్రెవిస్ షో.. చివర్లో దూబే మెరుపులు:** వరుసగా వికెట్లు పడుతున్నా.. క్రీజ్‌లోకి వచ్చిన బ్రెవిస్(27 బంతుల్లో 44) సన్‌రైజర్స్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. గ్రౌండ్ నలుమూలలా షాట్లు ఆడుతూ స్కోరును పరిగెత్తించాడు. ఆ తర్వాత వచ్చిన శివమ్ దూబే(26) కూడా ఓ చేయి వేయడంతో చెన్నై 180 మార్క్‌ను అందుకుంది. సన్‌రైజర్స్ బౌలర్లలో కమిన్స్ 3 వికెట్లు, సాకిబ్ 2 వికెట్లు...ప్రఫుల్, మలింగ చెరో వికెట్ పడగొట్టి చెన్నైను కట్టడి చేశారు.

ఆట

# రికార్డుల వండర్



(వార్త క్రీడా విభాగం)

వైభవ్ సూర్యవంశీ.. ఈ 15 ఏళ్ల క్రికెట్ వండర్ ముందు రికార్డులు మోకరిల్లుతున్నాయి. తాజాగా ఐపీఎల్‌లో ఒకే సీజన్‌లో అత్యధిక సిక్స్‌లు బాదిన భారత క్రికెటర్‌గా నిలిచాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్‌లో బాదిన మూడు సిక్స్‌లతో కలుపుకుని సిక్సర్ల సంఖ్య 44కు చేరింది. ఇప్పటివరకు ఈ రికార్డు అభిషేక్ శర్మ(2024, 42 సిక్స్‌లు) పేరిట ఉండేది. శ్రేయస్ అయ్యర్(2025, 39 సిక్స్‌లు), విరాట్ కోహ్లీ(2024, 38 సిక్స్‌లు) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఐపీఎల్ ఒక సీజన్‌లో అత్యధిక సిక్స్‌ల రికార్డు ఇప్పటికీ క్రిస్ గేల్(59) పేరిటే ఉంది. మరో రెండు మ్యాచ్‌లు ఆడాల్సిన వైభవ్.. ఈ ఫీట్‌ను అందుకున్నా ఆశ్చర్యం లేదు.

భారత యువ క్రికెట్‌లో ఇటీవలి కాలంలో ప్రత్యేకంగా నిలుస్తున్న పేరు వైభవ్ సూర్యవంశీ. చిన్న వయస్సులోనే అతడు చూపిస్తున్న స్థిరమైన బ్యాటింగ్ ప్రతిభ క్రికెట్ అభిమానులను ఆకట్టుకుంటోంది. ఒత్తిడిని తట్టుకుని ఇన్నింగ్స్‌ను నిర్మించగల సామర్థ్యం అతనిని భవిష్యత్ స్టార్‌గా నిలబెడుతోంది. పవర్ హిట్టింగ్‌పై మాత్రమే ఆధారపడకుండా, బంతిని గమనించి సరైన షాట్లను ఆడటం అతని ప్రత్యేకత. యువ వయస్సులోనే ఒత్తిడి పరిస్థితుల్లో నిలబడటం వైభవ్ మానసిక దృఢత్వాన్ని తెలియజేస్తోంది.

గత ఏడాది ఐపీఎల్ అరంగేట్రంతోనే సంచలన తారగా ఆవిర్భవించిన వైభవ్.. ఏడు మ్యాచ్‌ల్లో 206 స్ట్రయిక్ రేట్‌తో 252 పరుగులు సాధించాడు. అందులో ఓ సెంచరీ, ఓ అర్ధసెంచరీ ఉన్నాయి. ఏడు మ్యాచ్‌ల్లో 24 సిక్స్‌లు బాదాడు. ఈ ఐపీఎల్ సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ జట్టులో కీలక ఆటగాడిగా మారాడు. గతంలో కంటే స్థిరంగా ఆడుతున్నాడు. 12 మ్యాచ్‌ల్లో సింగిల్ డిజిట్ స్కోర్లు కేవలం మూడు సార్లే. మొత్తంగా ఈ సీజన్‌లో 12మ్యాచ్‌లాడిన వైభవ్ 234.78 స్ట్రయిక్‌రేట్‌తో 486 రన్స్ సాధించాడు. అందులో ఓ సెంచరీ, మరో అర్ధసెంచరీ ఉన్నాయి. 43 ఫోర్లు, 44 సిక్స్‌లు బాదాడు. ఇండియన్స్‌పై 39 పరుగులతో ఈ సీజన్ స్టార్ట్ చేసిన వండర్ కిడ్... సన్‌రైజర్స్‌పై జైపూర్‌లో 35బంతుల్లోనే తుఫాన్ సెంచరీతో, ఆర్సీబీపై 78 రన్స్‌తో చెలరేగాడు. ఇక డీసీపై 46 రన్స్, గుజరాత్‌పై 36 రన్స్, పంజాబ్‌పై 43 రన్స్, కేకేఆర్‌పై 46 రన్స్ చేశాడు. వయసుకు మించి పెద్దఇన్నింగ్స్ ఆడుతున్న వైభవ్ నుంచి రాజస్థాన్ రాయల్స్, ఫ్యాన్స్ ఇంకా పెద్ద ఇన్నింగ్స్‌లో ఆశిస్తున్నారు. దీంతో అతనిపై మరింత ఒత్తిడి పెరుగుతోంది.

వైభవ్ గత ఐపీఎల్ కంటే ఈ ఐపీఎల్‌కు మరింత పరిణతి సాధించాడు. మ్యాచ్ పరిస్థితులకు అనుగుణంగా ఆటను మార్చుకునే నైపుణ్యం అతనిలో కనిపిస్తోంది. ప్రారంభంలో వేగాన్ని పెంచడం ద్వారా జట్టుకు అవసరమైన పరుగులను అందిస్తున్నాడు. అతని టెక్నిక్ కూడా అమోఘం. ఫాస్ట్ బౌలర్లను ధైర్యంగా ఎదుర్కొంటూ,స్పిన్నర్లపై ఫుట్‌వర్క్‌తో ఆధిపత్యం చలాయిస్తున్నాడు. ఈఆటతీరే ఇతర యువ ఆటగాళ్లతో పోలిస్తే ప్రత్యేకంగా నిలబెడుతోంది.

వైభవ్ బ్యాటింగ్ మరింత స్థిరంగా మారాలంటే షాట్ల ఎంపికలో సయమనం పాటించాలని పలువురు మాజీలు సూచిస్తున్నారు. ఈ కొద్ది మార్పులు చేసుకుంటే 30, 40 పరుగులను బిగ్ స్కోర్లుగా మారతాయని పేర్కొంటున్నారు. మొదటి బంతికే సిక్స్ అని కాకుండా అభిషేక్ ఎలాగైతే మార్పుచేసుకున్నాడో వైభవ్ కూడా మారాల్సిందే నంటున్నారు. దూకుడే ప్రతిదానికి పరమమంత్ర కాదని సూచిస్తున్నారు.

## గోల్డెన్ మాస్టర్స్ సాధించిన సినెర్

**రోమ్:** పురుషుల టెన్నిస్ ప్రపంచ నెంబర్ వన్ యానిక్ సినెర్ అరుదైన ఘనత అందుకున్నాడు. గోల్డెన్ మాస్టర్స్ ఘనత సాధించాడు. ఈ సీజన్‌లో తన జోరు కొనసాగిస్తూ సొంతగడ్డపై రోమ్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 టైటిల్ చేజిక్కించుకున్నాడు. పురుషుల సింగిల్స్ ఫైనల్లో సినెర్ 6-4, 6-4తో వరుస సెట్లలో నార్వే ఆటగాడు కాస్పర్ రూడ్‌పై అలవోకగా గెలుపొందాడు. సినెర్ బలమైన సర్వీసులు, ప్లేసింగ్‌ల ముందు రూడ్ నిలవలేకపోయాడు.సినెర్‌కు 10,07,165యూరోల (రూ. 11 కోట్ల 23 లక్షలు) ప్రైజ్‌మనీతో పాటు 1000ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

ఈ టైటిల్‌తో యానిక్ సినెర్.. కెరీర్ గోల్డెన్ మాస్టర్స్ ఘనత పూర్తి చేశాడు. మాస్టర్స్ సిరీస్-1000లో భాగంగా జరిగే తొమ్మిది వేర్వేరు టోర్నీలన్నింటిలో విజేతగా నిలిచిన రెండో ప్లేయర్‌గా సినెర్ నిలిచాడు. మయామి, మాడ్రిడ్, మోంటె కార్లో, ఇండియన్ వెల్స్, రోమ్, పారిస్, షాంఘై, సిన్సినాటి, కెనడా ఓపెన్ టైటిల్స్ సాధించాడు. సినెర్ కెరీర్‌లో ఇది 10వ మాస్టర్స్ సిరీస్ టైటిల్. మయామి ఓపెన్‌ను రెండుసార్లు నెగ్గిన సినెర్.. మిగతా ఎనిమిదింటిని ఒక్కోసారి సాధించాడు. 1990లో మాస్టర్స్ సిరీస్ మొదలుకాగా... ఇప్పటివరకు నొవాక్ జొకోవిచ్ మాత్రమే రెండుసార్లు 2018లో, 2020లో కెరీర్ గోల్డెన్ మాస్టర్స్ ఘనత సాధించాడు.



## ముష్ఫికర్ సూపర్ సెంచరీ, పాక్ ముందు భారీ లక్ష్యం

**సైల్హెట్:** పాకిస్థాన్‌తో జరుగుతున్న రెండు టెస్ట్‌లోనూ బంగ్లాదేశ్ పట్టు బిగించింది. ముష్ఫికర్ రహీమ్(233 బంతుల్లో 137; 12 ఫోర్లు) సూపర్ సెంచరీకి తోడు లిటన్ దాస్(92 బంతుల్లో 69) రాణించడంతో బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్‌లో 390పరుగులకు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 46 పరుగులు కలుపుకుని 437 పరుగుల భారీ లక్ష్యాన్ని పాకిస్థాన్ ముందుంచింది. బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 278 పరుగులు చేయగా,పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 232 రన్స్‌కు ఆలౌటైంది. ఇంకా రెండు రోజుల ఆట మిగిలి ఉంది.తొలి టెస్ట్‌లో ఘనవిజయం సాధించిన బంగ్లాదేశ్ ఈ టెస్ట్‌లోనూ నెగ్గి రెండు టెస్ట్‌ల సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేయడంపై దృష్టి పెట్టింది.

మూడో రోజు ఆటలో ముష్ఫికర్, లిటన్‌దాస్ పాక్ బౌలర్లను ధీటుగా ఎదుర్కొన్నారు. అయిదో వికెట్‌కు శతక భాగస్వామ్యాన్ని అందించారు. ఆ తర్వాత కూడా ముష్ఫికర్ జోరు చూపి సెంచరీ పూర్తి చేశాడు. ఇది టెస్ట్‌ల్లో ముష్ఫికర్‌కు 14వ శతకం. బంగ్లా తరఫున టెస్టుల్లో అత్యధిక సెంచరీలు చేసిన క్రికెటర్‌గా ముష్ఫికర్ నిలిచాడు.

## ఆల్‌టైమ్ కనిష్టానికి డాలర్ వర్సెస్ రూపాయి

**ముంబయి,మే18:**భారతకరెన్సీ రూపాయి విలువ సోమవారం చారిత్రక కనిష్ఠ స్థాయికి పడిపోయింది. అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 0.2 శాతం క్షీణించి 96.20వద్ద ఆల్ టైమ్ కనిష్టానికి చేరింది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీయడంతో భారీ పతనం నమోదైంది. గత శుక్రవారం తొలిసారిగా 96 మార్కును దాటిన రూపాయి, ఈ సోమవారం మరింత బలహీనపడింది. ముఖ్యంగా ముడి చమురు ధరలు పెరగడం రూపాయిపై తీవ్ర ఒత్తిడిని పెంచుతోంది. యూఏఈలోని ఓ అణు విద్యుత్ కేంద్రంపై దాడి జరిగిందన్న వార్తల నేపథ్యంలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 111 డాలర్లకు పెరిగింది. దీనికి తోడు ఇరాన్‌పై అమెరికా సైనిక చర్యలకు దిగవచ్చన్న సంకేతాలు కూడా ఆందోళనలను పెంచుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో డాలర్‌కు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరిగింది. రూపాయి రికార్డు స్థాయి పతనం దేశ స్థూల ఆర్థిక దృక్పథంపై ఆందోళనలను తీవ్రతరం చేస్తోంది. ప్రస్తుత భౌగోళిక రాజకీయ అనిశ్చితి, ఇంధన ధరల ఒత్తిడి కారణంగా డాలర్‌కు డిమాండ్ పెరిగి రూపాయి 96 స్థాయిని దాటింది. దీనివల్ల దిగుమతుల బిల్లు, ద్రవ్యోల్బణం పెరిగి, ఆర్థిక వృద్ధి మందగించే ప్రమాదం ఉందని ఎన్రిచ్ మనీ సీఈవో పొన్ముడి ఆర్ తెలిపారు. ఈ బలహీన సెంటిమెంట్ స్టాక్ మార్కెట్లపైనా ప్రభావం చూపింది. సెన్సెక్స్ 808 పాయింట్లు, నిఫ్టీ 247పాయింట్ల నష్టంతో ప్రారంభమయ్యాయి.మరోవైపు, రూపాయి పతనాన్ని అడ్డుకునేందుకు ప్రభుత్వం, ఆర్బీఐ చర్యలు చేపట్టాయి.వెండిదిగుమతులపై ఆంక్షలు విధించడంతో పాటు,కరెన్సీ మార్కెట్లలో ఆర్బీఐ జోక్యం చేసుకుంటోంది.ప్రత్యేక డాలర్ విక్రయాల కౌంటర్లు ప్రారంభించింది. ఈ వారమంతా రూపాయిపై ఒత్తిడి కొనసాగవచ్చని ట్రేడర్లు అంచనా వేస్తున్నారు.

## జిడిపిలో 2.3 శాతంగా కరెంట్ ఖాతా లోటు



**న్యూఢిల్లీ,మే 18:**భారత్ కరెంటుఖాతాలోను ఈ ఆర్థిక సంవత్సరంలో జిడిపిలో 2.3శాతంగా ఉంటుందని విదేశీ బ్రోకరేజి సంస్థ సోమవారం ప్రకటించింది. చెల్లింపుల్లో సమతుల్యత లోటు కూడా 65బిలియన్ డాలర్లుగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఉంటుందని, అదే గత ఏడాది 35 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు హెచ్‌ఎస్‌బిసి సంస్థ వెల్లడించింది. ముడిచమురుదరలు సగటున బ్యారెల్‌కు 95 డాలర్లుగా ఉంటాయని, చమురు, బంగారం, కీలక ఉత్పత్తులు, సేవలరంగ వాణిజ్యం, విదేశీ జమలు కూడా కరెంటు ఖాతాలోటును జిడిపిలో 2.3 శాతానికి చేరుస్తాయని, అదే గత ఏడాది 0.9శాతంగా ఉందని సంస్థ ప్రకటించింది బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్ అంచనాలు కూడా ఎఫ్‌పిఐ నిధుల రాక, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, విదేశీ వాణిజ్య రుణాల ధోరణుల ఆధారంగా ఉంటాయని ప్రకటించింది. విదేశీ రిజర్వులు 700 బిలియన్ డాలర్ల వరకూ ఉంటాయని, అందువల్లనే ఖజానా పరిపుష్టంగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే పెట్రోలుధరల పెంపు కారణంగా అదనంగా 2/3వంతు నిధులు అవసరం అవుతున్నాయని అంచనావేసింది. ఇటీవలే సంతకాలుచేసిన వాణిజ్య డీల్స్‌తో భారత్ వృద్ధి అవకాశాలు మరింతపెరుగుతాయని, ఎఫ్‌డిఐల రాక మరింత పెరగవచ్చని అంచనావేసింది. విదేశీ పెట్టుబడులపై భారత పన్నుల వ్యవస్థ తీరుతెన్నులు కూడా జిడిపిపై ప్రభావంచూపిస్తాయని అంచనావేసింది.

## నాలుగు కేటగిరీలుగా టిసిఎస్ ఇంక్రిమెంట్లు

**ముంబయి, మే 18:** ఐటిసేవలరంగ దిగ్గజం టిసిఎస్ ఉద్యోగులకు 6 నుంచి 8శాతం వేతనాలను పెంచుతున్నట్లుప్రకటించింది. అత్యధిక పని తీరు చూపించిన ఉద్యోగులను టాప్‌రేటింగ్‌గ్రేడ్ అంటే ఏప్లస్ కేటగిరిలో చేర్చింది. వీరికి 10శాతం జీతాల పెంపునుప్రకటించింది. గత ఏడాదినుంచి ఎదుర్కొంటున్న గ్లోబల్ అనిశ్చితులనుంచి రికవరీ అవుతున్న కంపెనీ సహజంగా ఇచ్చే వేతన పెంపునే ప్రకటించింది. దీనితోజీతాల పెంపు కూడా కొంత జాప్యం జరిగింది. స్థూల ఆర్థికవ్యవస్థలో ఉన్న అనిశ్చితులకారణంగానే వేతన పెంపును సెప్టెంబరుకు వాయిదాడేసింది. అయితే ఏప్రిల్‌లో మాత్రం కంపెనీ తమ ఉద్యోగులకు ఏప్రిల్‌నుంచే వేతన పెంపు వర్తిస్తుందని ప్రకటించింది. ఉద్యోగులను కంపెనీ ఏప్లస్,ఏ, బి, సి కేటగిరీలుగా వర్గీకరించింది. కంపెనీ నాలుగోత్రైమాసికంలోప్రకటించిన ఫలితాలకు అనుగుణంగా ఈ వేతన పెంపు ఉంది. అర్హత కలిగిన ఉద్యోగులకు వార్షిక ఇంక్రిమెంట్లు కూడా ఇచ్చామని, అదనంగా భారత్‌లోని అందరు ఉద్యోగులకు కొత్త లేబర్ కోడ్‌లను పరిగణనలోనికి తీసుకుని అదనపు ప్యాకేజిలు కూడా వర్తింపచేసినట్లు వెల్లడించింది. వరించిన వేతన ప్యాకేజిలతో ఉద్యోగులకు మరింత ప్రయోజనం ఉంటుందని వెల్లడించింది. కంపెనీలో తక్కువ కేడర్ ఉద్యోగులకు 2-3 శాతం వేతన పెంపు ఉంటే విదేశీ ఉద్యోగులకు 2-4 శాతంమాత్రమేప్రకటించింది.

## చివరి నిమిషం ఐటి ర్యాలీతో.. స్వల్పలాభాల్లో స్టాక్ మార్కెట్లు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం స్వల్ప లాభాలతో ఫ్లాట్‌గా ముగిశాయి. రోజులో చాలా వరకు నష్టాల్లో ట్రేడ్ అయిన సూచీలు, చివరి గంటలో ఐటీ షేర్లలో వచ్చిన బలమైన కొనుగోళ్ల మద్దతుతో కోలుకున్నాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 77.05 పాయింట్ల లాభంతో 75,315.04 వద్ద, నిఫ్టీ 6.45 పాయింట్ల లాభంతో 23,649.95 వద్ద స్థిరపడ్డాయి. వారం ప్రారంభ రోజున ట్రేడింగ్‌లో ఐటీ రంగం గరిష్టంగా ప్రకాశించింది. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 2 శాతానికి పైగా పెరిగింది. టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు నిఫ్టీలో టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. ప్రపంచ అనిశ్చితి నేపథ్యంలో ఇన్వెస్టర్లు రక్షణాత్మక రంగాలైన ఫార్మా, హెల్త్‌కేర్ వైపు మొగ్గు చూపారు. దీంతో ఆ రంగాల షేర్లలో కూడా కొనుగోళ్ల ఆసక్తి కనిపించింది. బ్రాడర్ మార్కెట్‌లో మాత్రం అమ్మకాల ఒత్తిడి స్పష్టంగా కనిపించింది. నిఫ్టీ




మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.15 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 1.26 శాతం మేర నష్టపోయాయి.

నిఫ్టీ కన్స్యూమర్ డ్యూరబుల్స్, పీఎస్‌యూ బ్యాంక్ సూచీలు అత్యధికంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, ముడి చమురు ధరలపై వాటి ప్రభావం వంటి అంశాలపై ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. ఇన్ఫోసిస్ 2.15శాతం, భారతి ఎయిర్‌టెల్ 1.76శాతం, ఐసిఐసిఐ బ్యాంకు 0.50శాతం సూచీలకు మద్దతుగా నిలిచాయి. బిఎస్‌ఇ మిడ్‌క్యాప్‌సూచీ 0.43శాతం, స్మాల్ క్యాప్ సూచీ 1.71శాతం చొప్పున క్షీణించాయి. మార్కెట్లలో బిఎస్‌ఇ పరంగా 1264 కంపెనీల షేర్లుపెరిగితే 3034 షేర్లు పతనం చెందాయి. 205 షేర్లు స్థిరంగా కొనసాగాయి. విదేశీ కరెన్సీ మార్కెట్‌లో డాలరుతో రూపాయి మారకం విలువ 96.33గా నిలిచాయి. ముందురోజు 95.81 కంటే గణనీయంగా క్షీణించింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్ ధరలు రూ.1,58,666కి చేరాయి. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్‌ముడిచమురు బ్యారెల్ ఒక్కింటికి 110.29 డాలర్లుగా కొనసాగింది.

ఇక కంపెనీలపరంగా గ్లాండ్ ఫార్మా 15.64 శాతం ఎగిరింది. బిఎస్‌ఇ షేర్లు కూడా 2.96శాతం పెరిగితే ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ బీమా 3.89శాతం క్షీణించింది. విఐపి ఇండ స్ట్రీస్ 3.96శాతం,భారత్ వైర్‌రోప్స్ 4.07శాతం క్షీణించాయి. నియోజెన్ కెమికల్స్ 0.94 శాతం పెరిగింది. వొడాఫోన్ ఐడియా 0.46 శాతం కెఇసి ఇంటర్నేషనల్ 11.14 శాతం చొప్పున క్షీణించాయి. అలాగే కొచ్చిన్ షిప్‌యార్డ్ 5.11 శాతం, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా 1.17 శాతం, హెచ్‌డిఎఫ్‌సి అసెట్ మేనేజ్‌మెంట్‌కంపెనీ 3.24శాతం క్షీణించాయి.

### ఖర్చులు తగ్గించుకోండి.. వర్చువల్ సమీక్షలే చేయండి!

## బ్యాంకులు, బీమా సంస్థలకు కేంద్రం ఆదేశాలు

**న్యూఢిల్లీ, మే 18:** ఖర్చులను భారీగా తగ్గించుకోవాలని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ దేశంలోని ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రభుత్వ బీమా సంస్థలు, ఆర్థిక సంస్థలకు సోమవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆర్థిక క్రమశిక్షణ, పొదుపు చర్యల్లో భాగంగా ప్రయాణాలపై తీవ్ర ఆంక్షలు విధించడంతో పాటు దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాలకు మారాలని స్పష్టం చేసింది. ఈ కొత్త నిబంధనలు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), బ్యాంక్ ఆఫ్ బరోడా, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) వంటి దిగ్గజ సంస్థలతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది ఉద్యోగులకు వర్తించనున్నాయి. ఆర్థిక సేవల విభాగం ఉత్తర్వుల ప్రకారం అత్యవసరమైతే తప్ప అన్ని రకాల సమావేశాలు, సమీక్షలు, సంప్రదింపులను వీడియో కాన్ఫరెన్స్ ద్వారానే నిర్వహించాలి. సంస్థల ఛైర్మన్లు, మేనేజింగ్ డైరెక్టర్లు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ల (సీఈఓ) విదేశీ ప్రయాణాల్లో పరిమితులుపాటించాలని తెలిపింది. సాధ్యమైనంత వరకు విదేశీ సమావేశాలకు వర్చువల్‌గానే హాజరుకావాలని పేర్కొంది.ప్రధాన కార్యాలయాలు, బ్రాంచ్ ఆఫీసుల్లో ప్రస్తుతం అద్దెకు వాడుతున్న పెట్రోల్, డీజిల్ వాహనాల స్థానంలో వీలైనంత వరకు ఎలక్ట్రిక్ కార్లను ప్రవేశపెట్టాలని ఆదేశించింది. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఉద్రిక్తతల వల్ల ఏర్పడే ఆర్థిక ప్రభావాలను తట్టుకునేందుకు ఖర్చులను తగ్గించుకోవాలని, పొదుపు పాటించాలని ప్రధానమంత్రి గతవారం పిలుపునిచ్చారు.పశ్చిమాసియాలో సుదీర్ఘకాలంగా సాగుతున్న ఉద్రిక్తతల వల్ల దేశ ఆర్థిక వృద్ధి మందగించడం, ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉంది.ఇప్పటికే భారత కరెన్సీ రికార్డు స్థాయి కనిష్ఠానికి పడిపోయింది. ఈ నేపథ్యంలో ఆర్థిక భారాన్ని తగ్గించుకోవడానికి ఇప్పటికే పలు రాష్ట్రాలు తమ ఉద్యోగులకు వారానికి 2 రోజులు వర్క్ ఫ్రమ్ హోమ్‌సౌకర్యాన్ని కూడా కల్పించాయి.









## హెచ్‌డిఎఫ్‌సిని వెనక్కి నెట్టిన ఎయిర్‌టెల్

**ముంబయి, మే18:** టెలికాం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ సరికొత్త రికార్డు సృష్టించింది. దేశీయ స్టాక్ మార్కెట్లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ను వెనక్కి నెట్టింది.దేశంలో రెండో అత్యంత విలువైన కంపెనీగా అవతరించింది. సోమవారం నాటి ట్రేడింగ్‌లో ఎయిర్‌టెల్ షేర్లు రెండు శాతానికి పైగా లాభపడటంతో ఈ రికార్డు సాధ్యమైంది. ఒక దశలో ఎయిర్‌టెల్ మార్కెట్ విలువ ఏకంగా రూ.11.90 లక్షల కోట్లకు చేరింది.అదే సమయంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మార్కెట్ క్యాప్ రూ.11.86 లక్షల కోట్లుగా నమోదైంది. దీంతో ఎయిర్‌టెల్ రెండో స్థానాన్ని దక్కించుకుంది. ప్రస్తుతం దేశంలో రూ.18.09 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్‌తో రిలయన్స్ ఇండస్ట్రీస్ మొదటి స్థానంలో కొనసాగుతోంది.

గత వారం రోజుల్లో ఎయిర్‌టెల్ షేర్లు 10 శాతం మేర లాభపడ్డాయి. కానీ ఇదే సమయంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు కేవలం 1 శాతం మాత్రమే పెరిగాయి. గత ఆరు నెలల్లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు 22 శాతం మేర పతనమవడం గమనార్హం. బ్యాంక్ పార్ట్ టైమ్ ఛైర్మన్ అతనుచక్రవర్తి రాజీనామా చేయడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఆర్థిక ఫలితాల విషయానికి వస్తే మార్చి31తో ముగిసిన త్రైమాసికంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ స్థిరమైన ప్రదర్శన కనబర్చింది. ఈ బ్యాంక్ నికర లాభం 10.9 శాతం పెరిగి రూ.1,912కోట్లకు చేరింది. బ్యాంక్ నికర ఆదాయం కూడా 3.2 శాతం వృద్ధితో రూ.3,380 కోట్లుగా నమోదైంది. నిరర్థక ఆస్తులు 1.15 శాతంతో స్థిరంగా ఉన్నాయి.

మరోవైపు టెలికాం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ నికర లాభం ఈ త్రైమాసికంలో 34 శాతం తగ్గింది. ఈ క్వార్టర్‌లో ఎయిర్‌టెల్ రూ.7,325 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఏడాది ఇదే క్వార్టర్‌లో కంపెనీకి రూ.11,021 కోట్ల లాభం వచ్చింది. గత ఏడాది లాభాల్లో రూ.2,892 కోట్ల పన్ను మినహాయింపు కలిసి రావడమే ఈ వ్యత్యాసానికి కారణమని ఎయిర్‌టెల్ పేర్కొంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.